అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


ఉన్మాదం దేశానికి ప్రమాదకరం 12

సంపుటి 08, సంచిక: 147 | ఆదివారం | 27-04-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు మారాయ్

- పదేళ్ల క్రితం పరిస్థితులు ఇప్పుడు లేవు
- ప్రత్యర్థులు కోపం, ద్వేషంతో రగిలిపోతున్నారు
- వారితో కాంగ్రెస్ పార్టీ పోటీ పడలేకపోతోంది
- పార్టీ గతచరిత్రను గుర్తుచేసుకుని భారత్ జోడో యాత్ర నిర్వహించా
- యాత్రలో అనేక పాఠాలు నేర్చుకున్నా
- 'భారత్ సమ్మిట్– 2025'లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ప్రజాపక్షం /హైదరాబాద్

"ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయని, పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని, రాజకీయాల్లో తమ ప్రత్యర్థులు కోపం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారని, ఆ విషయాల్లో వారితో కాంగ్రెస్ పార్టీ పోటీ పడలేకపోతోందని అఖిల భారత కాంగ్రెస్ కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అగ్ర నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. భారతదేశంలో ప్రస్తుతం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా, అణచివేసే దూకుడు రాజకీయాలు కొనసాగుతున్నాయని, విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనిగా మారిందని, మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్–2025'లో రెండవ రోజు శనివారం గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ కీలకోపన్యాసం చేశారు. ఈ సమ్మిట్‌లో సుమారు 100 దేశాలకు చెందిన 450 మంది ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు. సమ్మిట్‌లో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఒంటరిగా, రాజకీయంగా చిక్కుకుపోయినట్లు భావించామని ఆయన వెల్లడించారు. తమకు అందుబాటులో ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయని, మీడియా సహా ఏదీ తమకు అనుకూలంగా లేదని అన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలోనే తమ పార్టీ చరిత్రను గుర్తు చేసుకుని,

తరువాయి 2లో



## అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

'భారత్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు, అణగారిన కులాల ఆకాంక్షలు నెరవేర్చడం తమ కర్తవ్యమన్నారు. భారతదేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, 2024 ఆగష్టు 15 నాటికి రూ.20,617 కోట్లు చెల్లించి

తరువాయి 2లో



# 400 గుడిసెలు అగ్గికి ఆహుతి

- రంగారెడ్డి జిల్లా కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో పేదల గుడిసెల్లో భారీ అగ్నిప్రమాదం
- పేలిన సిలిండర్లు, ఎగిసిపడిన మంటలు
- పూర్తిగా దగ్ధమైన నిత్యావసర సరుకులు
- ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- గుడిసెలను పరిశీలించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్

బతుకుదెరువు కోసం పట్టణాలకు వచ్చి నివాసముంటున్న పేదల గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు గ్రామ సమీపంలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 3లో పేదలు వేసుకున్న గుడిసెల్లో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎండ తీవ్రతకు క్షణాల్లో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దాదాపు 30 సిలిండర్లు పేలడంతో మంటలు ఆకాశాన్నంటాయి. 400పైగా గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో

తరువాయి 2లో



కాళేశ్వరం ప్రాజెక్ట్

## మాజీ ఇఎన్‌సి ఇంట్లో ఎసిబి సోదాలు

- హరిరామ్ కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లు, ఫామ్ హౌస్‌లతోపాటు ఏకకాలంలో 14 చోట్ల దాడులు
- ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగా అధికారులు చర్యలు
- తనిఖీల్లో భారీగా ఆస్తి పత్రాలు లభ్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్‌ఐఎస్) మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) అధికారి హరిరామ్ ఇంటిపై శనివారం ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. హరిరామ్‌కు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, ఫామ్‌హౌజ్‌లతో పాటు మర్కూర్ తహసీల్దార్ కార్యాలయంపై ఏకకాలంలో 14 చోట్ల అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు దాడులు నిర్వహించారు. ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్ట్ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) వెల్లడించిన నివేధిక ఆధారంగా ఎసిబి

తరువాయి 12లో

# నేడు బిఆర్‌ఎస్ రజతోత్సవం

- వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగసభ
- కెసిఆర్ ప్రసంగంపై ఉత్కంఠ






ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి

బిఆర్‌ఎస్ రజతోత్సవం సభ ఏర్పాట్లు పూర్తి అయి సభకు సర్వ సిద్ధం చేశారు. అందరి చూపు బిఆర్‌ఎస్ రజతోత్సవం సభ వైపు నెలకొన్నది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లిలో ఇప్పటికే సభ కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తి సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏం చెబుతారో అనే విషయమై అందరూ చర్చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 2001లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి పేరును 5 అక్టోబర్ 2022న భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్)గా మార్చుకుంది. పేరు ఏదైనా పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు బంగారు తెలంగాణే లక్ష్యంగా కృషి చేశారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో దేశం మురిసేలా రజతోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందులో భాగంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. సభ సక్సెస్ చేసేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, చల్లా ధర్మారెడ్డి తదితరులు తమదైన పాత్ర పోషిస్తున్నారు. కాగా

తరువాయి 2లో




## పహల్గామ్ ఉగ్రదాడి క్షమించరానిది

- మానవ హననానికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలి
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్
- ఉగ్రదాడి మృతులకు నివాళిగా సిపిఐ కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

పహల్గామ్ ఘటన క్షమించరానిదని,హత్యాకాండకు పాల్పడిన ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నెక్లెస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో సిపిఐ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ

తరువాయి 2లో

## కూంబింగ్ ఆపండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ /హనుమకొండ


కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌ను తక్షణమే నిలిపివేయడంతో పాటు మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదేపదే ప్రతిపాదిస్తున్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదన్నారు. కర్రెగుట్ట అడవులలో వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి

తరువాయి 2లో

## కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయ్

- భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య తూటాల వర్షం
- నక్సల్స్ కోసం రంగంలోకి హెలిక్యాప్టర్లు, డ్రోన్‌లు
- ఆపరేషన్‌లో వడదెబ్బకు గురవుతున్న జవాన్లు





ప్రజాపక్షం/భద్రాచలం

అసలు కర్రెగుట్టల కథేంటి, ఆపరేషన్ కర్రెగుట్టల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 2026 మార్చి నెలాఖరు నాటికి మావపక్ష తీవ్రవాదాన్ని లేకుండా చేస్తామని చెప్పిన కేంద్ర హోం మంత్రి అమీత్‌షా ఆ దిశగా వడివడిగా అడుగులు ముందుకేస్తూనే ఉన్నారు. కాగా మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మావోయిస్టుల నెత్తుటి మరకలతో ఎంగిలవుతోంది. అడవుల్లో సమాంతర పాలన సాగించిన వారు ఇప్పుడు

తరువాయి 2లో

పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు

## క్రిమినల్ కేసులు వెల్లడించాల్సిందే

హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** పంచాయతీ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు వారిపై పెండింగ్ కేసుల సంబంధిత సమాచారాన్ని వెల్లడించాలన్న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తీర్పును శనివారం సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మండి జిల్లాలోని పంగ్నా గ్రామపంచాయతీకి చెందిన ప్రధాన్(హెడ్)ను తొలగించడానికి సంబంధించిన విషయమై హిమాచల్ ప్రదేశ్ హైకోర్ట్ నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. '2024 అక్టోబర్ 16న పిటిషనర్ చేసిన వాస్తవాల కల్పన హిమాచల్ ప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం1994


తరువాయి 12లో

## పోలీసులు, భద్రత బాధ్యత ఎల్‌జి, హోం శాఖదే


బైసరన్ పర్యాటక ప్రదేశం ఏడాది పొడవునా తెరిచే ఉంటుంది

**న్యూఢిల్లీ :** ఉగ్రదాడి జరిగిన మినీ స్విట్జర్లాండ్‌గా పిలువబడే బైసరన్ పర్యాటక ప్రదేశం ఏడాది పొడవున తెరిచే ఉంటుందని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ఉగ్రదాడి ఘటనపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో బైసరన్‌లో పర్యాటకుల సందర్శన ప్రారంభమైన విషయంలో పోలీసుల అనుమతి అడగలేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించినట్లు వార్తలు

తరువాయి 12లో



## భారత్, పాక్‌లే పరిష్కరించుకుంటాయ్



ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

**న్యూయార్క్ :** భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఎల్లవేళలా ఉద్రిక్తతలు ఉంటాయని, రెండు దేశాలు ఒకటి కాకపోతే మరో మార్గంలో వారంతట వారే పరిష్కారం చేసుకుంటారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. "నేను భారతదేశానికి సన్నిహితంగా ఉంటాను. అలాగే పాకిస్తాన్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటానని మీకు తెలుసు. కశ్మీర్ విషయంలో వారికి 1,000 ఏళ్ళ నుంచి పోరాటం జరుగుతూనే ఉంది. నాకు ఇద్దరు నేతలు తెలుసు. పాకిస్తాన్, భారత్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఉన్నాయి. కానీ, అవి ఎప్పటి నుంచో ఉన్నాయ'ని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడుల నేపథ్యం ఆయన శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు.



# ప్రపంచం
WORLD NEWS

## విస్కాన్సిన్ మహిళా న్యాయమూర్తి అరెస్టు



**మాడిసన్ :** అమెరికా విస్కాన్సిన్ మహిళా న్యాయమూర్తి హన్నా దుగన్‌ను ఎఫ్‌బిఐ అధికారులు అరెస్టు చేశారు. మిల్వాంకీ కౌంటీ సర్క్యూట్ జడ్జి దుగన్ ఒక అక్రమ వలదారుణ్ణి చట్టం నుండి ఉద్దేశపూర్వకంగా రక్షించేందుకు ప్రయత్నం చేశారని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ చెప్పారు. మెక్సికోకు చెందిన వలసదారుణ్ణి అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇమ్మిగ్రేషన్ అధికారులను సదరు జడ్జీ తప్పుతోవ పట్టించారనీ, కానీ అదృష్టవశాత్తూ అధికారులు అతడిని వెంబడించి పట్టుకున్నారనీ, ఈ నేరానికిగాను ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా కాష్ పటేల్ చెప్పారు. అరెస్టును అడ్డుకునేందుకు, నేరస్తుణ్ణి తప్పించేందుకు చేసిన రెండు నేరాలకుగాను ఆమెకు గరిష్ఠంగా ఆరు సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. ఐతే తాత్కాలికంగా ఆమెను పూచీకత్తుపై విడుదల చేశారు.

# గాజాలో ఐదేళ్లు యుద్ధ విరమణ

### ఒకేసారి ఇజ్రాయెల్ బందీలందరి విడుదల
### హమాస్ అంగీకారం



**కైరో :** పాలస్తీనాలో యుద్ధ విరమణకు హమాస్ ముందడుగు వేసింది. ఐదు సంవత్సరాలపాటు గాజాలో యుద్ధాన్ని విరమించేందుకు అంగీకరించింది. ఐదేళ్లపాటు శతృత్వాన్ని విడిచిపెట్టి కాల్పుల విరమణకు అంగీకరించింది. అదే విధంగా ఇజ్రాయెల్‌కు చెందిన బందీలందరినీ ఏకకాలంలో విడుదల చేసేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసింది. పాలస్తీనా గ్రూపుకు చెందిన అధికారి ఒకరు శనివారం ఈ విషయం చెప్పారు. ఇజ్రాయెల్ వద్ద జైళ్లల్లో ఉన్న ఖైదీలను విడుదల చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని పేరు చెప్పటానికి ఇష్టపడని పాలస్తీనా గ్రూపు అధికారి ఒకరు చెప్పారు. గడచిన కొద్ది రోజులుగా కైరోలో మధ్యవర్తులు హమాస్‌తో చర్చలు చేస్తున్నారు. ఈ చర్చల్లో మధ్యవర్తులతో సమావేశం జరిగిన 24గంటల తరువాత పాలస్తీనా గ్రూపు అధికారి ఈ విషయం ప్రకటించారు. ఈనెల 17వ తేదీన హమాస్ పాక్షిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని తిరస్కరించింది. ఇజ్రాయెల్ ఈ ప్రతిపాదన చేసింది. 10మంది ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తే 45 రోజులపాటు కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ప్రతిపాదించింది. కానీ అందుకు హమాస్ ఒప్పుకోలేదు. ఇప్పుడు మధ్యవర్తులతో చర్చల తరువాత హమాస్ తాజా ప్రకటన చేసింది. దీంతో గాజాలో ప్రజల కష్టాలు తీరే అవకాశాలు కనపడుతున్నాయి. 2023 అక్టోబర్‌లో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సరిహద్దు దాటి లోనికి వెళ్లి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 1200మందిని చంపారు. 250మందిని కిడ్నాప్ చేశారు. ఆ తరువాత గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో 61,000మంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ అగ్రనాయకులు మరణించారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో మానవ విలయాన్ని సృష్టించింది. దీంతో అంతర్జాతీయ న్యాయస్థానం నేతన్యాహుతోపాటు మరికొంతమందిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆ తరువాత మధ్యవర్తుల చర్చల ఫలితంగా ఈ ఏడాది జనవరి 19న గాజాలో 45 రోజుల కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ సమయంలో 33మంది బందీలను విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించగా 1800మంది పాలస్తీనా ఖైదీలను విడుదలచేసేందుకు ఇజ్రాయెల్ ఒప్పుకుంది. అయితే పూర్తిస్థాయిలో ఈ ఒప్పందం అమలు కాలేదు. 45రోజుల కాల్పుల విరమణ తరువాత తాజాగా చర్చలు జరగాలని హమాస్ పట్టుబట్టింది. అందుకు ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీంతో మార్చి 2వ తేదీనుండి ఇజ్రాయెల్ గాజాలోకి ఆహారంతోపాటు ఇతర మానవతా సహాయాన్ని రానీయకుండా అడ్డుకుంది. మార్చి 18న గాజాలో యుద్ధం మొదలైంది. హమాస్–ఇజ్రాయెల్ ఎట్టకేలకు మధ్యవర్తుల ద్వారా ఒక ఒప్పందానికి వచ్చే సూచనలు కనపడుతున్నాయి. ఈ విషయంపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

# వాటికన్‌సిటీలో ట్రంప్–జెలెన్‌స్కీ కీలక భేటీ

### శాంతి ఒప్పందం గురించేనా!



**వాటికన్‌సిటీ:** వాటికన్‌సిటీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ అనధికారిక సమావేశం జరిపారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరైన వారిద్దరూ ఆ కార్యక్రమానికి ముందుగా సెయింట్ పీటర్స్ బాసిలికా భవనంలో శనివారం నాడు సమావేశమయ్యారు. వారిద్దరిమధ్యా చర్చలు ఫలవంతమయ్యాయని అనంతరం వాషింగ్టన్ వర్గాలు ఒక ప్రకటన ద్వారా తెలియజేశాయి. ఈ చర్చలకు సంబంధించిన సారాంశం, దాని ఫలితాలను తర్వాత ప్రకటిస్తామని వాషింగ్టన్ వర్గాలు చెప్పాయి. అమెరికా దూత విట్‌కాఫ్ శుక్రవారంనాడు పుతిన్‌తో మాస్కోలో సమావేశమైన కొద్దిగంటలకు ఉక్రేన్, రష్యాలు ఒప్పందానికి చేరువలో ఉన్నాయని ట్రంప్ ప్రకటించారు. ఈ పూర్వరంగంలో జెలెన్‌స్కీతో ట్రంప్ ప్రైవేటు చర్చలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. విట్‌కాఫ్ ద్వారా చేరిన పుతిన్ సందేశాన్ని ఈ చర్చల్లో జెలెన్‌స్కీకి ట్రంప్ తెలియజేశారన్నదే ప్రధాన టాపిక్‌గా మారింది. రష్యాతో శాంతి ఒప్పందం చేసుకునే దిశగా ఉక్రేన్‌ను ముందుకు నడిపించేందుకు ట్రంప్‌కు ఈ ప్రైవేటు భేటీ అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. గడచిన ఫిబ్రవరి చివరిలో జెలెన్‌స్కీ అమెరికా పర్యటన చేసినప్పుడు ఓవల్ ఆఫీసులో చర్చల సందర్భంగా, అమెరికా చేసిన సాయానికి కనీసం కృతజ్ఞత కూడా చెప్పలేదని ట్రంప్ ఆగ్రహించి ముఖాముఖీ ''అరుపులాట''కు దిగిన ఘటన ప్రపంచదేశాలను నివ్వెరపరచింది. ఆ తర్వాత ఈ నాయకులిద్దరూ కలుసుకోవడం మళ్ళీ ఇదే మొదటిసారి.అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలోనే ఉక్రేన్‌లో యుద్ధాన్ని పరిష్కరిస్తానని, అంతర్జాతీయంగా శాంతి సాధిస్తానని అమెరికా ప్రజలకు తన ప్రసంగాల్లో ట్రంప్ ఊదరగొట్టారు. చివరకు యూరప్‌ను కూడా కాదనుకుని పూర్తిగా రష్యా పక్షాన ఆయన వాదిస్తున్నప్పటికీ యూరప్ నాయకత్వ వైఖరి కారణంగా వ్లాదిమిర్ పుతిన్‌కు ట్రంప్ నమ్మకం ఇవ్వలేకపోతున్నారు. 2022 ఫిబ్రవరి నుండి ఇప్పటివరకూ ఉక్రేన్‌లో జరిగిన పూర్తిస్థాయీ యుద్ధంలో 20 శాతం భూభాగాన్ని రష్యా స్వాధీనం చేసుకుంది. ముఖ్యంగా రష్యాతో వేలసంవత్సరాల చారిత్రక, సాంస్కృతిక భాషానుబంధం గల క్రిమియా ప్రాంతాన్ని రష్యా భూభాగంగా గుర్తించాలని ఇటీవలికాలంలో జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. అందుకు జెలెన్‌స్కీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. వాటికన్‌సిటీలో జరిగిన ప్రైవేటు చర్చల్లో ఇటీవల కీవ్‌పై రష్యా చేసిన హింసాత్మకదాడి, రష్యా మొండితనం, ఉద్దేశపూర్వకంగా శాంతి చర్చలను జాప్యం చేయడం వంటి అంశాలను ట్రంప్ దృష్టికి జెలెన్‌స్కీ తెచ్చే అవకాశమే ఎక్కువ. అదేవిధంగా ట్రంప్ కూడా ఉక్రేన్‌లో ఖనిజ వనరుల ఒప్పందం గురించి, రష్యాతో శాంతి చర్చల గురించి, క్రిమియాను రష్యాకు వదులుకునే విషయం గురించీ ప్రస్తావించే అవకాశం ఉంది.కీవ్‌పై జరిగిన దాడులను ట్రంప్ కూడా తీవ్రంగా ఖండించారు. ఇటీవలికాలంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ నాలుగుసార్లు సమావేశమయ్యారు. చివరిసారి శుక్రవారంనాడు మాస్కోలో వారిద్దరిమధ్య సమావేశం సందర్భంగానే రష్యా ఉన్నతస్థాయీ సైనిక జనరల్ కారు బాంబు పేలుడులో హతుడయ్యారు. ఈ హత్యకు ఉక్రేన్ ప్రభుత్వమే కారణమని రష్యా ప్రభుత్వం ఆరోపించింది. ఈ విషయంకూడా ట్రంప్, జెలెన్‌స్కీ చర్చల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది.

# మనసులమధ్య వంతెనలు నిర్మిద్దాం

### వాటికన్‌సిటీలో మానవతా ప్రతిధ్వనులు
### ప్రపంచ నేతల సమక్షంలో పోప్ ఫ్రాన్సిస్ ఖననం

**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ మతగురువు పోప్ ఫ్రాన్సిస్ (1936–2025) శనివారం మధ్యాహ్నం శాశ్వత సమాధికిలోకి వెళ్ళారు. శాంతా మారియా మొగ్గియోర్ చర్చ్ వరకూ ఊరేగింపుగా ఆయన భౌతిక కాయాన్ని తీసుకువెళ్ళి అక్కడే ఖననం చేశారు. ఫ్రాన్సిస్ ముందుగా తన మరణ వీలునామాలో కోరిన ప్రకారమే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. మట్టల ఆదివారం మరునాడు ఈనెల 21వ తేదీన గుండెపోటుతో 88వ యేట వాటికన్‌సిటీలో మరణించారు పోప్ ఫ్రాన్సిస్. ప్రపంచ దేశాల నాయకులు, రాజులు, రెండున్నర లక్షమంది ప్రజల సమక్షంలో రోమ్‌లోని ఒక చర్చిలో ఫ్రాన్సిస్‌ను ఖననం చేశారు. డీన్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ కార్డినల్ గియోవన్నీ బాటిస్టా రే పోప్ ఫ్రాన్సిస్ ఆత్మను దేవునికి అంకితం చేశారు. మొత్తం ఖనన కార్యక్రమానికి ఆయన సారథ్యం వహించారు. దేవుడు నిర్మించిన పరలోక ప్రపంచ పౌరసత్వాన్ని పోప్ ఫ్రాన్సిస్ స్వీకరించారని ప్రకటించారు. మనుషులమధ్య, మనసులమధ్య వంతెనలు నిర్మించాలి తప్ప గోడలు కట్టకూడదని ఫ్రాన్సిస్ తన జీవితకాలంలో గొప్ప మానవతా సందేశాన్ని ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఆయన కోరిక ప్రకారం మనసులమధ్య, మనుషులమధ్య వంతెనలు నిర్మిద్దామని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత సెయింట్ పీటర్స్ స్క్వేర్ గంటల ధ్వనులతో మారుమోగిపోయింది. దీంతో గురువులు,



ప్రపంచనేతలు అక్కడి నుండి నిష్క్రమించారు. సమాధి అనంతరం గియోవన్నీ బాటిస్టా రే, లాటిన్ భాషలో దేవుణ్ణి ప్రార్థిస్తూ, ''ఓ దేవా! ఆత్మలకు విశ్వసనీయమైన ప్రతిఫలమిచ్చువాడా! ఈ భూమిమీద పీటర్ వారసుడుగా, ఎంతో విశ్వసనీయతతో నీ చర్చికి కాపరిగా బాధ్యతలు నిర్వహించి నిష్క్రమించిన ఫ్రాన్సిస్ పరలోక స్వర్గంలో నీ సమక్షంలో నీ కృప, కరుణలతో శాశ్వతంగా ఆనందించనివ్వండి'' అని తుదిప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోప్ పదవిలో ఫ్రాన్సిస్ మానవాళికి చేసిన అసాధారణ సేవలను, ఆయన మానవత, కరుణాదృష్టి ఆలోచనా విధానాలను గుర్తుచేసుకున్నారు. వాటికన్ సిటీలో ఆయన చేసిన సంస్కరణలను గుర్తుచేసుకున్నారు. క్రైస్తవులకు వాటికన్ సిటీని మాతృకగా, మూల కుటుంబంగా ఆయన భావించారు. అన్ని ఆలోచనా ధోరణలకు చెందిన క్రైస్తవ సంఘాలన్నీ భూమ్మీద దేవుని కార్యంకోసం సమైక్యం కావాలని ఫ్రాన్సిస్ తన ప్రసంగాల్లో తరచు పిలుపు ఇచ్చేవారు. తన మరణానికి ముందు పామ్ సండేనాడు వాటికన్‌సిటీలో ప్రజలకు దర్శనమిచ్చారు. గాజాలో యుద్ధాన్ని విరమించాలని, ఆకలిగొన్న పాలస్తినా ప్రజల ఆకలి తీర్చాలని ఆయన పిలుపు ఇచ్చారు. కాగా కొత్త పోప్ ఎంపిక ప్రక్రియకు కొద్ది సమయం పడుతుంది. రహస్య ఓటింగ్ పద్ధతిలో కార్డినల్స్ కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. పొగగొట్టం ద్వారా తెల్లపొగ వస్తే పోప్ ఎంపిక ప్రక్రియ పూర్తయిందని అందరూ అర్థం చేసుకుంటారు. నల్లపొగ వస్తే ఇంకా ఆ ప్రక్రియ పూర్తికాలేదని అర్థం చేసుకుంటారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద జరిగిన కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రిటన్ రాజ దంపతులు ఛార్లెస్, కెమెల్లా, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, లాటిన్ అమెరికా దేశాల నాయకులు లులా డసిల్వా, గ్జేవియర్ మిలై తదితరులు ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇరాన్ పోర్టులో పేలుడు

### నలుగురు మృతి,516 మందికి గాయాలు



**టెహ్రాన్ :** ఇరాన్ రేవు పట్టణం బాందర్ అబ్బాస్‌లో శనివారంనాడు భారీ పే లుడు సంభవించింది. ఈ పేలుడులో నలుగురు మృతి చెందగా 516 మంది గాయపడ్డారు. రాజధాని టెహ్రాన్‌కు వెయ్యి కి.మీ దూరంలో ఈ రేవు పట్టణం ఉంది. పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్‌కు చెందిన సినా కంటైనర్ యార్డ్ లో ఈ భారీ పేలుడు ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన, త్వరగా మంటలకు గురయ్యే పేలిపోయే వస్తువులను భద్రపరచడంలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఈ పేలుడు సంభవించిందని ప్రాథమి క సమాచారం ద్వారా వెల్లడైందని అధికారులు చెప్పారు. ఈ ఘటన తర్వాత ఇరానియన్ పెట్రోలియం రిఫైనింగ్, డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ ఒక ప్రకటన చేస్తూ, ఈ ప్రాంతంలో తమ నిల్వలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొం ది. ఈ పేలుడు ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా నల్లటి పొగ మేఘాలు కమ్ముకున్నాయి. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి.


## క్షమించరానిది (మొదటి పేజీ తరువాయి)

అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కనీస మానవత్వం లేకుండా అత్యంత దారుణంగా ఉగ్రవాదులు జరిపిన ఈ మానవ హననం క్షమించరాని నేరమని, ఇందుకు పాల్పడిన వారిపై ఈ దాడులకు పాల్పడిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పుల్వామా సంఘటన జరిగిన సమయంలోనే ఉగ్రవాదుల పట్ల కేంద్రప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఉండే ఇప్పుడు పహల్గాం ఘటన జరిగేదే కాదనిఆయన పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజలు, సైనికుల ప్రాణాలను పణంగా పెట్టి ఆడుతున్న ఓట్ల రాజకీయం ఇప్పకైనా మానుకోవాలని హితువు పలికారు.ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిని ప్రజలందరూ ఖండిస్తూ ముందుకు రావటం మన ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయితే సంఘపరివార్ శక్తులు ఉద్దేశపూర్వకంగా ముస్లిం మతానికి సంబంధించిన సమూహం పట్ల విద్వేషాలు రెచ్చగొడుతూ సోషల్ మీడియాలో ప్రకటనలు గుప్పిస్తూ ప్రజలను చీల్చే ప్రయత్నం సరైంది కాదని, ఈ అంశంలో యావత్ భారత సమాజమంతా చైతన్యంతో మెలగాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహా మాట్లాడుతూ పహల్గాం ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కల్పించి వారినీ ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయము కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వివిఎస్‌బోస్ మాట్లాడుతూ కాశ్మీర్ లో సాధారణ పరిస్థితి నెలకొల్పాలంటే అక్కడి ప్రజల మన్ననలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పొందాల్సిన అవసరముందని, ఇందుకు వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమయంలో భావోద్వేగ ప్రకటనలకు భారత ప్రభుత్వం దూరంగా ఉండి సమస్య పరిష్కారం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలతో ఒత్తిడి తీసుకొచ్చి ఈ ఉగ్రవాద నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి స్టాలిన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చందు ,జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, సలీం ఖాన్ ఉమర్ ఖాన్, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్,డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమూద్,నరసింహ, కళ్యాణ్,అనిల్, లతీఫ్, ఎఐవైఎఫ్ నాయకులు హేమంత్, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూంబింగ్ ఆపండి (మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా మారణహోమం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అణచివేత ఒక్కటే మార్గం కాదని వాటిని చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్ధమని మరోసారి చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం శ్రేయస్కరం కాదని సూచించారు. ఇప్పటికే మావోయిస్టులు పదుల సంఖ్యలో హతమైయ్యారని, అలాగే పదుల సంఖ్యలో సాయుధ బలగాలు వడదెబ్బకు గురైనట్లు సమాచారం వస్తున్న నేపథ్యంలో వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని తక్షణమే కూంబింగ్‌ను నిలిపివేయాలన్నారు.

**కాల్పులు నిలిపివేయాలి : ప్రొఫెసర్ హరగోపాల్**



ములుగు జిల్లా కర్రెగుట్టలపై కాల్పులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో ప్రొఫెసర్ హరగోపాల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఛత్తీస్ ఘడ్ తెలంగాణ సరిహద్దులలోని కర్రేగుట్ట లో కాల్పులను కేంద్రం ప్రభుత్వం తక్షణమే నిలిపి వేసి, శాంతియుత వాతావరణం పునరుద్ధరించాలని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి మావోయిస్టు పార్టీ ఉన్నదని, ఆదివాసి ప్రజలు భయానక వాతావరణం లో ఉన్నారని, స్మశానంలో చర్చలు జరపాలని కేంద్రం అనుకుంటున్నదని, పోరాటం చేస్తున్న వారి తో శాంతి చర్చలు జరపాలని అన్నారు.

# నెరవేర్చడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రైతు రుణ మాఫీ ద్వారా 25.50 లక్షల మంది రైతులను పూర్తిగా రుణ విముక్తులను చేశామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చామని, అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. రైతు భరోసా కింద రూ. 12 వేలు ఇస్తున్నామని, వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చామని అన్నారు. ప్రజలకు ఏ సమయంలో ఏం కావాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బాగా తెలుసనని, ప్రజోపయోగ విధానాలను రూపొందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నీటి పారుదల, విద్యపై దృష్టి సారించారని, ఇందిరాగాంధీ గారు రోటీ, కపడా ఔర్ మకాన్ అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని, ఆ తర్వాత వచ్చినముగ్గురు కాంగ్రెస్ ప్రధానులు రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆధునికీకరణ, అభివృద్ధి, టెలికామ్, సాఫ్ట్ వేర్ వంటి ప్రపంచ సాంకేతిక విప్లవాలపై దృష్టి సారించారని, వారి కృషి వల్లే భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని వివరించారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యతను ఇస్తుందని, తమ ప్రభుత్వానికి మహిళలు, రైతులు, యువతే ప్రధాన భాగస్వాములన్నారు. దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ లలో జరిగిన పెట్టుబడుల సదస్సులకు తెలంగాణ ప్రతినిధి బృందం హాజరైందని, ప్రైవేటు రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారన్నారు. ప్రజల జీవితాలను మార్చేందుకు కాంగ్రెస్ చేపట్టిన మిషన్‌లో చేరాలని భారత్ సమ్మిట్ ప్రతినిధులందరినీ ఆహ్వానిస్తున్నామని, మీ అనుభవం, పరిజ్ఞానం, నైపుణ్యాలను తమతో పంచుకోవాలని సిఎం కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ప్రజలు కేంద్రం గా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగిస్తున్నామని, అణగారిన, పేద వర్గాల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు చెప్పుకునేందుకు భారత సమ్మిట్ ఒక వేదిక మాత్రమే కాదని, అనేక విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడిందన్నారు. అహింస, స్వతంత్రం, శాంతి వంటి అంశాలను గ్రహించామన్నారు. ఇప్పటికే వీటిని కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో తమ ప్రభుత్వ విధానాలు, పథకాలు, ఆలోచనల అమలులో వీటిని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

## అగ్గికి ఆహుతి (మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ప్రాణహాని సంభవించలేదు. అయితే గుడిసెల్లో ఉంటున్న వారి నిత్యావసర సరుకులతో పాటు విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. అప్పటికే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులో తీసుకోచ్చారు. అప్పటికే గుడిసెలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఎంటు తోచని పరిస్థితిలో అయోమయానికి గురయ్యారు. ఒకవైపు విద్యార్థుల బతుకులు అగ్నిలో కలిసిపోయినట్టుగా సర్టిఫికెట్లు పూర్తి కాలిపోవడంతో పాటు నివాసం ఉంటున్న గుడిసె వాసుల నిత్యవసర సరుకులు బియ్యం, మంచాలు, టీవీలు, ఫ్రీడ్జులు, కూలర్లు పూర్తిగా కాలిపోయాయి. ఆదుకునే పరిస్థితి ఎవరు లేకుండా ఉందని వారు వాపోయ్యారు. ఎంతో కాలంగా ఆశగా ఎదురుచూస్తున్న గుడిసె వాసులు తమ గోడు గుడు కోసం గుడిసె వెసుకుంటే ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తుందని ఎంతో ఆశగా ఉన్నారు. అనుమానస్పదంగా మంటలు రావడంతో గుడిసెలు పూర్తిగా కాలిపోవడం జరిగింది.

**గుడిసెవాసులను ప్రభుత్వం ఆదుకోవాలి:**
**చాడా వెంకట్‌రెడ్డి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు**

సిపిఐ పార్టీ చెపట్టిన భూ పోరాటంలో భాగంగా దాదాపు 1000పై చిలుకు గుడిసెలు అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కుంట్లూరు గ్రామ సమీపంలో రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో గుడిసెలు ఏర్పాటు చేశారు. గుడిసెలు వేసి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వం పేదోడి కోసం 40 గజాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. నష్టపోయిన గుడిసె వాసులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 10 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపినట్లు వారు తెలిపారు. విద్యార్థులు వారి సర్టిఫికెట్లు పూర్తిగా అగ్నిలో ఆహుతి కావడంతో వారిని వారి చదువుతున్న పాఠశాలలో తిరిగి సర్టిఫికెట్లు విప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మారుపాక అనిల్ కుమార్, సిపిఐ నాయకులు పబ్బతి లక్ష్మ ణ్, బాతరాజు నరసింహ, ప్రసాద్, వేణు, హరిసింగ్ నాయక్, సక్రు నాయక్ తదితరులు ఉన్నారు.

# ఎరుపెక్కుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

తలదాచుకునేందుకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. అడవిని జల్లెడపడుతున్న సిఆర్‌పిఎఫ్, జిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తూటాల వర్షం కురిపిస్తున్నాయి. ప్రస్తుతం మావోయిస్టులకు కర్రెగుట్టలు మాత్రమే షెల్టర్ జోన్‌గా మిగిలాయనే వాదన వినపిస్తోంది. ఈ గుట్టలపైనే మావోయిస్టు పార్టీ మోస్‌వాంటెడ్ హిడ్మా తోపాటు మరికొంత మంది బంకర్లో తలదాచుకున్నారని బలగాలు అనుమానిస్తున్నాయి. ఇక్కడ జరిగబోయే యుద్ధంలో బలగాలు విజయం సాధిస్తే ఆపరేషన్ కగార్ ఛత్తీస్‌గఢ్‌లో ముగిసినట్లే అంటూ పలువురు విప్లవోద్యమ విశ్లేషకులు భావిస్తున్నారు.

**గుట్టలపై మావోయిస్టులు**

తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆవరించి ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ ఉన్నట్లు పక్కా సమాచారం మేరకు సుమారు 10 వేల మంది భద్రతా బలగాలు ఆ గుట్టను మూడు వైపులా చుట్టుముట్టాయి. వారి ఆచూకి కనుగునేందుకు ఇప్పటికే కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు హెలీకాప్టర్లతో గగనతలం నుండి వీక్షిస్తోంది. మరో ప్రక్క అత్యాధునికమైన డ్రోన్లు సైతం ఛాయ చిత్రీలా సేకరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ గుట్టలపై వారి ఆచూకి లభ్యమైనట్లు ఇప్పటికే ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ఐజి ప్రకటించిన విషయం విధితమే. ఆ గట్టను మూడువైపులా ఇప్పటికే చుట్టుముట్టిన బలగాలు నెమ్మదిగా ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో జవాన్ల తీవ్ర అస్తవస్థకు గురవుతున్నారు. ఎండ వేడిమి కూడా అధికంగా ఉండటంతో జవాన్లు వడదెబ్బ భారినపడుతున్నారు. సుమారు 40 డిగ్రీలకు పై బడిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్ర గుట్ట అంచులకు చేరుకున్న బలగాలు మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయినట్లు, వారి వద్ద నుండి ఆయుధాలు స్వాదీనం చేసుకున్నట్లు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు కూడా వారి మృతదేహాలను బహిర్గతం కాలేదు. ఇప్పటి ఆరు రోజుల నుండి భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టి పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. కర్రెగుట్టలపైకి బలగాలు చేరితే పెద్ద ఎత్తున యుద్ధం చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఒక జవాన్‌కు ఐఇడి పేలి తీవ్ర గాయాలపాలయ్యాడు. గుట్ట చుట్టు మావోయిస్టులు ఐఇడిలు అమర్చారనే అనుమానంతో పూర్తిస్థాయిలో సోదాలు నిర్వహిస్తూ ఒక్కొక్క మెట్టుకు ఎక్కుతున్నట్లు జవాన్లు గుట్టను ఎక్కుతున్నారు. ఇదిలా ఉండగా ఆ రాష్ట్రముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న అతి పెద్ద ఆపరేషన్ ఇది అంటూ చెప్పుకొచ్చారు.మరో ప్రక్క కేంద్రప్రభుత్వ సమాచార ప్రసార శాఖ మీడియాకు సూచనలు చేసింది. యుద్ధవాతావరణానికి సంధించిన సమాచారం విషయంలో తగు జాగ్రత్తలతో ముందుకు సాగాలని సూచించింది. అందుకు సంబంధించి లేఖను సైతం విడుదల చేశారు. శాంతి చర్చలకు తాము సిద్ధమే అంటూ మావోయిస్టు పార్టీ మూడో సారి శుక్రవారం ప్రకటించినప్పటికీ కర్రెగుట్టల ఆపరేషన్ మాత్రం ఆరు రోజు కూడా కొనసాగుతోంది. మావోయిస్టు పార్టీ ఆవిర్భావం నుండి చూస్తే ఇంత వరకు శాంతిచర్చలకు తాము సిద్ధంగా ఉన్నాం, మా అభ్యర్ధనను ప్రభుత్వం పరిగణలోనికి తీసుకోవాలంటూ వరుస లేఖలు విడుదల చేయడం అదే తొలిసారి అంటూ చర్చసాగుతోంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులను చర్చలకు పిలిచారు. కానీ ఆచర్చలు సఫలం కాలేదు. ఇప్పుడు ఆపరేషన్ కగార్‌లో భాగంగా సాగుతున్న కర్రెగుట్టల కథ ఎటువైపు దారితీస్తుందో అంటూ అంతా ఉత్కంఠతతో ఉండగా శాంతిచర్చలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుకుంటున్నారు.

# రాజకీయాలు మారాయ్

(మొదటి పేజీ తరువాయి)

కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ పాదయాత్ర ద్వారా తాను ముఖ్యంగా రెండు విషయాలు నేర్చుకున్నానన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా మా ప్రత్యర్థులు కోపం, భయం, ద్వేషంపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారు. ఆ విషయంలో వారితో పోటీ పడటం మా వల్ల కాదు. కోపం, భయం, ద్వేషం విషయంలో వారు ప్రతిసారీ మమ్మల్ని అధిగమిస్తారు, ఓడిస్తారు' అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ నేపథ్యంలో తాము ఎక్కడ, ఎలా పని చేయాలనే అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. తమను తాము నిర్మించుకునే అవకాశం ఎక్కడ ఉందో ఆలోచించామని అన్నారు. ఉగ్రదాడి మృతులకు రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు.

## రజతోత్సవం (మొదటి పేజీ తరువాయి)

శనివారం మాజీ మంత్రి టి.హరీష్ రావు ఎల్కతుర్తిలోని బీఆర్‌ఎస్ బహిరంగ సభ స్థలాన్ని సందర్శించారు.ఆయన వెంట జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బిఆర్‌ఎస్ సభ విజయవంతం అవుతుందని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, అనేక ప్రాంతాల నుండి సభకు వచ్చేందుకు ఎడ్లబండ్ల పై తరలి వస్తున్నారని తెలిపారు.

**ఒక్క అడుగుతో మొదలైన ప్రస్థానం:** ఒక్క అడుగుతో మొదలైన టిఆర్‌ఎస్ ప్రభంజనంగా మారి.. ప్రత్యేక రాష్ట్ర కాంక్షను నిజం చేసింది. ఒక్కో అడుగు వేస్తూ.. ఇప్పుడు 25 ఏండ్ల పండుగకు సిద్ధమవడం సంబురంగా ఉందని.. ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరిదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. 14ఏళ్లు ఉద్యమ పార్టీగా..10ఏళ్లు అధికార పార్టీగా.. ఏడాదిన్నర ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసం గులాబీ జెండా. కొట్లాడుతోందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఒక క ఉద్యమ ఉద్యమ సంస్థగా ఏర్పడి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రవచించిన బోధించు, సమీకరించు.. పోరాడు అనే లక్ష్యంతో ప్రజాస్వామ్య పద్ధతిలో.. తెలంగాణను సాధించేందుకు టీఆర్‌ఎస్ ముందుకు సాగిందన్నారు.

**చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ :** ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎలుకతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి పల్లె నుంచి దండుగా కదిలి రావాలని మాజీ మంత్రి హరీష్ రావు,ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్ పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. దండిగా కదలాలి.. దండుగా రావాలి.. తెలంగాణలోని ప్రతి పల్లె మురవాలే.. పదవులు కాదు.. పాలన కాదు. ప్రజలే అంతిమం.. వారు ఏమిచ్చినా తీసుకుంటాం.. ఏం చేయమన్నా చేసి తీరుతాం.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం..... ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న చరిత్ర... అంతటి ఘనతకు కేరాఫ్ గా నిలిచిన కేసీఆర్ నేతృత్వంలోని పార్టీకి ప్రజల గుండెల్లో పదిలమైన స్థానం ఉందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పరిపాలనను చూసి తాము మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. కేసీఆర్ పాలనను, నేటి పాలనను చూసి అర్థం అర్థం చేసుకున్న ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలంటూ స్వచ్ఛందంగా సభకు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వారు వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రం సాధించిన నేతగా, దశాబ్ద కాలం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన నాయకుడిగా కేసీఆర్ మాటలు వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని వారు పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజలున్న తెలంగాణలో నిర్వహిస్తున్న ఈ సభచారిత్రాత్మకంగా నిలుస్తుందని ఇలాంటి సభలు కేవలం కేసీఆర్ తోనే సాధ్యమని వారు తెలిపారు. ఎల్కతుర్తి రజతోత్సవ సభ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రపంచ సుందరి పోటీలను
# వెంటనే రద్దు చేయాలి

### మహిళా, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచం మార్కెట్ విస్తరణ కోసం నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీలను వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మహిళా, యువజన, విద్యార్థి తదితర 27 సంఘాల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్కు వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, పిఒడబ్ల్యు నాయకురాలు సంధ్య, అరుణోదయ నాయకురాలు విమలక్క, ఐద్వ నాయకురాలు మల్లు లక్ష్మి, పిఒడబ్ల్యు ఝాన్సీ, అనసూయ మాట్లాడుతూ మిస్ ఇండియా కాదు, మిస్ వరల్డ్ కాదు, మిస్సింగ్ మహిళా కేసులను సత్వరమే తేల్చి వారి కుటుంబాలకు అందజేయాలని పేర్కొన్నారు. 120 దేశాల యువతులు అందాలు ఆరబోసి అలరించితే ప్రపంచ ప్రజలతోపాటు తెలంగాణ ప్రజలు చూసి తరించాలంటున్నారన్నారు. మహిళల భద్రత, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయలేని పాలకులు అందాల పోటీలకు రూ.200 కోట్లు కేటాయించడం వారి భూస్వామ్య మనస్తత్వానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్ సౌందర్యాన్ని గుర్తించలేని బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారి మనస్తత్వం కలిగిన వారే బాహ్య సౌందర్యాన్ని వీక్షించడం, కిరీటాలకు ఎంపిక చేయడం వ్యాపార వర్గాల వస్తువుల్ని వ్యాపారాలని పెంచుకోవడం కొరకే తప్ప మరొకటి కాదన్నారు.

బహుళ జాతి కంపెనీల నియంత్రణ ఆదేశాల మేరకే కిరీటాల ఎంపిక జరగడం విచారకరమని వారు పేర్కొన్నారు. తినడానికి తిండి లేక, రోగం వస్తే వైద్యం చేయించుకోలేక, ప్రసవ సౌకర్యాలు లేక అణగారిన వర్గాలకు చెందిన మహిళలు జబ్బుల పాలవుతుంటే, తింటే అరగని వాళ్లు కొందరు సౌందర్యాత్మక హింసకు బలవుతున్నారని, స్త్రీల అందాలకు, మేధస్సుకు కొలమానాలు, కొలతలు సృష్టించి సౌందర్యాత్మక ప్రపంచంలో ఆమెను బందీని చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్త్రీని అమ్మకపు వస్తువుగా చూసే సామ్రాజ్యవాద విష సంస్కృతి నశించాలని, అందుకు మహిళా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. అందాల పోటీలను అడ్డుకుని తీరుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డి.ఫైమీద, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యల గిరిజ, ఉజ్జిని హైమావతి, దేవమ్మ, లావణ్య, బాలమణి, లక్ష్మి, లావణ్య డప్పు కళాకారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో హైఅలర్ట్
### నలుగురు పాకిస్తానీయులకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు భారత్‌లో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లి పోవాలని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అన్ని రాష్ట్రాల సిఎంలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా ఫోన్ చేసి రాష్ట్రంలో ఉన్న పాకిస్తానీలను వెంటనే గుర్తించి వెనక్కి పంపాలని ఆదేశించారు. అదేవిధంగా డేటా పంపితే వీసాలు రద్దుచేస్తామన్నారు.

## 'వాతావరణ విద్యకు'
# యువత ప్రాధాన్యత

### మంత్రి కొండా సురేఖ ఉద్బోధ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ విద్యకు మన యువత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, తాను బలంగా నమ్ముతున్నానని పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భారత్ సమ్మిట్ ప్యానెల్ డిస్కషన్‌లో కొండా సురేఖ ప్రసంగిస్తూ చరిత్రాత్మకమైన హైదరాబాద్ నడిబొడ్డున జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో ప్రసంగించడం సంతోషంగా ఉందన్నారు. వాతావరణ న్యాయాన్ని వేగవంతం చేయడం ప్రభుత్వాల పని మాత్రమే కాదని, దీనికి విద్యావేత్తలు, పరిశ్రమలు, యువత, పౌర సమాజం క్షేత్రస్థాయిలోని సంఘాల భాగస్వామ్యం అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సెషన్ యొక్క థీమ్ 'వాతావరణ న్యాయాన్ని వేగవంతం చేయడం' ఇది మన దేశానికి, ప్రపంచానికి చాలా అత్యవసరం... సందర్భోచితం, ఇది ఇకపై సైద్ధాంతిక ఆలోచన మాత్రమే కాదు. ఇది ఒక సజీవ వాస్తవికత అని అన్నారు. పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటూ ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలో కూడా వాతావరణ మార్పులు పెరుగుతుండటాన్ని మనం చూస్తున్నామన్నారు. అస్థిర వర్షపాతం, రికార్డు స్థాయిలో వేడిగాలులు, వరదలు, జీవవైవిధ్యం కోల్పోవడం జరుగుతున్నాయని తెలిపారు. ఈ సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నప్పటికీ, దాని ప్రభావాలు మన అందరికీ స్థానికంగా కూడా ఉంటాయనీ అన్నారు. రైతులు, గిరిజనులు, మహిళలు, పిల్లలు, పట్టణ మురికివాడల నివాసితులు కార్బన్ ఉద్గారాలకు అతి తక్కువ కారణం అని పేర్కొన్నారు. అయినప్పటికీ, వారు ఎక్కువగా బాధితులు అవుతున్నారని అన్నారు. ఈ విషయంలో మనం వేగంగా... న్యాయంగా వ్యవహరించాలి. లేకపోతే చాలా నష్టపోతామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఈ మార్గంలో వెళ్తుందన్నారు.వనమహోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణలో పచ్చదనం జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వం 273 కోట్లకు పైగా మొక్కలను నాటిందన్నారు. అడవుల్లో ఉండే గిరిజనలకు స్థిరమైన వనరుల నిర్వహణలో సమాజ హక్కులు, శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.




# భూభారతి చట్టం రైతులకు గొప్పవరం

### రైతుల భూ భారతి అవగాహనా సదస్సులో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** భూ భారతి చట్టంతో రైతులకు ఉపయోగం ఉంటుందని, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు పనులు నిర్వహించాలని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం రైతులకు ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహనా సదస్సులో కూనంనేని మాట్లాడుతూ రైతులకు అనుభవదారు కాలంను ఇందులో పొందుపరచలేదని, ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. గ్రామాలలో సర్వే నెంబర్ ఆధారంగా సమస్యలున్నా భూములను పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పటేల్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతులు భూమి హక్కులు రికార్డుల గురించి తెలిపారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం ఉంటుందని, పాస్ పుస్తకాలలో భూమి పటం, ఇంటి స్థలంకు అబాది వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, ఆర్డీఒ డి. మధు, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగా సీతారాములు, తహశీల్దార్ శిరీష, డిటి నాగరాజు, ఎఒ నర్మద, అధికారులు, రాజకీయ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

### ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి
### ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటుచేయాలి
### విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి
### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్‌లు తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని తక్షణమే దానిని ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని మంత్రులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మం జిల్లాకు మాత్రమే లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఫీజుల దోపిడీ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సమీకృత గురుకులాలను ఆహ్వానిస్తున్నామని అదే సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న మిగిలిన గురుకులాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించకుండా సమీకృత గురుకులాలకు ఎలా నిర్మిస్తారన్నారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎఐఎస్‌ఎఫ్ఎ మతానికి వ్యతిరేకం కాదని మతం పేరుతో జరిగే ఉన్మాదానికి, మూఢత్వానికి వ్యతిరేకమన్నారు. మతోన్మాదుల దాడిలో మరణించిన అమరవీరులకు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి తరుపున సంతాపం, సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి అన్వర్, మాగం లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, మధు, శివ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్, గోపి, ప్రతాప్, రాకేష్, గణేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగులతో సమానంగా..
# గోల్డ్ అప్రైజర్స్‌కు గౌరవం ఇవ్వాలి

### ఎఐబిఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్యాంకు ఉద్యోగులతో సమానంగా గోల్డ్ అప్రైజర్స్‌కు గౌరవం ఇవ్వాలని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఎఐబిఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ ఘనంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.రవీందర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు బి.ఎస్.రాంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల ఆర్థిక వృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న అప్రైజర్స్ అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయడంతో పాటు అప్రైజర్స్‌కు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య కార్డులను అందజేయాలన్నారు. వారికి కమిషన్‌ను వేతనం రూపంలో అందజేసి గౌరవ ప్రదమైన జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన మార్గదర్శకాలు అప్రైజర్స్‌కు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు అప్రైజర్స్ సంసిద్ధంగా ఉండాలని నాయకులు దిశా నిర్దేశనం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శులు పి.వి.కృష్ణ రావు, నల్లపరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, అజయ్ కుమార్, మధు సూదన్, తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్రోజు రాఘవ చారి, ఆంధ్రప్రదేశ్ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గిగ్ వర్కర్ల కోసం నూతన చట్టం

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పనిచేస్తున్న గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లకు సంక్షేమం, సామాజిక భద్రత, బీమా తదితర సదుపాయాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నూతన చట్టాన్ని తీసుకురాబోతుందని దేశానికే ఆదర్శంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దుతున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసిసి)లో భారత్ సమ్మిట్ 2025 లో తెలంగాణ గిగ్ వర్కర్ల ముసాయిదా బిల్లుపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక భద్రత, కనీస వేతనాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఫుడ్ డెలివరీ, క్యాబ్ సర్వీస్, నిత్యావసర సరుకుల రవాణా, అర్బన్ క్లాప్ వంటి సేవలతో మన నిత్య జీవితంలో భాగమయ్యాయని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలో గిగ్ వర్కర్ల సాధికారత, సామాజిక భద్రత కోసం చర్యలు తీసుకుంటామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ముసాయిదా బిల్లును రూపొందిందని తెలిపారు. రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని వాటి కంటే ఉత్తమమైన విధానాన్ని తీసువస్తున్నామని చెప్పారు. ముసాయిదా బిల్లుపై కార్మిక శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా బిల్లు అద్భుతంగా ఉందని దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులు అభినందించారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ చర్చా గోష్టిలో కొలంబియా, బ్రెజిల్, ఈక్వెడార్, తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు, ఎఐసిసి బిసి, ఎస్‌సి, ఒబిసి, మైనార్టీ, అండ్ ఆదివాసీ విభాగ కోఆర్డినేటర్, మాజీ ఐఎఎస్ అధికారి కొప్పుల రాజు, అల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ కార్యదర్శి షేక్ సలావుద్దీన్, మజ్దూర్ కిషన్ శక్తి సంఘటన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో**
# గిరిజన ఉద్యోగులకు అన్యాయం

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో రూల్స్ ప్రకారం గిరిజన ఉద్యోగులకు రూల్స్ ప్రకారం దక్కాల్సిన పదోన్నతులు దక్కకుండా నేటికి కూడ తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందని, దీనిని తక్షణమే సరిదిద్దాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే తమ కొలువులు తమకు తమ నిధులు తమకని తెగించి పోరాడి తెలంగాణను సాధించుకున్నామని, కాని తెలంగాణలో నేటికీ కూడా వివిధ రంగాల్లో స్థానికులకు అన్యాయం జరుగుతూనే ఉదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు ప్రావీణ్యత కలిగిన ఇంజనీర్లు ఉన్నప్పటికీ వారిని కాదని, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి స్థానికేతరుడైన 70 ఏళ్ల దాటిన ఆర్‌సి కుమార్ అవుట్‌సోర్సింగ్ విధానంలోఫైనాన్స్ అడ్వైజర్‌గా నియమించుకొని ఆ పేరుతో నెల రూ.2.50లక్షలు వేతనం చెల్లించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అవుట్ సోర్సింగ్ వారిని తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇస్తే, తొలగించినట్లు చూపించి హౌసింగ్ కార్పొరేషన్‌లో లోపాయి కారిగా చేసి అక్రమంగా ఆర్‌సి కుమార్‌నే కొనసాగించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ఉద్యోగినిని లీగల్ అడ్వైజర్‌గా కూడా రూ.1.50లక్షల జీతం ఇస్తూ నియమించారని తెలిపారు. వెంటనే వారిని తొలగించి ప్రమోషన్ ప్రకారం వారి స్థానంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయినటువంటి తెలంగాణకు చెందిన స్థానిక డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజనీర్లను నియమించాలని పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండికి అంజయ్య నాయక్ విజ్ఞప్తి చేశారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
అమర్చింత మునిసిపాలిటీ, వనపర్తి జిల్లా. (TS)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో **2 పనులకు** టెండర్ ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభం తేది:** 28.04.2025న ఉ.10:30 గం.లకు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది:** 01.05.2025న సా.4:30 గం.ల వరకు. మరిన్ని వివరాలను ఆహ్వానించే బిడ్లను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. కమిషనర్ కార్యాలయం, అమర్చింత మునిసిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 8340817917, 7330690290.

సం/- కమిషనర్,
అమర్చింత మునిసిపాలిటీ
DIPR R.O. No. : 875-PP/CL/ADVT/1/2025-26, Date: 26-04-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6
NIT No.01/EE-6/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది:26.04.2025

**పని స్వభావం:** సిసి రోడ్లు మరియు డెయిన్ బాక్సు పనులు, **అంచనా విలువ:** రూ.443.10లక్షలు, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *డౌన్‌లోడ్ ప్రారంభ తేది:* 26.04.2025న మ.02.00గం.ల నుండి, *బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది:* 01.05.2025న మ.02.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎం.పీర్ సింగ్, ఇఇ, డివిజన్-6, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. ఫోన్ నం. 9154960551. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. గమనిక: టెండర్ నోటీసు తేదీ తరువాత 1% ఇఎండి పొందాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.6, చార్మినార్ జోన్,
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 905-PP/CL/ADVT/1/2025-26, Date: 26-04-2025



**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
**ఫారం-VII**
**(డిక్లరేషన్ / రూడి ప్రకటన)**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూలు 25(1) ను అనుసరించి)

**కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నెం. G3/1991/2024** **తేది: 24/04/2025**
**రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నెం. D/1367/2024** **తేది: 17/04/2025**
**గెజిట్ నెంబరు: 38/2025** **తేది: 24/04/2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ మండలము మల్లంపల్లి, జనగాం మరియు రేగొండ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 13.09 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున సేకరించుటకు నిర్ణయించినారు.

కావున సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ మండలము మల్లంపల్లి, జనగాం మరియు రేగొండ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 13.09 గుంటలు** గల భూమి ప్రయోజన నిమిత్తం అనగా గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు భూసేకరణ ప్రామాణిక కొలతలు గల భూమికై దిగువ వివరించిన విధముగా రూడి ప్రకట (డిక్లరేషన్) చేయబడుచున్నాము.

**షెడ్యూల్**

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | పట్టాదారు పేరు & అనుభవదారు పేరు | నిర్మాణాలు (చెట్లు, బోర్లు, బావులు, కట్టడములు మరియు ఇతరములు) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| **గ్రామము: మల్లంపల్లి మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట** | | | | | |
| **for excavation of Minor - 1R of D3 on Gouravelly Right side Main Canal from KM 0.343 to KM 1.400** | | | | | |
| 1 | 529 | మెట్ట/పట్టా | 0.30 | పంజా రమ భర్త యాదగిరిస్వామి (0.08)<br>కాశాబోయిన సమ్మయ్య తండ్రి పెద్దాపురం (0.08)<br>కాశాబోయిన శ్రీనివాస్ తండ్రి పెద్దాపురం (0.08)<br>తెలు హరీష్ తండ్రి అంజయ్య (0.06) | |
| 2 | 537 | మెట్ట/పట్టా | 0.22 | ఆళ్ళ చంద్రయ్య తండ్రి రామయ్య (0.06)<br>కాశాబోయిన శ్రీనివాస్ తండ్రి పెద్దాపురం<br>పంజ రవళి భర్త రాజు (0.15)<br>రోడ్ (0.01) | |
| 3 | 538 | మెట్ట/పట్టా | 1.04 | గాజుల కౌసల్య భర్త కొమురయ్య (0.14)<br>గాజుల మహేందర్ తండ్రి కొమురయ్య (0.1450)<br>గాజుల సంపత్ తండ్రి కొమురయ్య (0.1450)<br>రోడ్డు (0.01) | |
| 4 | 540 | మెట్ట/పట్టా | 0.15 | తిగుళ్ళ చంద్రయ్య తండ్రి హన్మంతు (0.15) | |
| 5 | 539 | మెట్ట/పట్టా | 0.27 | తిగుళ్ళ సంపత్ తండ్రి హన్మంతు (0.14)<br>తిగుళ్ళ రాజయ్య తండ్రి హన్మంతు (0.13) | |
| 6 | 522 | మెట్ట/పట్టా | 1.20 | పబ్బ సదానందం తండ్రి మొండయ్య (0.19)<br>మల్లం శ్రీకాంత్ తండ్రి నర్సయ్య (0.24)<br>మాచర్ల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.02)<br>మాచర్ల మొండయ్య తండ్రి మల్లయ్య (0.08)<br>మాచర్ల సంపత్ తండ్రి మల్లయ్య (0.06)<br>రోడ్డు (0.01) | |
| 7 | 511 | మెట్ట/పట్టా | 0.20 | మార్క యాదయ్య తండ్రి రాజయ్య (0.02)<br>మాచర్ల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.17)<br>రోడ్డు (0.01) | |
| | | **విస్తీర్ణం:** | **5.18** | | |
| **గ్రామము: జనగాం మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట** | | | | | |
| **for excavation of Minor - 3R of D1 on Gouravelly Right side Main Canal from KM 0.000 to KM 0.250** | | | | | |
| 1 | 403 | మెట్ట/పట్టా | 0.08 | కొడముంజ రామస్వామి తండ్రి మల్లయ్య (0.05)<br>వద్దిరాల కట్కూరి సాయిమల్లయ్య తండ్రి రాజయ్య(0.03) | |
| 2 | 408 | మెట్ట/పట్టా | 0.01 | కొమ్మెర శ్రీకాంత్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (0.01) | |
| 3 | 409 | మెట్ట/పట్టా | 0.10 | ఓద్దిరాల కొంరయ్య తండ్రి సాయన్న (0.04)<br>కోడముంజ పోచయ్య తండ్రి రాజయ్య (0.06) | |
| 4 | 410 | మెట్ట/పట్టా | 0.14 | కొమ్మెర శ్రీకాంత్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (0.10)<br>మౌటం భగత్ తండ్రి రాజయ్య (0.04) | |
| | | **విస్తీర్ణం:** | **0.33** | | |
| **గ్రామము: జనగాం మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట** | | | | | |
| **for excavation of Minor - 4TE of D1 on Gouravelly Right side Main Canal from KM 0.000 to KM 0.300** | | | | | |
| 1 | 621 | మెట్ట/పట్టా | 0.01 | పోగుల నవీన్ తండ్రి రాజేశం (0.01) | |
| 2 | 622 | మెట్ట/పట్టా | 0.10 | కోండం సరోజన భర్త హరికిషన్ రెడ్డి (0.10) | |
| 3 | 623 | మెట్ట/పట్టా | 0.01 | కోండం సరోజన భర్త హరికిషన్ రెడ్డి (0.01) | |
| 4 | 628 | మెట్ట/పట్టా | 0.15 | గోపు గీత రెడ్డి భర్త రాంరెడ్డి (0.14)<br>దారి (0.01) | |
| 5 | 629 | మెట్ట/పట్టా | 0.01 | గోపు గీత రెడ్డి భర్త రాంరెడ్డి (0.01) | |
| 6 | 808 | మెట్ట/పట్టా | 0.05 | వడియాల ప్రభాకర్ రెడ్డి తండ్రి మాధవరెడ్డి (0.0450)<br>దారి (0.0050) | |
| | | **విస్తీర్ణం:** | **0.33** | | |
| **గ్రామము: రేగొండ మండలము: అక్కన్నపేట జిల్లా: సిద్దిపేట** | | | | | |
| **for excavation of Minor - 1R of D2 on Gouravelly Left side Main Canal from KM 0.000 to KM 1.150 & KM 1.500 to KM 2.100** | | | | | |
| 1 | 941 | మెట్ట/పట్టా | 0.13 | బైరి వెంకటస్వామి తండ్రి ఐలయ్య (0.13) | |
| 2 | 937 | మెట్ట/పట్టా | 0.31 | నెల్లి శ్రీమతి భర్త రాజు (0.29)<br>మేడబోయిన వెంకటయ్య (0.02) | |
| 3 | 936 | మెట్ట/పట్టా | 0.03 | చెల్పూరి రాజిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (0.03) | |
| 4 | 935 | మెట్ట/పట్టా | 0.08 | కూన లక్ష్మి భర్త శ్రీనివాస్ (0.08) | |
| 5 | 934 | మెట్ట/పట్టా | 0.05 | మాంకాళి ఎల్లయ్య తండ్రి పోచయ్య<br>మేడబోయిన వెంకటయ్య తండ్రి కొమురయ్య (0.05) | |
| 6 | 894 | మెట్ట/పట్టా | 0.09 | జోడు రాజిత భర్త శ్రీనివాస్ (0.09) | |
| 7 | 893 | మెట్ట/పట్టా | 1.09 | పెండ్యాల పోచయ్య తండ్రి వెంకటయ్య (0.21)<br>గంగం వినోద భర్త రాజిరెడ్డి (0.18)<br>మడమడకల మధుసూదన్ రెడ్డి తండ్రి దుర్గారెడ్డి (0.10) | |
| 8 | 892 | మెట్ట/పట్టా | 0.31 | కర్నె లచవ్వ భర్త లింగయ్య (0.06)<br>గంగారపు ఎల్లమ్మ భర్త మల్లయ్య (0.17)<br>రెండ్ల సంపత్ తండ్రి చంద్రయ్య (0.08) | 1-పైప్ లైన్, 30 - టేకు చెట్లు |
| 9 | 887 | మెట్ట/పట్టా | 0.12 | అందే లచావ్వ భర్త మల్లయ్య (0.12) | |
| 10 | 888 | మెట్ట/పట్టా | 0.08 | జీడి రేణుక భర్త మల్లయ్య (0.02)<br>తాడూరి ప్రసాద్ తండ్రి ఎల్లయ్య (0.06) | |
| 11 | 886 | మెట్ట/పట్టా | 0.21 | గంగారపు ఎల్లమ్మ భర్త వెంకటమల్లు (0.07)<br>జీడి రాజమ్మ భర్త కొమురయ్య (0.04)<br>రెండ్ల జయవ్వ భర్త మల్లయ్య (0.10) | 1-పైప్ లైన్, 15 - మామిడి చెట్లు |
| 12 | 885 | మెట్ట/పట్టా | 0.39 | బద్దం రాజిరెడ్డి తండ్రి బాలరెడ్డి (0.16)<br>మధునాల పుష్పలత భర్త వెంకటేశం (0.23) | |
| 13 | రోడ్ | | 0.03 | రోడ్ (0.03) | |
| 14 | 843 | మెట్ట/పట్టా | 0.13 | ఎర్రబెల్లి రాజకొమురయ్య తండ్రి కొమురయ్య (0.13) | |
| | | **విస్తీర్ణం:** | **6.05** | | |
| | | **మొతం విస్తీర్ణం:** | **13.09** | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ సంబంధించి గతములో జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై సెక్షన్ (15) క్రింద నిర్ణీత గడువులో ఎలాంటి అభ్యంతరాలను రానందున, ఇట్టి రూడి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయబడుచున్నది. ఈ భూసేకరణ గౌరవెల్లి కుడి వైపు ప్రధాన కాలువపై డిస్ట్రిబ్యూటరీల మైనర్లు నిర్మాణ నిమిత్తము కొరకు మాత్రమే అయినందున గ్రామములో ఎవరు కూడా నిర్వాసితులు కానందున పునరావాస ప్రశ్న ఉత్పన్నము కాదు.

ప్రాజెక్ట్ కొరకు భూమి సేకరించబడుచున్నందున నిర్మాణ దశలో ఉన్న సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదని భాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వ సమయములో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల గనులున నుండి వచ్చే ఖనిజాలు అవసరం లేదు.

ఇట్టి భూమి యొక్క ప్లానును భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారి కార్యాలయములో ఏదేని పని దినమున పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

**సం/-** భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి. హుస్నాబాద్.
**సం/-** అదనపు కలెక్టర్, సిద్దిపేట.
**సం/-** జిల్లా కలెక్టర్, సిద్దిపేట.
DIPR RO NO. 55/LA/PP/Advt/Pub/2025-26




## రోబోల పరుగులు!







మనుషులతో పోటీపడుతూ రోబోలు కూడా పరుగులు తీసే రోజులు ఎంతో దూరంలో లేవు. చైనా రాజధాని బీజింగ్‌లో ఇటీవల జరిగిన ఓ హాఫ్ మారథాన్‌లో మానవ రూపంతో ఉన్న రోబో లు పాల్గొన్నాయి. స్కై ప్రాజెక్ట్ అల్ట్రా రూపొందించిన 'తియెన్ కుంగ్ అల్ట్రా' అనే హ్యూమనాయిడ్ రోబో 13.1మైళ్లు (21.1 కిలోమీటర్లు) దూరాన్ని 2 గంటలా, 40 నిమిషాల, 42 సెకెన్లలో పూర్తి చేసి, నాన్ హ్యూమన్ విభాగంలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. భవిష్యత్తులో రోబోలు కూడా మనుషులతో సమానంగా క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని చైనాలో జరిగిన హాఫ్ మారథాన్ స్పష్టం చేసింది.


## మురికి వర్షం..



వర్షంలో తడవడం చాలా మందికి ఇష్టం. అందుకేనేమో లెక్కలేనన్ని సినిమాల్లో వర్షం పాటలు ఉన్నాయి. కానీ, అమెరికాలోని కన్‌కార్డ్‌లో కురిసిన వర్షాన్ని చూసి స్థానికులు నిర్ఘాంతపోయా రు. శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. అక్కడ కురిసింది మామూలు వర్షం కాదు.. కార్లను కప్పే వసంత పుప్పొడి వర్షం అంతకంటే కాదు. అది 'మురికి వర్షం'. మురుగునీటితో కూడిన వర్షం కురవడంతో, ధూళి న్యూ ఇంగ్లాండ్ ప్రాంతాన్ని ముంచెత్తింది. మైనేలోని పోర్ట్‌ల్యాండ్‌లో డబ్లుజిఎంఇటివికి చెందిన వాతావరణ శాస్త్రవేత్త క్రిస్టియన్ బ్రిడ్జెస్ ఉపగ్రహ చిత్రాలను తనిఖీ చేస్తూ, ఈ విషయాన్ని గుర్తించి కలవరపడ్డాడు. ధూళిని మోసుకొచ్చిన మురికివర్షాన్ని ఎన్నడూ చూడలేద ని, కనీసం వినలేదని వ్యాఖ్యానించాడు. ఈనెల 17వ తేదీ ఉదయం మురికి వర్షం కురవడానికి, అంతకు రెండు రోజుల ముందు వచ్చిన తుఫాను ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు. తుఫాన్ వ్యవస్థ ద్వారా పొందిన సమాచారం మేరకు న్యూ మెక్సికోలో దట్టమైన దుమ్ము పైకి లేచింది. అది ఉత్తర దిశగా ప్రయాణించి, చివరికి న్యూ ఇంగ్లాండ్ చేరుకుంది. అదే సమయంలో వర్షం కురవడంతో, దుమ్ము, ధూళితో కూడిన జల్లులు పడ్డాయి. బలమైన గాలి కారణంగా దుమ్ము ధూళి వర్షపు మేఘాల స్థాయి కంటే 10,000 అడుగుల (3,000 మీటర్లు) ఎత్తుకు చేరుకుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ దుమ్ము దేశంలో సుమారు 2,000 మైళ్ళు (3,200 కిలోమీటర్లు) ప్రయాణించడం గమనార్హం. విస్కాన్సిన్, మిచిగాన్. ఉత్తర గ్రేట్ లేక్స్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలలో కూడా మైనే, న్యూ హాంప్‌షైర్, మసాచుసెట్స్‌లను తాకేముందు మురికి వరం నమోదైనట్టు అమెరికా వాతావరణ శాఖ ప్రకటించింది. ఇటువంటి వర్షం అసాధారణమైనదనిగానీ, అపూర్వమైనది కాదని, పశ్చిమ అటవీ మంటల నుండి వచ్చే పొగ తూర్పువైపుకు వచ్చే విధానాన్ని పోలి ఉంటుందని బ్రిడ్జెస్ అభిప్రాయం. ఏదిఏమైనా అకేడియా నేషనల్ పార్క్ ఉన్న స్వచ్ఛమైన మైనేలోనూ దుమ్ముతో కూడిన మురికి వర్షం కురవడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

## బొగ్గు బస్తాలతో పరుగు






ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంప్రదాయ క్రీడలు ఉన్నాయి. వీటిలో కొన్ని విచిత్రంగానూ, మరికొన్ని అద్భుతంగానూ కనిపిస్తాయి. ఇంగ్లాండ్‌లోని వెస్ట్ యార్క్‌షైర్‌లోని ఒసెట్‌లో జరిగిన 'బొగ్గు బస్తాతో పరుగు' ఇలాంటి చిత్రమైన పోటీల్లో ఒకటి. ఈ నెల 21న జరిగిన బొగ్గు మోసే ప్రపంచ చాంపియన్‌షిప్ సోషల్ మీడియాలో లక్షలాది వ్యూలను సంపాదించుకుంది. ఇందులో పాల్గొన్న వారు 50 కిలోల బరువుగల బొగ్గు బస్తాతో 1.1కిలోమీటర్లు పరుగు తీశారు. ఆడ మగ అనే తేడా లేకుండా ఎక్కువమంది ఈ పోటీలో పాల్గొన్నారు. ఇది పోటీ మాదిరి కాకుండా సరదా ఈవెంట్‌గా కొనసాగింది. పోటీదారులు బొగ్గు బస్తాలు ఎత్తుకొని రోడ్లపై పరుగులు తీస్తున్న సమయంలోనే చిరు జల్లు లు పడడంతో, అంతా కేరింతలు కొట్టారు. రేసు ఎవరు గెలిచారు అనేది అక్కడ ప్రధానంగా కనిపించలేదు. పోటీదారులంతా సరదాగా, ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు కదలడం కనిపించింది. వలంటీర్లు, ప్రేక్షకులు వీరిని ఉత్సాహపరుస్తూ, మంచినీటిని అందిస్తూ, చాంపియన్‌షిప్‌లో తాము కూడా భాగస్వాములయ్యారు.

## అత్యుత్సాహంతో కటకటాల్లోకి..



అమెరికాకు చెందిన 24 ఏళ్ల ఒక యూట్యూబర్ అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, భారత దేశంలో అరెస్టయ్యాడు. మైఖైలో విక్టోరోవిచ్ పాలియాకోవ్ అనే యూట్యూబర్ భారత్ పర్యటనకు వచ్చాడు. తన చానెల్ కోసం వీడియోలు తీసుకున్నాడు. ఎవరూ సాహసించని రీతిలో, హిందూ మహాసముద్రంలోని నిషిద్ధ ప్రాంతానికి వెళ్లి, అక్కడ ఒంటరిగా జీవిస్తున్న గిరిజన తెగకు సంబంధించిన వీడియోను తీసేందుకు ప్రయత్నించి, చిక్కుల్లో పడ్డాడు. అతనిని ఈనెల 29న అండమాన్ మరియు నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్‌లోని స్థానిక కోర్టు ముందు పోలీసులు హాజరుపరచనున్నారు. అరిజోనాలోని స్కాట్స్‌డేల్‌కు చెందిన పాలియాకోవ్ అరెస్టును భారత అధికారులు ధ్రువీకరించారు. నిషిద్ధ ప్రాంతానికి వెళ్లి, అక్కడ కోక్, కొబ్బరి బోండాలను పారేయడమే గాక, కొన్ని ప్రాంతాలను తన కెమెరాలో చిత్రీకరించారు. తన పడవ వద్దకు చేరుకునే ముందు ఇసుక నమూనాలను కూడా సేకరించాడు. బయటి వ్యక్తులు సెంటినెలీస్‌ను కలవడం ఆ తెగ మనుగడకు ప్రమాదం కలిగిస్తుంది కాబట్టి వారు ఉంటున్న ప్రాంతానికి వెళ్లడాన్ని భారత ప్రభుత్వం నిషేధించింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా ఈ రెండూ విధించే అవకాశాలు ఉంటాయి. ఇలావుంటే, హిందూ మహాసముద్రంలో, వేల సంవత్సరాలుగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి దూరంగా ఉత్తర సెంటినెల్ ద్వీపం ఉంది. ఈ జనాభా ఉన్న ద్వీపానికి 3 మైళ్ల దూరానికి మాత్రమే సందర్శకులను అనుమతిస్తారు. అంతకు మించి ముందుకు వెళ్లడానికి వీల్లేదు. చిన్న, దట్టమైన అడవులతో కూడిన ద్వీపంలో సంచరించే జంతువులను వేటాడేందుకు నివాసితులు ఈటెలు, విల్లు, బాణాలను ఉపయోగిస్తారు. బయటి వ్యక్తులపై తీవ్ర అనుమానంతో, వారు తమ బీచ్‌లలో దిగే ఎవరినైనా దాడి చేస్తారు. 2018లో, బీచ్‌లో చట్టవిరుద్ధంగా దిగిన ఒక అమెరికన్ మిషనరీని ఉత్తర సెంటినెలీస్ ద్వీపవాసులు చంపారు. వారు అతనిని బాణాలతో కాల్చి, ఆపై అతని మృతదేహాన్ని బీచ్‌లో పాతిపెట్టారు. 2006లో, అనుకోకుండా ఒడ్డుకు చేరుకున్న ఇద్దరు మత్స్యకారులను సెంటినెలీస్ హతమార్చారు. ఇలాంటి సంఘటనపు పునరావృతం కాకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొంత మంది భద్రతా బలగాల కన్నుగప్పి, సెంటినెల్ గిరిజన తెగను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.పాలియాకోవ్ అదే ప్రయత్నం చేసి కటకటాలపాలయ్యాడు.

## దురదృష్టంలోనూ అదృష్టం!



కొన్నిసార్లు దురదృష్టం కూడా ఎంతో కొంత అదృష్టాన్ని వెంట తీసుకొస్తుందని అంటారు. ఈ నానుడి 17 ఏళ్ల బ్లూమ్ కెర్మోడ్ విషయంలో నిజమైంది. ఈ నెల 25వ తేదీ, శుక్రవా రం రోజున ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌కు చెందిన కెర్మోడ్ మంచంపై పడుకొని, ఫోన్‌లో టిట్‌టాక్ చూసున్నది. బయట ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తున్న విషయాన్ని పట్టించుకోకుండా, ఫోన్‌లో లీనమైంది. అయితే, హఠాత్తుగా పిడుగుపాటుకు పైకప్పు కొంత భాగం ధ్వంసమై, విద్యుత్ ఆమె శరీరంగుండా వెళ్లింది. ఇంట్లో ఉన్నప్పుడు పిడుగుపాటు దురదృష్టం అనుకుంటే, అంతపెద్ద ప్రమాదం నుంచి పెద్దగా గాయాలు ఏవీ లేకుండా బయటపడడం కెర్మోడ్ అదృష్టం. 'పెద్ద శబ్దం వినిపించింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే నా చేతిలో ఉంచి విద్యుత్ ప్రవహించింది. కొంతసేపు చెయ్యి మొత్తం పక్షవాతం వచ్చినట్టు చచ్చుబడిపోయింది. భయంతో ఇంటి బయటకు పరుగులు తీశాను. కొంతసేపటికి పరిస్థితి మెరుగుపడింది. మళ్లీ ఇంట్లోకి వచ్చి చూస్తే, భారీ విధ్వంసం ఏదో జరిగినట్టు గదిలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి' అని 10 న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెర్మోడ్ చెప్పుకొచ్చింది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# టెర్రర్ అంతం ఒక్కటే మార్గం

ఈ నెల 22న అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం లోని బైసారన్ లోయలో 26 మంది టూరిస్టులను తుపాకీ తూటాలకు ఎరజేసిన టెర్రరిస్టు ముష్కర దాడి – 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను బలిగొన్న 2019 నాటి పుల్వామా ఘోరకృత్యాన్ని గుర్తుకు తెస్తుంది. దేశం నివ్వెరపోయింది. ఇప్పుడూ – అప్పుడూ నేరస్థులు పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు. ఇప్పుడూ–అప్పుడూ భారత గూఢచారి యంత్రాంగం భద్రతా వైఫల్యం స్పష్టం. పాకిస్థాన్ నుంచి ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదం బాధితురాలిగా భారత్ ప్రపంచ వేదికలపై పాకిస్థాన్‌ను ఎండగడుతూనే ఉంది. అంతర్జాతీయ బెడదగా ఉన్న టెర్రరిజంపై అందరం కలిసికట్టుగా పోరాటంచేసి ఓడించాలని ప్రధాని నరేంద్రమోదీ చాలాసార్లు అంతర్జాతీ య వేదికలపై ప్రతిపాదించారు. మానవాళికి శత్రువులైన టెర్రరిస్టుల్లో మంచి–చెడులు ఎంచరాదన్నారు. కాని అమెరికా, పశ్చిమ దేశాలు ఎక్కడైన టెర్రరిస్టుదాడి జరిగినపుడు దాన్ని ఖండించటం మినహా కలిసికట్టుగా చేసిందేమీలేదు. ఎందుకంటే తమ 'దేశ ప్రయోజనాల'ంటూ ఏ దేశంపైనైనా దాడి చేసే హక్కును తమ విదేశాంగ విధానంలో భాగం గా ఉంచుకున్న అమెరికా సామ్రాజ్యవాదులు టెర్రరిజాన్ని అందుకు 'ఆయుధం'గా ఉపయోగించారు.

భారత ఉపఖండంలో కశ్మీర్ సమస్య దేశ విభజన–స్వాతంత్ర్యం నాటినుండీ ఉన్నదే. 1980వ దశకంలో, అఫ్ఘానిస్థాన్‌లో సోవియట్ సైన్యాలు ప్రవేశించాక, అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అంతం చేసేందుకు అమెరికా పాకిస్థాన్‌ను పావుగా ఉపయోగించుకుని టెర్రరిజాన్ని ప్రేరేపించింది. పాకిస్థాన్‌కు అధునాతన ఆయుధాలు, పుష్కలంగా ధనం అందజేసింది. కాబూల్ లో కొన్నేళ్లపాటు పోరాటంలో టెర్రరిజం నెగ్గింది. ఆ తర్వాత మన దేశంపైకి సీమాంతర ఉగ్రవా దం పెరిగింది. ఎన్నోసార్లు దాడులకు పాల్పడ్డారు.

> **ప్రజాపక్షం**
> **27-04-2025, ఆదివారం**

భారత్ సైన్యం విజయవంతంగా తిప్పికొట్టింది. భారత్–పాకిస్థాన్ ల మధ్య సయోధ్యకోసం, సమస్యల పరిష్కారం కోసం పలు దఫాలు శాంతిచర్చలు జరిగాయి. ప్రభుత్వా ల మధ్య సానుకూల అంగీకారాలు జరిగినప్పుడల్లా పాకిస్థాన్ సైన్యం ఉద్రిక్తతలు పెంచేందుకు టెర్రరిస్టులను ప్రయోగిస్తున్నది. కార్గిల్ యుద్ధం సహా మూడు యుద్ధాల్లో పాకిస్థాన్ ఓడినప్పటికీ అది తన వంకర బుద్ధి మానుకోలేదు. పాకిస్థాన్ నుండి బంగ్లాదేశ్ విముక్తిలో భారత సైన్యం జాతీయవాదులకు తోడ్పడింది. పాకిస్థాన్ సైన్యం చిత్తుగా ఓడింది. ఇప్పుడు బెలూచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమం తీవ్రమైన సవాలు విసురుతోంది. ఆడలేక మద్దెల ఓడన్నట్లు దానికి భారత్ తోడ్పాటు ఉందని పాక్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.

ఈ పరిణామాలన్నిటినీ తరచి చూస్తే ఇరు దేశాల మధ్య సమస్యల పరిష్కారం, శాంతియుత సహజీవనం పాకిస్థాన్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు, వారు పోషించే టెర్రరిస్టులకు ఇష్టం లేదు. టెర్రరిస్టులు తమ భూభాగాన్ని స్థావరాలకు, శిక్షణకు, భారత్‌పై దాడులకు ఉపయోగించుకోవటాన్ని అనుమతించబోమని, టెర్రరిస్టు శిబిరాలను ధ్వంసం చేస్తామని పాక్ పాలకులు అంతర్జాతీయ సమాజానికి ఎన్నిసార్లు హామీ ఇవ్వలేదు. ఇప్పటికీ అవి కొనసాగుతూనే ఉండటాన్ని ఏమనాలి? ఇరుదేశాల మధ్య సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకోవటమా లేక టెర్రరిస్టు దాడులతో ఉద్రిక్త వాతావరణంలో బతకటమా? దారితప్పిన కొందరు చేసే రాక్షసకృత్యాలవల్ల ఇరుదేశాలలోని అమాయక ప్రజలు బాధలుపడటమా? ఇది ప్రధాన సమస్య. దీనికి సానుకూల సమాధానం కావాలంటే టెర్రరిజం అంతానికి ముందుగా ఒప్పందం కుదరాలి. అంతేగాక రెండు ఇరుగుపొరుగు దేశాల ప్రజల ప్రయోజనాల రీత్యా అనేక సంవత్సరాల పాటు ఎందరి కృషివల్లనో కుదిరిన సింధు జల సంధి, సిమ్లా ఒప్పందం వంటి మైలురాయి ఒప్పందాలను రద్దు చేసుకుంటే నష్టపోయేది సామాన్య ప్రజలు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా పరిణామాల్లో జోక్యానికి నిరాకరించారు. "భారత్–పాకిస్థాన్ సమీప దేశాలు. సమస్యను పరిష్కరించుకోవలసింది వారే. కశ్మీర్ సమస్య వారి మధ్య 1500 ఏళ్లుగా ఉంది" అన్నారు. సర్వకాల సర్వావస్థలో అమెరికాకు పాకిస్థాన్ అత్యంత మిత్రదేశం అని మరిచిపోరాదు. ఇప్పుడు ఉభయ దేశాల్లో వినిపిస్తున్న యుద్ధ ప్రేలాపనలు తాత్కాలిక ఆవేశ వ్యక్తీకరణలే కావాలి. యుద్ధం ఇరుపక్షాలకు చేటుచేస్తుందని నేతలకు తెలియంది కాదు. తామూ టెర్రరిజం బాధితులమేనని పాకిస్థాన్ అంటూ ఉంటుంది. మరి ఎందుకు ఉపేక్షిస్తోంది?

# కార్మిక హక్కుల రక్షణకై మే డే ప్రతిన







అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినంగా మే 1న మే దినోత్స వం జరుపుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, యువత సిద్ధమవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ సంక్షోభం విస్తరిస్తున్న సందర్భంలో మన ఉమ్మడి లక్ష్యాలను మదింపు చేసుకోవటం అవస రం. వందేళ్లకు పైగా గతించిన కాలం పొడవునా అసంఖ్యాకమైన వ్యక్తులు పీడనను, యుద్ధాన్ని, దారిద్ర్యాన్ని నిర్మూలిస్తామన్న తమ సంకల్పాన్ని ఎలుగెత్తి చాటారు. 1917 అక్టోబర్‌లో రష్యన్ కార్మికవర్గ విజయం సమాజ సోషలిస్టు పరివర్తనకోసం పోరాటంలో గణనీయమైన పురోగతి తెచ్చింది. అది కార్మికులను అంతర్జాతీయంగా ఉత్తేజితం చేసింది.

అంతర్జాతీయతకు నేడు మరింత ప్రాసంగికత ఉంది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తన దోపిడీ క్షేత్రాలను విస్తరిస్తున్నందున, కార్మికులు కూడా తమ హక్కుల రక్షణకై ప్రపంచమంతటా సంఘటితం కావటం తప్పనిసరి అవుతోంది. ప్రపంచంలోని వివిధ భాగాల్లో – అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు రెండింటిలోనూ స్టాక్ మార్కె ట్లు తరచూ పతనం చెందటం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను పీడిస్తున్న సంక్షోభానికి ప్రతిబింబం. సంక్షోభం తీవ్రతరమవుతున్నందు న, కార్మికుల అవసరాలు, ఆకాంక్షలతో కూడిన కార్యక్రమంతో వారు సన్నద్ధం కావలసిన అవసరం పెరుగుతున్నది. ఈ క్రమంలో మే డే పోరాట వారసత్వాన్ని వారు తిరిగి పొందాలి.

1880ల్లో అమెరికాలో 8 గంటల పనిదినంకోసం పోరాటం అంతర్జాతీయ కార్మికదినంగా మే డే ఆవిర్భవించటానికి నాంది. 1884లో, ఆర్గనైజ్డ్ ట్రేడ్స్ ఫెడరేషన్ (సంఘటిత వృత్తుల సమాఖ్య) ఆమోదించిన తీర్మానం కీలకమైన పాత్ర వహించింది – 1886 మే 1 నుంచి, ఆ తదుపరి 8 గంటలు చట్టబద్ధంగా పనిదినం కావాలని ఆ తీర్మానం డిమాండ్ చేసింది. అది కార్మికవర్గ పోరాటాలకు కాగడా అయింది. ఈ డిమాండ్‌ను కార్మికోద్యమం ఆలింగనం చేసుకుంది. 8 గంటల లీగ్ ఏర్పాటుకు అది దారితీసింది. అవి యజమానులనుంచి గణనీయమైన రాయితీలను విజయవంతంగా రాబట్టాయి. ట్రేడ్ యూనియన్ సభ్యత్వం రెట్టింపు అయింది.

చికాగోలో (షికాగో) 25,000 మందితో మే డే ర్యాలీ చరిత్రాత్మక క్షణానికి ప్రతీక అయింది. ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న కార్మికోద్యమాన్ని క్రూరంగా అణిచివేయటానికి యజమానులు సన్నద్ధమయ్యారు. ఈ అణచివేత రెండ్రోజుల్లో తీవ్రతరమై సమ్మెచేస్తున్న కార్మికులపై పోలీసు కాల్పులకు దారితీసింది. ఆ తర్వాత ఒక ఏజంట్ కవ్వింపుదారు విసిరినట్లు చెప్పబడుతున్న బాంబుదాడిలో ఏడుగురు పోలీసు అధికారులు మృతిచెందటం కార్మికులపై మరింత పాశవికమైన ప్రతీకారదాడికి దారితీసింది; కాల్పుల్లో వందలాదిమంది గాయపడ్డారు. తదుపరి వారాల్లో సమ్మెదారులపై, ట్రేడ్ యూనియనిస్టులపై పోలీసులు ఒక పద్ధతి ప్రకారం దాడులు చేశారు. వారి సమావేశాలను హింసాయుతంగా విచ్ఛిన్నం చేశారు. కార్మిక నాయకులపై తప్పుడు ఆరోపణలు మోపి, మరణశిక్ష విధించారు. ఆ శిక్షను ఆ తర్వాత జీవిత ఖైదుకు తగ్గించారు.

చికాగోలో 1886 మే నెలలో వరుసగా జరిగిన విషాద సంఘటనలు అంతర్జాతీయ కార్మికదినం పుట్టుకగా చరిత్రకెక్కాయి. 1889లో కార్మికవర్గ అంతర్జాతీయత ఆదర్శంతో కార్మిక ప్రతినిధులు రెండవ ఇంటర్నేషనల్ నెలకొల్పారు. ఈ సంస్థ తీర్మానంలోని ప్రధాన పిలుపు – ప్రతి మే డే రోజున ప్రతిదేశంలోని కార్మికులు 8 గంటల పనిదినం డిమాండ్ చేస్తూ సమ్మెలు, ప్రదర్శనలు జరపాలి.

కార్యాచరణ పిలుపు విస్తృతంగా ప్రతిధ్వనించింది. 1890 మే 1న యూరప్ అంతటా కార్మికులు సమీకృతమైనారు; బార్సిలోనాలో లక్షమంది ప్రదర్శన జరిపారు. స్టాక్‌హోంలో 1,20,000మంది, వార్సాలో 8000మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆస్ట్రియా, హంగరీలో ప్రదర్శనలపై నిషేధం ఉన్నప్పటికీ వేలాది కార్మికులు ఇళ్లలోనే ఉండి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇటలీ, ఫ్రాన్స్‌లకు కూడా సమ్మెలు విస్తరించాయి. ఉత్తర ఫ్రాన్స్‌లో 10మంది కార్మికులు మరణించిన విషాదం సంభవించింది. 8 గంటల పనిదినంకోసం పోరాటాల్లో ఆనాటినుంచి అనేకమంది కార్మికులు ప్రాణాలర్పించారు. కార్మికవర్గ పోరాటం, ప్రతిఘటన సాగిన ఆ దీర్ఘ సంవత్సరాలను మనం హక్కుగా జరుపుకుంటున్నాం. అయితే వేడుకగా జరుపుకోవటం సరిపోదు.

కార్మికవర్గం, దురదృష్టవశాత్తు, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంకెళ్లలో బందీగా ఉంది. సమాజాన్ని ప్రాథమికంగా మార్చేందుకు కార్మికులు అనేకసార్లు చేసిన ప్రయత్నాలకు ప్రతిసారీ అవరోధాలు ఏర్పడ్డాయి. లేబర్‌ను, కార్మికోద్యమాన్ని (టియు ఉద్యమం) పునరుజ్జీవింపజేసే కీలకమైన కర్తవ్యం సోషలిస్టు విధానాలకోసం జరిపే పోరాటాల నుంచి విడదీయరానిది. పెట్టుబడిదారీ విధానాలకు స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని కార్మికోద్యమం లోపల ఎప్పటికప్పుడు ప్రతిపాదించటం తప్పనిసరి.

భారతదేశంలో గత 10 సంవత్సరాల్లో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం కింద కార్మికుల జీవనోపాధి, పనిపరిస్థితులు అవిరామం గా దాడికి గురవుతున్నాయి. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బడా కార్పొరేట్‌ల విశృంఖల దోపిడీకి వీలు కల్పించే నిమిత్తం ఈ కాలంలో కోతపెట్టే ప్రయత్నాలు జరిగా యి. నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుతం అమలులో ఉన్న కార్మిక చట్టాలను నాలుగు సంహిత (కోడ్)లుగా కుదించింది. అవి – వేతనాలపై కోడ్, పారిశ్రామిక సంబంధాలపై కోడ్, సామాజిక భద్రతపై కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్. వాటిని ఇంకనూ నోటిఫై చేయలేదు. కొత్త కోడ్‌లు కార్మిక చట్టాలను సరళతరం చేస్తాయి, ఆధునికీకరిస్తాయి అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అసలు వాస్తవం ఏమంటే, కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న సదుపాయాలన్నిటినీ అవి హరిస్తున్నాయి.

ఉదాహరణకు, వేతనాలపై కోడ్‌ను తీసుకుందాం. అది సార్వజనీన కనీస వేతనం నిర్ణయించలేదు. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ప్రాతిపదికలు వర్తింపజేశారు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్ పనిదినాన్ని 12 గంటలకు పెంపుచేసే వీలు కల్పిస్తున్నది. వలస కార్మికులకు కొద్దోగొప్పో రక్షణ కల్పిస్తున్న అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని అందులో కలిపివేసినందున కాంట్రాక్టు, వలస కార్మికులు దారుణంగా నష్టపోతారు. అలాగే, పారిశ్రామిక సంబంధాలపై కోడ్ కార్మికులు సంఘటితమయ్యేందుకు, ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు ప్రాథమిక హక్కును తొలగిస్తున్నది. ఈ కోడ్ ట్రేడ్ యూనియన్‌ల రిజిస్ట్రేషన్‌ను మరింత కష్టతరం చేస్తుంది. సామాజిక భద్రతపై కోడ్ కార్మికుల పెద్ద భాగానికి ప్రస్తుతమున్న సోషల్ సెక్యూరిటీ హక్కుల ఏర్పాట్లను అస్థిరం చేస్తుంది. ఆ కోడ్‌లో నిర్దిష్టమైన సామాజిక భద్రత స్కీం లేదు, అందుకవసరమైన నిధులకు ఏర్పాటూ లేదు. ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం బడా కార్పొరేట్‌ల కోసం "వ్యాపార నిర్వహణను సులభతరం చేయటం". కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకుని అనుభవిస్తున్న హక్కులపై దాడి చేయటం ద్వారా, కార్పొరేట్‌ల విశృంఖల దోపిడీకి వీలు కల్పించేందుకు ఈ కోడ్‌లు తీసుకువచ్చారు.

నిజమైన పోరాట ప్రత్యామ్నాయాన్ని సృష్టించేందుకు మనం కృషి చేయాలి. ఇందుకుగాను మే దినోత్సవం జరుపుకోవటంలో నిగూఢంగా ఉన్న గతాన్ని మనం ఉపయోగించుకోవాలి. మే డే మన రోజు. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోని పదాల ప్రకారం "ప్రపంచ కార్మికులారా ఏకం కండు."

***"న్యూ ఏజ్" సంపాదకీయం***

# రాజకీయాలకు రాహుల్ కొత్త మార్గం!



హైదరాబాద్ నగరం వేదికగా జరిగిన భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన క్లుప్త ప్రసంగంలో కొత్త రాజకీయాలకు ఇచ్చిన భాష్యం ఆసక్తి కలిగించింది. ఆధునిక రాజకీయాలలో నవతరం నాయకుడంటే ఎలా ఉండాలో ఆయన సూటిగా రెండు మాటల్లో చెప్పారు. ఆయన చెప్పిన దాని ప్రకారం నాయకుడంటే ప్రజల మాటలు వినాలి... ప్రజలను ప్రేమించాలి. "ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య రాజకీయాలు మారిపోయాయి. పదేళ్ల క్రితం పనిచేసిన రాజకీయాలు ఇప్పుడు పనిచేయవు. సంపద పోగుబడడం, ఆధునిక మీడియా, ఆధునిక సోషల్ మీడియా గురించి అప్పుడు తెలియదు. పాత నాయకుడు నిర్జీవి అయ్యాడు. కొత్త నాయకుడిని నిర్మించాలి" అని మారిన రాజకీయ పోకడలను వివరించాడు రాహుల్ గాంధీ. దానిని అందుకోలేక ఒకానొక దశలో కాంగ్రెస్ ఒంటరి అయిందని, తిరిగి తమను తాము ఆవిష్కరించుకునేందుకు చరిత్ర చూపిన మార్గంలో పాదయాత్రల్లోనే తనకు ప్రజల చెప్పేది వినాలి, ద్వేషాన్ని ప్రేమతో ఎదుర్కోవాలని అర్థమైందన్నాడు.

నిజమే రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో చెప్పినట్లుగా ఇప్పుడు రాజకీయాలంటే ద్వేషం, భయం, ఆగ్రహం. పై నుంచి పంపే సమాచారాన్ని కింద స్థాయిలో వినడమే మార్గం. ఒక వర్గాన్నో, మతాన్నో, కులాన్నో, వ్యక్తినో, సమూహాన్నో శత్రువుగా చూపి, ఆ అంశంపై ఉన్నది లేనిది చూపిస్తూ, కల్పిత కథలను సృష్టిస్తూ సోషల్ మీడియాలో పైనుంచి కిందకు సమాచారాన్ని పంపడం ద్వారా కింద సమూహాన్ని నియంత్రిస్తున్నారు. ఒకప్పుడు రాజకీయ పార్టీలు ఏదైనా అంశంపై ప్రజలకు తమ వైఖరిని వివరించాలనుకుంటే, తమ అభిప్రాయాలను వ్యక్తీకరించుకోవాలనుకుంటే, ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేయాలనుకుంటే అదొక సుదీర్ఘ ప్రక్రియగా ఉండేది. బహిరంగసభలను నిర్వహించడం, అందుకు కార్యకర్తల ద్వారా ప్రచారం చేయడం, జనాలను సభకు సమీకరించడం, అక్కడ నాయకుడు చెప్పడం.. ఇలా సాగేది. సభలో నాయకుడు చెప్పిన మాట ప్రజల మనస్సులోకి వెళ్ళాక, వాటిని స్మృతిపథంలో ఉంచేందుకు కరపత్రాల ప్రచారమో, పాటలు, సాంస్కృతిక దళాల ప్రచారమో వంటివి ఉండేవి. కానీ పదేళ్ళలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. సోషల్ మీడియా వ్యాప్తితో పార్టీకి, కింద ప్రజలకు సోషల్ మీడియా వారధిగా మారిపోయింది. కొన్ని పార్టీలు వాటి ఆలంబనగానే ఎన్నికల విజయాలు కూడా సాధించాయి. రాజకీయ ప్రచారమనేది ఒకప్పుడు దీర్ఘకాలం జరిగే ప్రక్రియ అయితే, నేడు సోషల్ మీడియాలో ప్రతిరోజు ప్రచారమే కొనసాగుతోంది. తమ పార్టీని ఏదో రకంగా ప్రజల్లో నాన్చేందుకు ప్రతి రోజు ఏదో ఒక ఎజెండాను ముందుకు తీసుకుపోయి, అందుకు సంబంధించిన వీడియోలను, వాస్తవాలనో, అవాస్తవాలనో సోషల్ మీడియాలో వదలడం ద్వారా ఆయా పార్టీలు నిత్యప్రచారంలో ఉండేలా చూసుకుంటున్నాయి. ఇందులో తమ విధానాల ప్రచారం కంటే ప్రత్యర్థి వ్యక్తిత్వ హననానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్యోతకమవుతూనే ఉంది. దీనిని అర్థం చేసుకునేందుకు విధానాలే కాకుండా, ఆధునిక ప్రచార, మీడియా స్వభావాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అందుకే ఇప్పుడు పార్టీ విధానాలకు కట్టుబడి, పద్ధతిగా సిద్ధాంత ప్రచారం చేసే క్రమశిక్షణ కలిగిన సంప్రదాయ కార్యకర్తలకు కాలం చెల్లింది. వారి స్థానాలలో రాజకీయ పార్టీలు సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. వారిని యుద్ధవీరులుగా చూస్తూ 'సోషల్ మీడియా వారియర్'లని ముద్దుగా పిలుచుకుంటూ, రాజకీయాలను కథనరంగంగా మార్చేసాయి. ప్రతి బూతుకు సోషల్ మీడియా కమిటీలు వేస్తూ వారి ద్వారానే నిత్యం ప్రజల మెదళ్ళలోకి తాము చెప్పాలనుకునే విషయాలను జొప్పిస్తున్నాయి. ఇక్కడ సమాచారాన్ని పై నుంచి పంపడం తప్ప కింద నుంచి స్వీకరణ

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

లేదు. రాజకీయాలలో ఈ మార్పు ప్రపంచమంతా కనపడుతోంది. ముఖ్యంగా మితవాద రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా అస్త్రంగా మారింది. కేవలం ఉపన్యాసాలివ్వడానికే పరిమితం కాకుండా ప్రజలు తమ మనుసులోని మాటలను వినే ప్రక్రియ ఎంత శక్తివంతమైందో, వారు అనుసంధానమయ్యేందుకు ఎంత కీలకమైనదో అనే విషయం పాదయాత్రలో అర్థం చేసుకున్నట్లు వెల్లడించారు రాహుల్‌గాంధీ. ఇక అదే కోవలో వర్తమానంలో సాగుతున్న ద్వేష రాజకీయాలకు విరుగుడు ప్రేమేనని వక్కాణించారు. ఈ రెండు విషయాలు కొత్తేమి కాదు. భారతీయతత్వంలో ఉన్నదే. ప్రేమ, సహనశీలత, దయ భావనలో ఇందులో శతాబ్దాలుగా పరిఢవిల్లుతున్నవే. వాటి ద్వారానే ఆధునిక రాజకీయాల ప్రక్షాళన అనే రాహుల్ ఆలోచన ఆచరణయోగ్యమే. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు వాటిని అమలులో చూపాలి.

### గుజరాత్ మోడల్ డిసిసి ప్రయోగం

ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్‌లో జరిగిన మరో కీలక పరిణామం. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపికకు గుజరాత్ మోడల్‌ను అనుసరించాలనే నిర్ణయం. ఇది కాంగ్రెస్ రాజకీయాలకు కొత్తరకం అనుభవమే. ఇప్పటి వరకు ఎఐసిసి ప్రతినిధులను, ఎఐసిసి అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలాకాలం తరువాత ఎన్నికల ద్వారా మరో కాంగ్రెస్ నేత శశిథరూర్‌పై గెలుపొందారు. పిసిసి, డిసిసి అధ్యక్షులను, కమిటీలను నియమించే సర్వాధికారం ఎఐసిసి అధ్యక్షుడికి కట్టబెట్టడం ఆనవాయితీ. అదే పద్ధతిలో ప్రస్తుత పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను ఎఐసిసి నియమించగా, పిసిసి కమిటీ, డిసిసిలను వేయాల్సి ఉంది. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశంలో డిసిసిలను బలోపేతం చేయాలనే నిర్ణయం జరిగింది. పైగా ఈసారి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపులో కూడా డిసిసి అధ్యక్షుడి పాత్ర ఉంటుందని స్పష్టం చేసింది. కింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే దీని వెనుక ఉద్దేశ్యం. కానీ, ఏళ్ళుగా వర్గ రాజకీయాలలో కూరుకుపోయిన కాంగ్రెస్‌కు ఇది సాధ్యమా? అలాగే గత కొన్నేళ్ళుగా ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌కు ఎన్నికల ద్వారానే అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటున్న పద్ధతి పెద్దగా సత్ఫలితాలను ఇవ్వడం లేదనే గుసగుసలు కాంగ్రెస్ నేతల నోటినుంచి వినిపిస్తుంటాయి. డిసిసి అధ్యక్షుడి ఎంపికను ఎఐసిసి సమావేశానికి ముందే ప్రయోగాత్మకంగా గుజరాత్ రాష్ట్రంలో ప్రారంభించారు. ఎఐసిసి నుంచి కొంత మంది అబ్జర్వర్‌లను, పిసిసి నుంచి కొందరిని పరిశీలకులుగా నియమిస్తారు. వారు జిల్లాల్లో రెండు వారాలు పర్యటించి, కార్యకర్తలతో మాట్లాడి, ఆసక్తి ఉన్న వారి నుంచి డిసిసి అధ్యక్షుడి కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. కార్యకర్తల అభిప్రాయాన్ని క్రోడీకరించి, దరఖాస్తుదారుల్లో ఐదుగురిని షార్ట్ లిస్ట్ చేసి, వారి నుంచి డిసిసి అధ్యక్షుడిని నియమిస్తారు. ఇది కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో ప్రజాస్వామీకరణ చేయడమే. అయితే ఎంతవరకు సాధ్యమైనది ప్రశ్న? గతంలో 'శక్తి'యాప్ పేరుతో బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్క కార్యకర్త వివరాలను సేకరించి, కంప్యూటరీకరించి, సంస్థాగత నిర్మాణం కోసం ఒక ప్రయత్నం జరిగినా ఆశించిన ఫలితాలు దక్కలేదు. రాహుల్ గాంధీ ఆలోచనల ప్రకారం డిసిసిల నియామకాలు, అలాగే ఆయన మాటలు అమల్లోకి వస్తే కొత్త కాంగ్రెస్‌ను చూసే అవకాశం లభిస్తుందనడంలో సందేహం లేదు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## రాహుల్‌కు పుణె కోర్టు సమన్లు

**పుణె :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పుణె కోర్టు శనివారం సమన్లు జారీ చేసింది. లండన్ పర్యటన సమయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ సమన్లు అందాయి. లండన్ పర్యటన సమయంలో రాహుల్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ రాహుల్‌పై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం మే9న తమముందు హాజరుకావాలని కోరుతూ సమన్లు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సమయంలో వీర్ సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. ఇటీవల హైకోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వాటిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరగ్గా.. సుప్రీం రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది.ఆయన వ్యాఖ్యలు బాధ్యాతారహితమైనవిగా పేర్కొంది. రాహుల్ వ్యాఖ్యలను మందలిస్తూనే.. ఆయనపై క్రిమినల్ చర్యలను నిలిపివేసింది.

## ఉపాధి అవకాశాలు పెంచేందుకు

# అన్నిచర్యలు తీసుకుంటున్నాం

### 15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

### 51000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**న్యూఢిల్లీ :** ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో నియామకాలకు సంబంధించి 51,000కి పైగా నియామక లేఖలను పంపిణీ చేసిన తర్వాత 15వ రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువతకు ఇది అపూర్వమైన అవకాశాల సమయం అని అన్నారు. వర్చువల్‌గా పాల్గొని ఆయన మాట్లాడుతూ భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉండనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి చెప్పిందని, ప్రతి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మోదీ అన్నారు. ఆటోమొబైల్, పాదరక్షల పరిశ్రమలలో ఉత్పత్తి, ఎగుమతి కొత్త రికార్డులను తాకిందని, పెద్ద సంఖ్యలో ఉపాధిని సృష్టించాయన్నారు. తన ప్రభుత్వం చేసిన వ్యత్యాసాన్ని ఉదహరిస్తూ, 2014కి ముందు 18 మిలియన్ టన్నులుగా ఉన్న లోతట్టు జలమార్గాల ద్వారా నిర్వహించబడుతున్న సరుకు రవాణా పారదర్శకంగా 145 మిలియన్ టన్నులకు పెరిగిందని, జాతీయ జలమార్గాలు ఐదు నుండి 110కి పెరిగాయని, వాటి పొడవు 2,700 కి.మీ నుండి 5,000 కి.మీ.కు పెరిగిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. వృద్ధి అతిపెద్ద అంశమని, ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని ఆయన చెప్పారు. ఈ సంవత్సరం యుపిఎస్‌సి పరీక్షలో అగ్రస్థానంలో నిలిచిన ఐదుగురిలో ముగ్గురు మహిళలే ఉన్నారని, 90లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలలో 10 కోట్లకు పైగా మహిళలు పనిచేస్తున్నారన్నారు. శక్తి అధికార యంత్రాంగం నుండి అంతరిక్షం, సైన్స్ వంటి రంగాలలో భారతదేశ మహిళా సరికొత్త హద్దులను తాకిందని, ప్రభుత్వం గ్రామీణ మహిళలను శక్తివంతం చేయడంపై కూడా దృష్టి సారిస్తోందని చెప్పారు. ఈ దశాబ్దంలో యువత సాంకేతికత, డేటా , ఆవిష్కరణలలో భారత వృద్ధికి శక్తినిచ్చిందని, దేశం రియల్‌టైమ్ డిజిటల్ లావాదేవీలలో ముందుందని మోదీ పేర్కొన్నారు. యువత జాతి నిర్మాణంలో చురుకుగా సహకరించినప్పుడు, దేశంవేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుందని, ప్రపంచ వేదికపై గుర్తింపు పొందుతుందని ఉద్ఘాటించారు. దేశ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతూనే ఉండేలా తమ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ హామీ ఇస్తోందని మోదీ స్పష్టం చేశారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, అవి యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని, వారి ప్రతిభను ప్రదర్శించడానికి బహిరంగ వేదికను అందిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ యువత తమ అంకితభావం, ఆవిష్కరణల ద్వారా దేశంలో ఉన్న అపారమైన సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు.ముంబైలోజరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) యువతకు ప్రపంచ వేదికపై తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక పెద్ద అవకాశంగా ఉంటుందని మోదీ అన్నారు. ఈ బడ్జెట్‌లో 'మేక్‌ఇన్ ఇండియా' చొరవను ప్రోత్సహించడం, దేశయువతకు ప్రపంచ ప్రమాణాల ఉత్పత్తులను సృష్టించే అవకాశాన్ని కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం 'తయారీ మిషన్'ను ప్రకటించిందని ప్రధాన మంత్రి అన్నారు. తయారీ మిషన్ దేశవ్యాప్తంగా లక్షలాది ఎంఎస్‌ఎంయులు, చిన్న తరహా వ్యాపారులకు మద్దతు ఇవ్వడమే కాకుండా దేశవ్యాప్తంగాకొత్తఉపాధిమార్గాలకుదారి చూపుతుందన్నారు.

# ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు పేల్చివేత

### పహల్గామ్ దాడి నేపథ్యంలో ముష్కరుల కోసం ముమ్మర గాలింపు

### వారి ఇళ్లు వెతికి బాంబులతో ధ్వంసం చేస్తున్న భద్రతా బలగాలు



**శ్రీనగర్ :** కశ్మీర్ లోయలో ముగ్గురు అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లను అధికారులు కూల్చివేశారు. 26 మందిని బలిగొన్న దారుణమైన పహల్గామ్ దాడి తరువాత ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పలువురు భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, షోపియన్, కుల్గామ్ జిల్లాల్లో అనుమానిత ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేశామని అధికారులు శనివారం తెలిపారు. అంతకు ముందు గురువారం, శుక్రవారం మధ్య రాత్రి నిల్వ ఉంచినట్లు భావిస్తున్న పేలుడు పదార్థాలు పేలి పహల్గామ్ ఉగ్రవాద దాడి ప్రధాన నిందితుడితో సహా ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. శుక్రవారం రాత్రి, పుల్వామా జిల్లాలోని మురాన్ ప్రాంతంలో ఉన్న అహ్సాన్ ఉల్ హక్ షేక్ ఇంటిని కూల్చివేశారని, అతను 2018లో పాకిస్తాన్‌లో శిక్షణ పొంది ఇటీవల లోయలోకి చొరబడినట్లు అధికారులు తెలిపారు. షోపియన్ జిల్లాలోని చోటిపోరాలో జరిగిన ఇలాంటి చర్యల్లో లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) కమాండర్ షాహిద్ అహ్మద్ కుట్టాయ్ ఇంటిని ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా చురుకుగా ఉన్న కుట్టాయ్ అనేక దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కుల్గాం జిల్లాలోని మతల్హామా ప్రాంతంలో, 2023 నుండి చురుకుగా పనిచేస్తూ పలు ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జకీర్ అహ్మద్ గనీ నివాసాన్ని కూడా రాత్రిపూట కూల్చివేశారని వారు తెలిపారు. దీంతో ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న ఐదు నివాసాలను ధ్వంసం చేశారు. శుక్రవారం, పహల్గాం మారణహోమాన్ని అమలు చేయడంలో సహాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆదిల్ హుస్సేన్ థోకర్, దాడిలో పాల్గొన్నట్లు భావిస్తున్న ఆసిఫ్ షేక్ ఇళ్లను భద్రతా దళాలు సోదా చేస్తున్నప్పుడు, పేలుడు కారణంగా బిజ్‌బెహారా, ట్రాల్‌లలో నిర్మాణాలు దెబ్బతిన్నాయి. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఆ ప్రాంగణంలో పేలుడు పదార్థాలు దొరికాయని, దీంతో భద్రతా దళాలు ఇళ్లలోని నివాసితులను, పొరుగువారిని కూడా సురక్షితంగా ఖాళీ చేయించాయి.

## పికప్ వాహనం ఢీకొని ఆరుగురు కార్మికులు మృతి

**గురుగ్రామ్ :** పికప్ వాహనం ఢీకొనడంతో ఆరుగురు పారిశుధ్య కార్మికులు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం నుహ్ జిల్లాలోని ఫిరోజ్‌పూర్ ఝిర్కా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేలోని ఇబ్రహీంబాస్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చగా, వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో 11 మంది పారిశుధ్య కార్మికులు ఎక్స్‌ప్రెస్‌వేను శుభ్రం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా వేగంగా వచ్చిన పికప్ వాహనం కార్మికులను ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మరణించారని వారు తెలిపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడంలో సహాయపడ్డారని వారు తెలిపారు. మృతులను ఇంకా గుర్తించలేదని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.వారు ఖేరి కలాన్ గ్రామ నివాసితులుగా, ఒకరు జిమ్రావత్ గ్రామానికి చెందినవారని చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నారు. పికప్ డ్రైవర్‌పై చర్యలు చేపట్టారు. 'సీసీటీవీ ఫుటేజ్ , ఇతర ఆధారాల సహాయంతో ప్రమాదం పరిస్థితులు నిర్ధారించబడతాయి. గాయపడినవారు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని అధికారి తెలిపారు.

## గుజరాత్‌లో వెయ్యికిపైగా వలసదారులు

**అహ్మదాబాద్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ పత్రాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు. వీరిలో చాలా మంది డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అనుమానితులుగా ఉన్నారు. ఇటీవల నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేయగా.. వారిలో ఇద్దరు అల్‌ఖైదా స్లీపర్ సెల్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లుగా గుర్తించాం. ఈ క్రమంలోనే తాజాగా భారీ ఆపరేషన్ చేపట్టాం. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తాం అని హర్ష్ సంఘవి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో పాక్ జాతీయులు ఎవరైనా ఉంటే.. కేంద్రం తీసుకున్న నిబంధనల ప్రకారం వారు కూడా వెంటనే గుజరాత్‌ను వీడాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా దేశంలో ఉండే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వలసదారులు వెంటనే పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.

# ఉగ్రవాదుల కిరాతకచర్యకు..సాధారణ ప్రజలకు శిక్షా?

### పాకిస్థానీయుల ఆవేదనా స్వరం

### నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

### గాయపడ్డ హృదయాలతో హఠాత్తుగా భారత్‌ను వీడుతున్నామని వెల్లడి




ఛండీగఢ్ : పహల్గామ్ ఉగ్రదాడి నిందితులను కఠినంగా శిక్షించాలి కానీ వారి మూలాన సాధారణ ప్రజలు గాయపడ్డ హృదయాలతో వెళ్లకూడదని పాకిస్థానీ సందర్శకులు దాదాపు ముక్తకంఠంతో తమ ఆవేదనా స్వరాన్ని వినిపించారు. స్వల్పకాల పరిమితి విధింపు కారణంగా అత్యవసరంగా భారతదేశాన్ని వీడి వెళుతోన్న పాకిస్థానీ సందర్శకులు శనివారం వారి మనోవేదనను అట్టారీవాఘా సరిహద్దు మార్గంలో వ్యక్తం చేశారు.పాకిస్థానీ జాతీయులకు చెందిన జారీ చేసిన అన్ని వీసాలు ఏప్రిల్ 27నుంచి రద్దు చేయబడతాయని భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ నుంచి ఇండియన్లు త్వరగా స్వదేశానికి తిరిగిరావాలని కూడా భారత ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది, వారిలో అధికసంఖ్యలో పర్యాటకులు మరణించారు.పాకిస్థానీ జాతీయులకు జారీ చేసిన మెడికల్ వీసాల గడువు ఏప్రిల్ 29వరకు చెల్లుబాటు అవుతాయి. చాలామంది పాకిస్థానీ పౌరులు తమ బంధువులను కలుసుకోవడానికి ఇండియాకు వచ్చినట్లు 'పిటిఐ'కి తెలిపారు. కొంతమంది భారత్‌లో పెండ్లి కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఇక్కడికి వచ్చినప్పటికీ ఆ శుభ కార్యక్రమాలకు హాజరుకాకుండానే వెళ్లిపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.'ఈ రోజు నా మేనకోడలు వివాహం ఉంది. నేను 10సంవత్సరాల తర్వాత ఇక్కడికి వచ్చాను, అయినప్పటికీ నేను ఆ కార్యక్రమానికి హాజరుకాకుండానే వెనుతిరిగి పోవాల్సి వస్తోంది' అని కరాచీకి చెందిన బస్కరి చెప్పారు. కంటిచూపు స్పష్టంగా లేని ఆమె తన భర్తతో కలిసి ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌కు వచ్చారు. ఆమె భర్త మహమ్మద్ రషీద్ మాట్లాడుతూ తాము భారత్‌కు ఏప్రిల్ 10న 45 రోజుల వీసాపై ఇక్కడికి చేరుకున్నామని చెప్పారు. 'నా భార్య ఇండియాలోనే పుట్టింది. మా అత్తమామలు ఇక్కడే నివసిస్తున్నారు. శనివారం (ఈరోజు) సహరాన్‌పూర్‌లో పెండ్లి జరుగుతోంది. పోలీసులు మా బంధువల ఇంటికి వచ్చి వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని వారు హుకుం జారీ చేశారు అని రషీద్ వివరించారు. 'పెండ్లి రోజునే ఇక్కడి నుండి వెళ్లి పోవాల్సి రావడం విషాదకరం. రెండు దేశాల మధ్య శాంతి నెలకొనాలని నేను కోరుకుంటున్నాను' అని బస్కరి చెప్పారు. 'ఏదిఏమైనప్పటికీ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి చాలా తప్పు. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే. కానీ ఆ గాయాలను సాధారణ ప్రజలు మోసుకెళ్లాల్సిందేనా?. మతం పేరుతో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరైనది కాదు.ప్రజలు మాత్రం ఇరువైపులా ఒకరినొకరు ప్రేమించుకుంటుంటారు. ఆ వాతావరణాన్ని ఉగ్రవాదులు చెడగొట్టారు' అని రషీద్ తెలిపారు. మరో పాకిస్థాన్ జాతీయుడు మాట్లాడుతూ తాను భారత్‌లో తన తల్లి చికిత్స కోసం ఉంటున్నానని, అదృష్టవశాత్తు కొద్దిరోజుల క్రితం పూర్తి కావడంతో తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లిపోతున్నానని చెప్పారు. పాకిస్థాన్‌లోని ఉత్తర సింధ్ ప్రాంతంలోని ఘోట్కీ నుంచి వచ్చిన బలిరామ్ మాట్లాడుతూ తాను రాయ్‌పూర్‌లో ఉంటున్న తన ముగ్గురుకూతుళ్లు కోసం భారత్ సందర్శించానని , పహల్గామ్ ఉగ్రదాడి ఘటన వార్త కారణంగా భారతదేశాన్ని వీడి వెళ్లిపోతున్నానన్నారు. తాను ఏప్రిల్ 5న ఇండియాకు వచ్చినట్లు చెప్పారు. ఈ కిరాతక చర్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాల్సిందేనన్నారు. అమాయక టూరిస్టులు చేసిన తప్పు ఏమిటని ప్రశ్నించారు. రావల్పిండి నుంచి భారత్‌కు వచ్చిన వృద్ధుడు ముజమ్మిల్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని గట్టిగా ఖండించారు.నిందితులను ఉరితీయాల్సిందే అన్నారు. తాను తన బంధువుల వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు లక్నోకు వచ్చానని, ఇప్పుడు హఠాత్తుగా ఆ ట్రిప్‌ను కుదించుకుని పాకిస్థాన్ తిరిగి వెళుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థానీయులను వెంటనే తిరిగి వారి దేశానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్‌కాల్స్ చేసి చెప్పడంతో శరవేగంగా చర్యలు మొదలయ్యాయి.

# టి(బి)ఆర్‌ఎస్ పాతికేళ్ల ప్రస్థాన సంబరం

**ప్రజాపక్షం/ప్రత్యేక ప్రతినిధి :** రాజకీయాల్లో బలమైన వాదం, సిద్ధాంతంతో పాటు ప్రజలను ఆకర్షించగలిగిన శక్తి అవసరమే. పార్టీల పుట్టుకలోనూ ఒక బలమైన వాదం ఉంటేనే ఆ పార్టీలు పది కాలాల పాటు మనగలుగుతాయి. నాడు తెలుగుదేశమైనా, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితియైనా రెండు ఒక బలమైన ప్రాంతీయ వాదంతో నిలబడి అధికారంలోకి వచ్చాయి. తెలుగు వారి ఆత్మగౌరవ నినాదాన్ని నాడు తెలుగుదేశం అధినేత ఎన్‌టిఆర్ అందుకుంటే తెలంగాణ వాదాన్ని కేసిఆర్ ఎత్తుకున్నారు. కాకపోతే నెలల్లోనే అధికార సాధన తెలుగుదేశానికి సాధ్యమైంది కానీ టిఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి 13 ఏళ్లు పట్టింది. కాకపోతే రాష్ట్ర సాధన, అధికారంలోకి రావడం ఒకే సారి జరిగాయి. ఒక లక్ష్య సాధన కోసం పార్టీని ఏర్పాటు చేసి ప్రజలను తన వైపుకు తిప్పుకోవడంలో సఫలీకృతుడైన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. ఆయనకు గల ప్రజా సమ్మోహన శక్తి తెలంగాణ వ్యతిరేకులను సైతం ఆలోచింపజేసింది. వాదాన్ని ఎత్తుకోవడమే కాదు ఆ దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేయడంలోనూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసిఆర్) సఫలీకృతులయ్యారు. 2001లో తెలుగుదేశానికి, ఉప సభాపతి, ఎంఎల్‌ఏ పదవులకు రాజీనామా చేసి ఏప్రిల్ 27న జల దృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. తనదైన శైలిలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించడంలోనూ భావోద్వేగాలను సృష్టించడంలోనూ కేసిఆర్‌కు కేసిఆరే సాటి. 13 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్ర సాధనకు వినూత్న కార్యక్రమాలతో వాదాన్ని నిలబెట్టడంతో పాటు ప్రజల్లో ఆశను సజీవంగా ఉంచారు. రాజకీయంగా ఆ 13 ఏళ్లలో ఎత్తు పల్లాలను చూసిన టిఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర సాధన ప్రకటన తర్వాత అధికారాన్ని సొంతం చేసుకోగలిగింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని రాష్ట్ర, కేంద్ర మంత్రి వర్గంలో చేరినా ఎక్కువ కాలం ఉండలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో రాజీనామాల



పర్వం కొనసాగింది. ఆ తర్వాత 2009లో మహా కూటమిలో చేరింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు వ్యతిరేకంగా ఉన్న బలమైన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత కేసిఆర్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అమరణ దీక్షతోపాటు పలు కార్యక్రమాలు ప్రజా మద్దతుతో విజయవంతం కావడంతో అప్పటి కేంద్ర పాలకులు తెలంగాణ పట్ల సానుకూలంగా స్పందించారు. సిపిఐ తెలంగాణకు బహిరంగ మద్దతును ఇవ్వడమే కాకుండా పోరాటాల్లో పాల్గొన్నది. బిజెపి మద్దతు తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా మారింది. 13 ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలను తన సమ్మోహన శక్తితో నడిపించిన కేసిఆర్ అధికారంలోకి రాగానే, టిఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ కాదని రాజకీయ పార్టీ అని ప్రకటించి కొన్ని పథకాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా రైతుబంధు, పింఛన్ పెంపు, రైతు బీమా, రైతులకు ఉచిత విద్యుత్, 24 గంటలు కరెంటు, అంతర్గత రోడ్లకు ప్రాధాన్యత, జిల్లాల పునర్విభజన, కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ తదితర కార్యక్రమాలు, పథకాలతో ప్రజలను ఆకర్షించారు. మొదటి దఫాలోనే కొంత వ్యతిరేకత ఏర్పడినప్పటికీ కేసిఆర్ తెలంగాణ వాది తెలంగాణను సాధించిన వ్యక్తి అన్న భావన తెలంగాణ ప్రజల్లో ఉంది. కేసిఆర్ భాషను ముఖ్యమంత్రి కాక ముందు ఆస్వాదించిన తెలంగాణ ప్రజలు ఆ తర్వాత క్రమంగా తప్పుపట్టడం ప్రారంభించారు. విపక్ష కాంగ్రెస్‌ను చీల్చాడు. గెలిచిన వారిని గెలిచినట్లు తనలో చేర్చుకుని బలహీనపర్చాడు. కేసిఆర్ అధికారంలో



ఉన్నన్ని రోజులు బిజెపి మిత్రపక్షమో, శత్రుపక్షమో అర్థం కాని రాజకీయాలు నడిపారు. పథకాలు, తెలంగాణ వాదం కేసిఆర్ వ్యూహాత్మక రాజకీయాలు తిరిగి రెండో సారి టిఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసిఆర్‌లో మరింత అహంభావం పెరిగిందన్న ప్రచారంతో పాటు కుటుంబ పాలన అన్న విమర్శలకు టిఆర్‌ఎస్ సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పదేళ్ల అధికారం పార్టీని ప్రజలకు దూరం చేసింది. ప్రభుత్వ పథకాలు జనామోదమే అయినా నేతల తీరు వ్యతిరేకతకు కారణమైంది. అదే సమయంలో కాంగ్రెస్ చావో, రేవో అన్న రీతిలో పోరాడటం, బిఆర్‌ఎస్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు మరలడం, అన్నింటికీ మించి కెసిఆర్ టిఆర్‌ఎస్ పేరును బిఆర్‌ఎస్‌గా మార్చడంతో తెలంగాణ వాదం నుంచి పార్టీ వెనుదిరిగిందన్న ప్రచారం ఓటమికి కారణమయ్యాయి. ఇప్పుడు అధికారం కోల్పోయి ఏడాదిన్నర కావస్తున్న సమయంలో పార్టీ వ్యవస్థాపక రజతోత్సవ సంబురాలు జరుపుకుంటుంది. విపక్ష పాత్రలో కెసిఆర్ సమ్మోహన శక్తి పార్టీని తిరిగి అధికార అందలమెక్కిస్తుందా? అదొక్కటే ఆశ! కేసిఆర్‌కు ఆసక్తి ఉన్నట్లు లేదు. జన బాహుళ్యంలోకి రాకపోగా శాసనసభ సమావేశాలకు హాజరు కావటంలేదు. ఇండోర్ కార్యక్రమాలకే కేసిఆర్ పరిమితమయ్యారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రాంతీయ పార్టీల మనుగడ అంత తేలిక కాదు. దేశ వ్యాప్తంగా ఓటమి తర్వాత అనేక ప్రాంతీయ పార్టీలు కనుమరుగయ్యాయి. కానీ బిఆర్‌ఎస్ కాంగ్రెస్‌ను కాస్త దీటుగానే ఎదుర్కొంటుందని చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రచార వైఫల్యం బిఆర్‌ఎస్‌కు సానుకూలంగా మారింది. హరీష్‌రావు, కేటిఆర్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నోరు, పలుకుబడి కలిగిన నాయకులు బిఆర్‌ఎస్‌లో ఇప్పటికీ ఉండడం, బిఆర్‌ఎస్‌ను చీల్చడం లేదా రాజకీయ ఇబ్బందులకు గురి చేయడం లేదా బలహీన పర్చడానికి కాంగ్రెస్ శక్తి సరిపోకపోవడం లేదా ప్రయత్నించకపోవడం తదితర అంశాలు ఇప్పటి బిఆర్‌ఎస్ స్థితికి కారణమవుతున్నాయి. అవునన్నాకాదన్నా ప్రభుత్వంపై కాంగ్రెస్ పాజిటివ్ ప్రచారం కంటే బిఆర్‌ఎస్ నెగెటివ్ ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది. నెగెటివ్ ప్రచారం ఒక్కటే గట్టెంచకబోదు. బిఆర్‌ఎస్ నేతల ఆరాటాలు, పోరాటాలు ప్రజల మద్దతును కూడగడతాయా, కేసిఆర్ సమ్మోహన శక్తి తిరిగి బిఆర్‌ఎస్‌ను అధికారం వైపు తీసుకెళ్తుందా వంటి సందేహాలకు భవిష్యత్తే సమాధానం చెబుతుంది. నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభ తర్వాత పార్టీ ఏవిధంగా ముందుకు సాగుతుందన్నది ఆసక్తితో వేచి చూడదగిన అంశం. అయితే రెండోవైపున, వచ్చే ఎన్నికల్లో అధికారం తమదే అంటూ ప్రచారార్భాటంలో ముందున్న బిజెపి చాపకింద నీరులా బిఆర్‌ఎస్ ఓటు బ్యాంకును ఆకట్టుకుంటున్నది. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఒక్క సీటు దక్కకపోగా, బిజెపి గెలుపొందటం బలాబలాల్లో మార్పును సూచించింది. అది మోదీ ఆకర్షణతో వచ్చిన గెలుపు అని బిఆర్‌ఎస్ నాయకులు వినిపిస్తున్న బాణీ ఆత్మసంతృప్తికి, వైఫల సమర్థనకు తప్ప ఎందుకూ పనికి రాదు. రాష్ట్ర అభివృద్ధికి బిఆర్‌ఎస్ అడ్డుపడుతోందనే కాంగ్రెస్ వాదన పదును పెరిగితే బిఆర్‌ఎస్ పునరుజ్జీవ కృషికి తిప్పలు తప్పవు. అందువల్ల పార్టీ రజతోత్సవం సందర్భంగా, 'మేము అంతా మంచే చేశాం. కాంగ్రెస్ వాగ్దానాలకు ప్రజలు మోసపోయారు.' అనే బకాయింపు వల్ల ఫలితముండదు. ఆత్మవిమర్శ కూడా ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవసరం.

# పాక్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన

**శ్రీనగర్/న్యూఢిల్లీ :** పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖా వెంబడి పాకిస్తాన్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడింది. అయితే భారత దళాలు దీటుగా ఎదుర్కొన్నారని సైనిక వర్గాలు శనివారం తెలిపాయి. మంగళవారం పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించిన తరువాత భారత, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగిన నేపథ్యంలో వరుసగా రెండవ రాత్రి కాల్పులు జరిగాయి. గురువారం రాత్రి కూడా పాకిస్తాన్ దళాలు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి భారత స్థావరాలపై కాల్పులు జరిపాయి. భారత దళాలు తగిన విధంగా స్పందించాయి. ఈనెల 25, 26 తేదీలలో రాత్రి కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి వివిధ పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయని ఒక వర్గాలు తెలిపాయి. భారత దళాలు కూడా చిన్న ఆయుధాలతో తగిన విధంగా స్పందించాయని వారు తెలిపారు. కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను వేటాడతామని భారతదేశం ప్రకటించిన నేపథ్యం లో పాకిస్తాన్ సైన్యాన్ని హై అలర్ట్‌లో ఉంచారు.

### ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం

జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో శనివారం ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా దళాలు ఛేదించారు. భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిఘా వర్గాల సమాచారం మేరకు, ఉత్తర కశ్మీర్ జిల్లాలోని ముష్తకాబాద్ మాచిల్ (సంషా బెహక్ అటవీ ప్రాంతం)లోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు ప్రారంభించాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని విజయవంతంగా గుర్తించి ఛేదించామని ఆయన చెప్పారు. ఐదు ఎకె47 రైఫిల్స్, ఎనిమిది కెకె47 మ్యాగజైన్స్, ఒక పిస్టల్, ఒక పిస్టల్ మ్యాగజైన్, 660 రౌండ్ల ఎకె47 మందుగుండు సామగ్రి, ఒక పిస్టల్ రౌండ్, 50 రౌండ్ల ఎం4 మందుగుండు సామగ్రితో సహా గణనీయమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఆ ప్రదేశం నుండి స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే లక్ష్యంతో ఉగ్రవాదులు కార్యకలాపాలను నిర్వహించడానికి సిద్ధమవుతున్నారనే సంకేతాల దృష్ట్యా రహస్య స్థావరం ధ్వంసం చేయడం పెద్ద విజయమన్నారు. భద్రతా దళాలు సకాలంలో చర్య తీసుకోవడం వల్ల ఇటువంటి దుష్ట కుట్రలకు పెద్ద దెబ్బ తగిలిందని, పౌరుల ప్రాణాలకు, ప్రజా భద్రతకు ముప్పు తప్పిందన్నారు.



## ఉగ్రదాడిని ఖండించిన సిపిఐ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నల్లకుంట రాజీవ్ మార్గ్‌లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిన దిస్తూ మరణించిన కుటుంబాలకు సిపిఐ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనం గా క్యాండిల్ నివాళులు అర్పించారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపే పిరికిపంద చర్యకు పాల్పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయు లు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాంనాథ్, హమాలీ సంఘాల నాయకులు నారాయణ రాజు, సిపిఐ నాయకులు విరేష్




కృష్ణతో పాటు 30మంది నాయకులు, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

## జాప్యంతో రైతులకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/హాలియా :** రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా రైస్ మిల్లర్లు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా అన్లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి అన్నారు.శనివారం ఆమె హాలియా లోని బాలాజీ రైస్ ఇండస్ట్రీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన దాన్యాన్ని ఎప్పటికప్పుడు వెంటనే దించుకోవాలని, జాప్యం చేయవద్దని చెప్పారు. జాప్యం చేయడం వల్ల రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్చార్జి రెవిన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు,పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, బాలాజీ రైస్ ఇండస్ట్రీ యజమాని యాదగిరి ఉన్నారు.





## ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/చింతలపాలెం:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన అన్నారు. శనివారం చింతలపాలెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరమని, దినిని నివారించేందుకు ప్రపంచ దేశాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామశాఖ కార్యదర్శి అంకరాజు, సిపిఐ నాయకులు గొనె చిన్న అంకయ్య, షేక్ జియాలుద్దీన్, భిమిశెట్టి సత్యం, గంధంకొండ, గంధం రంగయ్య, గొంగరెడ్డి వెంకటరెడ్డి, భూక్య రామారావు, చింతలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే



**ప్రజాపక్షం/ సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా రెండవ మహాసభలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరు విప్లవ్ మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని యువత ఈ దేశానికి వెన్నెముక లాంటిదని అన్నారు. దేశ సమగ్రత సమైక్యతను పరిరక్షించడానికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పహల్ గాం లోని పర్యాటకులను అతి కిరాతకంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినీ నటులకు వై కేటగిరి భద్రతను కల్పించిన కేంద్రం ప్రభుత్వం పర్యాటకులకు భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మారగోని నాగరాజ్, శనిగల నరేష్, కొండూరు వంశీ, రావుల ప్రశాంత్, కొండూరు రాజు, కొండూరు శ్రవణ్, శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/చండూరు:** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేట సిపిఐ శాఖ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో ఇల్లులేని ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికి నూతన రేషన్ కార్డులు ,ఆసరా పెన్షన్ లు మంజూరు చేయాలని అన్నారు. అంగడిపేటలో భారత కమ్యునిస్టు పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ అంగడిపేట నూతన శాఖ కార్యదర్శిగా అందిర్క పరమేషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో మండల పార్టీ కార్యవర్గ సభ్యులు జెల్ల శ్రీను, దోటి వెంకన్న ,కర్నాటి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో చామల అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. 139వ మేడే వేడుకలను కార్మికవర్గం ఘనంగా నిర్వహించాలన్నారు. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రం అధికారంలో ఉన్న ప్రభుత్వ చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు హక్కులు లేకుండా, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు సవరిస్తుండటాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవ జమ్ముకాశ్మీర్ పహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రీక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పెంద్ర కృష్ణ, టైలరింగ్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, పున్నం రమేష్, మల్లికార్జున్ రెడ్డి, రవి, టిప్పర్ యూనియన్ అధ్యక్షులు నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

## మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి వద్దనే ఉంటారని వారి పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పి కె నరసింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా పోలీసుల తనిఖీల్లో మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని వారికి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. విద్యార్థులపై కేసులు నమోదు అయిదే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. వాహనాలు నడుపుతూ పిల్లలు ప్రమాదాలకు గురైతే వారి జీవితం ఇబ్బందికంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చెప్పారు.

# భూమి ఉన్న ప్రతి రైతుకూ భూ భద్రత

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల:** భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ సామాన్య రైతులకు అర్థమయ్యే విధంగా భూ భారతి పోర్టల్ ఉంటుందని, భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు ఉన్న ప్రతి రైతుకు శాశ్వత పరిష్కారం చూపుతాం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి గౌడ్, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, హరితాదేవి, డిటి నీలిమ, సిపిఎం జిల్లా నాయకులు రాజు, పిఏసిఎస్ చైర్మన్ బిక్షం, నాయకులు పాల్గొన్నారు.

### సామాన్య రైతుకు అర్థమయ్యేలా భూభారతి పోర్టల్ : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బీబీనగర్ :** రైతాంగానికి భరోసా నిస్తూ, భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించడం జరిగిందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భూభారతి అవగాహన సదస్సులో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల భూముల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అని దానికి ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి రైతుకు అర్థమయ్యే విధంగా సెక్షన్ల వారీగా భూభారతి చట్టాన్ని రైతులకు క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. గ్రామాలలో అవగాహన లేని రైతులకు భూభారతి చట్టంతో అవగాహన కల్పించి భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, తాసిల్దార్ భగత్, ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/మునుగోడు:** బైక్ పై అతివేగంగా వెళుతూ విద్యుత్ స్తంభానికి ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని ఊకోండి గ్రామ శివారులో చోటుచేసుకుంది తెలుగులో గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన బింగి మత్స్యగిరి (21) మర్రి మురళి(21) ఇద్దరు స్నేహితులు కలిసి పక్కనే ఉన్న తాళ్ల వెల్లంల గ్రామానికి వెళుతుండగా అతివేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇరుగు రవి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి శవ పరీక్షల నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వివాహేతర సంబంధం, ప్రియుడి మోజులో భర్త హత్య

### మర్డర్ కేసులో వీడిన మిస్టరీ ...నలుగురు నిందితులు అరెస్ట్

### అక్రమ సంబంధమే హత్యకి కారణమని తేల్చిన పోలీసులు

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వరుసకు మామ వరుస అయిన వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని భర్తను హతమర్చిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలోని కేటీ దొడ్డి మండలంలో చోటుచేసుకుంది. గత వారం క్రితం బసాపురం శివారులో ఇంకుడు గుంతల కొరకు ఉపాధి కూలీలు పనులు చేస్తుండగా మట్టి కుప్ప నుండి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అనుమానస్పద స్థితిలో కనిపించడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రియుడి మోజులో జరిగిన హత్యకు గల కారణాలను గద్వాల సీఐ కార్యాలయంలో డిఎస్పి మొగులయ్య వెల్లడించారు. కేటీదొడ్డి మండలం బసాపురం శివారులో మృతి చెందిన వ్యక్తి నర్సింహులు (28) భార్య పద్మమ్మ వరుసకు మామ అయినా అంజిలప్పతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఈ విషయం భర్తకు తెలవడంతో ఇరువురు మధ్య పలుమార్లు గొడవలు చోట్టు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా తన భర్తను హతమార్చాలని ప్రియుడిని కోరింది. దీంతో అంజలప్ప అతనితో పరిచయం పెంచుకొని మద్యం సేవించేందుకు హనుమప్ప గుట్టకు వెళ్లారు. మద్యం సేవిచిన అనంతరం మరో ఇద్దరు సహాయంతో గోంతుకోసి హత్యకు పాల్పడినట్లు డిఎస్పీ తెలిపారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.




# ప్రపంచసుందరి పోటీదారుల సందర్శనకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే పోటీదారులు మే 12న బుద్ధవనం సందర్శిస్తున్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటు,పాట్లు లేకుండా చూడాలని రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి అన్నారు. మే 12న ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు బుద్ధవనం సందర్శిస్తున్న దృష్ట్యా ఏర్పాట్ల విషయమై శనివారం ఆమె బుద్ధవనం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.కేవలం 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ,ప్రత్యేకించి సివిల్ పనులు అన్నిటిని మే 3 నాటికి పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే వారందరూ బుద్ధవనం రాక సందర్భంగా ప్రపంచం మొత్తం మన వైపు చూస్తున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు,ఇబ్బందుకు లేకుండా చూడాలన్నారు. అందరూ గర్వపడేలాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా బుద్ధవనం పరిసర ప్రాంతాలు, విజయ విహార్ రోడ్డుకిరిపక్కల లైటింగ్, పరిశుభ్రత చేయించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్నందున త్వరితగతన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మే 3 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ప్రపంచ సుందరి పోటీదారుల తాత్కాలిక పర్యటన ప్రకారం మే 12 న మధ్యాహ్నం 1 గంటకు వారు హైదరాబాద్ నుండి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు బుద్ధవనం వస్తారు ,విజయ విహర్ చేరుకొని అనంతరం బుద్ధవనం సందర్శించి అక్కడ ధ్యాన మందిరం, జాతకవనం తదితరాలన్ని సందర్శించిన తర్వాత తిరిగి రాత్రి 7.45 గంటలకు బయలుదేరి హైద్రాబాద్ వెళ్లనున్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, బుద్ధవనం ప్రాజెక్టు ఓ ఎస్ డి సుధాన్ రెడ్డి, టూరిజం శాఖ ఎస్ ఈ భాస్కరరావు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు హాజరయ్యారు .

## భూ భారతి చట్టం చరిత్రాత్మక మార్పు



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూ భారతి చట్టం చారిత్రాత్మక మార్పు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మండలంలోని నెమ్మికల్‌లోని ఎస్‌వి గార్డెన్‌లో రైతులు, ప్రజలకు భూ భారతి 2025పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలోని లోపాలను గుర్తించి ఏలా పరిష్కారం చేయాలో కమిటీ ద్వారా ప్రజలు, మేధావులు, నిపుణులు ద్వారా అభిప్రాయలు సేకరించి ముసాయిదాను పబ్లిక్ డోమైన్‌లో పెట్టి ప్రజల నుండి అభిప్రాయాలు, సూచనలు సేకరించి భూ భారతి చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. గతంలో గ్రామ స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు వీఆర్‌ఓ, వీఆర్‌ఎలు ఉండేవారని ధరణి చట్టం అమలులోకి వచ్చిన తరువాత వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు కావడంతో రైతుల సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియకా తహసీల్దార్ కార్యాలయం, ఆర్‌డిఓ కార్యాలయాల చుట్టు తిరిగితే మా దగ్గర అధికారాలు లేవని కలెక్టర్ దగ్గరకు వెళ్లమని చెప్పేవారని దీంతో మూరు మూల ప్రాంతాలకు రావాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకవచ్చిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలపర్చేందుకు త్వరలో జిల్లాలో 279 మంది గ్రామపాలన అధికారులను తీసుకరానున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డిఓ వేణుమాధవరావు భూ భారతి చట్టం గురించి రైతులకు క్లుప్తంగా సెక్షన్లవారిగా వివరించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ హరికిషోర్ శర్మ, ఎంపిడిఓ ఎండి అషిం, డిటి హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/కోదాద(చిలుకూరు):** పేద ప్రజల పక్షాన మాట్లాడేది, పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం చిలుకూరు మండల కేంద్రంలోని పాత చిలుకూరు గ్రామంలోని కస్తూరి అప్పారావు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిలుకూరు గ్రామశాఖల మహాసభ జరిగింది. ఈ మహాసభల సందర్భంగా పార్టీ జెండాను స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని పాలకవర్గాలు కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద ప్రజల పొట్ట కొడుతున్నాయని ఆరోపించారు. పేద వర్గాలకు సంబంధించిన నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ బడా కార్పోరేట్ వర్గాలకు సంబంధించిన వ్యక్తుల లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తి చేసుకున్న తర్వాత ఏప్రిల్, మే నెలలో జరగనున్న మండల జిల్లా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకత్వ, కార్యకర్తలు ఆహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తెలంగాణ సాయుధ పోరాట సమయంలో అష్టాంగ మహాసభ జరుపుకున్న ఈ చిలుకూరు గడ్డ మీద ఎర్రజెండా నిత్యం ఆడాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కొత్త చిలుకూరు, పాత చిలుకూరు సంబంధించిన నూతన కమిటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త చిలుకూరు, పాత చిలుకూరు గ్రామ కార్యదర్శులుగా షేక్ సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, 35 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టెకొల నాగేశ్వర రావు, బాలెబోయిన రాంబాబు, కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, ముక్కా లక్ష్మి నారాయణ, కొడారు శ్రీనివాసరావు, మండవ అచ్చయ్య, సుల్తాని వెంకటేశ్వర్లు, రవి, మల్లెపంగు ఉపేందర్, పూల వాసు, సిరాపురపు శ్రీను, లక్ష్మ య్య, మాచర్ల వెంకటి, మేరి, సైదులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటే సంబరాలతో మేడే

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మేడే సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలోని రెడ్డిగట్టు శేషయ్యనగర్‌లో సిపిఐ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల దినోత్సవం మే ఒకటో తేదీన మండల స్థాయిలో అన్ని గ్రామాలలో పార్టీ దిమ్మలను అలంకరించి పార్టీ జెండాలను ఉత్సాహ పూరితమైనటువంటి స్థాయిలో మేడే ను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను ఐకెపి సెంటర్ల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో రైతుల వడ్లను కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతున్నందున ఎగుమతి చేయడంలో లారీలు అందుబాటులో పెట్టకుండా వడ్లు పట్టే జల్లిని తగిన కావలసిన కరెంటు సరఫరా కొరకు వైరును ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నూతనంగా ఏర్పడిన మండలానికి కనీస రోడ్ల సౌకర్యములు లింకు రోడ్ల నిర్మాణం లేక సరియైన రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆలేరు నుండి నల్లగొండకు పోయే బస్సును ఈ మండల ప్రజల సౌకర్యార్థం వెంటనే పునరుద్ధరింపజేయాలని డిమాండ్ చేస్తున్నామని, మండల కేంద్రంలో విద్యార్థుని విద్యార్థినులకు జూనియర్ కళాశాల , డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పల్లా వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు మంచాల రాధమ్మ, పసుపుల నరసింహ, ఫైళ్ల రాంరెడ్డి, నల్ల రాములు, ఎంకన్న, బీరకాయల మధు, బొంగు బిక్షం, జీవికలపెల్లి పాండు, నల్ల బిక్షం, పల్లె శ్రీనివాసు, కుమారస్వామి, సునీల్, మంకయ్య పాల్గొన్నారు.

## ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరం

### ఎఐపిఎస్‌ఓ ఆధ్వర్యంలో మృతి చెందిన పౌరులకు నివాళి

**ప్రజాపక్షం/నల్లగొండ :** జమ్ముకశ్మీర్ లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన మారణహోమం హేయమైన చర్య ఇది దేశా నికి ప్రమాదకరమని అఖిల భారత శాంతి సంఘీ భావ సంఘం (ఐప్సో) సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గడియార సెంటర్‌లో శనివారం ఎఐపిఎస్‌ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం కన్నా మానవ త్వం గొప్పదని, మనిషి మానవత్వంతో జీవించాలని ప్రగతిని కాక్షించాలన్నారు. మారువేషంతో వచ్చి అమాయక పర్యాటకులను కాల్చి చంపిన పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలన్నారు. అదేవిదంగా పహల్గాం దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వాలు అదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి, అనంతుల శంకరయ్య,గుర్రం వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, ఉపాధ్యక్షులు ఎండి షరీఫుద్దీన్, ముండ్ల ముత్యాలు, పశలశౌరయ్య, పి బ్రహ్మాచారి,పబ్బు వీరస్వామి,ఎల్ వి యాదవ్,ఆర్ ఆచారి,వీ లెనిన్,ఎస్.కె మదర్, తెలగమళ్ళ దశరథ, నరేందర్ రెడ్డి,యాదగిరి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## నేడే మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** జిల్లా లోని కుంటాల ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి శనివారం రోజున ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాధికారి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 1012 గంటల వరకు ఆరో తరగతికి 710 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరగనుందని విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి మొత్తం 590 మంది దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 374 మంది విద్యార్థులు, మధ్యాహ్నం 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరగుచున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు నివ్వీజిలేటర్‌గా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ లకు చెందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్ నియమించారు.



## భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** భారత్ సమ్మిట్ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు ఎఐసీసీ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ముందడుగు వేస్తుందని, అభివృద్ధిపై చర్చలు జరిపారు.

## రైతుల ఖాతాలలో రూ.35లక్షలు జమ

### అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు 1 వేయి 493 మంది రైతుల వద్ద నుండి 12 వేల 74 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 35 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వారసత్వ ఉద్యోగాల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న వారసత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) అధ్యక్షులు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంబంధిత సమస్యలపై సింగరేణి సంస్థ డైరెక్టర్ (పి అండ్ పి, పి ఎ అండ్ డబ్ల్యు) వెంకటేశ్వర్లను కలిసి మెమొరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న వారసత్వ ఉద్యోగాలు 35 నుండి 40 సంవత్సరాల వరకు ఇవ్వాలని సర్కులర్ జారీ చేసినప్పటికీ యాజమాన్యం గనుల డిపార్ట్మెంట్లలో విచారణ పూర్తి చేసి ఇన్షియల్ మెడికల్ ఎగ్జామినేషన్ (ఐఎంఇ) పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రం కొరకు గత నాలుగు మాసాల నుండి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. నియామక పత్రాలు జారీ చేయుటకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి మే నెల మొదటి వారంలో నియామక పత్రాలు అందచేయుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, తిరునహరి, కిరణ్ కుమార్, సల్లా వేణు, రాజేష్ కుమార్, కదారి వేణుగోపాల్, గొలివాడ రమేష్ పాల్గొన్నారు.

## కొడుకును హత్య చేసిన నిందితుడు అరెస్ట్..




**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** లక్ష్మణచందా మండలంలోని మల్లాపూర్ గ్రామంలో జరిగిన హత్య కేసును పోలీసులు చేదించారు.శనివారం రోజు ఎఎస్పీ రాజేశ్ మీనా కేసు వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన అశోక్ విదేశాల్లో ఉంటూ తన తండ్రి ఎర్రన్నకు డబ్బులు పంపించాడు.ఇటివల ఇంటికి వచ్చిన అశోక్ తండ్రిని డబ్బులు లెక్కలు అడగడంతో విభేదాలు తలెత్తాయి.దీంతో ఈ నెల 24న నిద్రిస్తున్న కుమారుడిపై తండ్రి ఎర్రన్న గొడ్డలితో దాడి చేసి తల నరికి హత్య చేసినట్లు వివరించారు.పలు అనుమానాలతోని తండ్రిని వేధింపులకు గురి చేసే వాళ్ళని,ఎప్పటికైనా కొడుకుతోనే తనకు అపాయం ఉంటుందని,అందుకే హత్య చేసినట్లు తెలిపారు.కేసు దర్యాప్తు చేస్తూ,నిందితుని రిమాండ్ కు తరలించారు.ఈ సమావేశంలో సోన్ సిఐ వి.గోవర్ధన్ రెడ్డి,లక్ష్మణ్ చందా ఎస్సై ఎండి మాలిక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి నగలు చోరీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** బస్టాండ్‌లో వృద్ధురాలి కంట్లో కారం చల్లి, కత్తితో బెదిరించి ఓ మహిళ చోరీకి పాల్పడింది. ఈ ఘటన నవీపేట్ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. నారాయణపూర్ గ్రామానికి చెందిన కిష్టాబాయి తన గ్రామానికి వెళ్లేందుకు నవీపేట్ బస్టాండ్‌కు వెళ్లింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మూత్రశాలల వైపు వ్లెగా ఓ మహిళ వృద్ధురాలు వెనుకాలే వెళ్లి కంట్లో కారం చల్లి కత్తితో బెదిరించి నగలు లాక్కుంది. ఈ క్రమంలో వృద్ధురాలు కేకలు పెట్టడంతో మహిళ పారిపోయేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న వారు అప్రమత్తమై గమనించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/కుంటాల:** కుంటాల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ శనివారం పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకవచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సొసైటీ సిబ్బందికి ఆదేశించారు.రైతులు తేమ శాతంను పాటిస్తూ కొనుగోలు నిర్వాహకులకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీఈవో మురళి,కొత్తపల్లి బుచ్చన్న,హైమద్ పాషావెంకటేష్,రమేష్,జుట్టు మహేందర్,దిగంబర్ తదితరులు ఉన్నారు.

## ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయింపు

### ఏటా భూ రికార్డుల ఆధునీకరణ
### రైతులకు ఉచిత న్యాయ సేవలు
### భూభారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడి






**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్‌ఓఆర్ 2025) నూతన చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూకమతాలకు భూధార్ నెంబర్లను కేటాయించటం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. నిర్ధిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కారమయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మాక్లూర్, నందిపేట్, ఆర్మూర్ మండల కేంద్రాల్లో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హాజరై భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలిపారు. ఇదివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందన్నారు. భూదార్ నెంబర్ కేటాయింపు వల్ల భూ ఆక్రమణలకు అనవసర వివాదాలకు అవకాశం ఉండదని, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందన్నారు. భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు ధరణిలో అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తూ నూతన చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన యేడాదికాలంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర సూచించారు. వాటిని తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి నిబంధనలకనుగుణంగా పరిష్కరించటం జరుగుతుందన్నారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారిగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి ఫోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆ అర్జీలను 60 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తారని సూచించారు. ఒకవేళ రైతులు సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాల్లో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూమి పటం పొందుపరుస్తారని వివరించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 17 రాష్ట్రాలలో నిపుణులు సమగ్ర అధ్యయనం చేసి అన్ని రకాల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపయుక్తంగా ఉండేలా ప్రభుత్వం భూభారతి నూతన చట్టం రూపొందించిందని తెలిపారు. ఈ సదస్సులలో స్రవంతి, రాజాగౌడ్, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ చైర్మన్లు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 'ఆకలి కేకలు' మహాసభ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మే 27వ తేదీనా హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న ఆకలి కేకలు మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటో జేఏసి అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం నిజాంసాగర్ మండలకేంద్రంలో ఆటో రథయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నర్సాపూర్ నుండి ఆటో రథయాత్ర ప్రారంభించి మే 27వ తేదీ వరకు హైదరాబాద్ వరకు ఈ యాత్ర కొనసాగనుందని, అనంతరం మే 27న ఇందిరాపార్కులో అమరవీరుల ప్రాంగణం వద్ద ఆటో ఆకలికేకలు మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాయిలు, ఆటో యూనియన్ సభ్యులు కైసర్, కుర్షిద్, నర్సింలు, సతీష్, హమీద్, మక్సుద్, రఫీక్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్సీ దండే విఠల్



**ప్రజాపక్షం/తిర్యాణి:** గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంఎల్సి దండే విఠల్ పేర్కొన్నారు. శనివారం తిర్యాణి మండల కేంద్రంలో జరిగిన భూభారతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, తిర్యాణి మండల గౌడ కులస్తుల ఆహ్వానం మేరకు శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్సి దండే విఠల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గీత వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న గీత కార్మికుల సమస్యలను తెలంగాణ శాసనమండలిలో ప్రస్తావించడం జరిగిందని, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గౌడ కులస్తుల బాధలు తనకు తెలుసని అన్నారు. పొన్నం ప్రభాకర్ గౌడ్ బిసి సంక్షేమ శాఖ మంత్రిగా ఉండటంతో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌడ కులస్తుల వెన్నంటే ఉండి, అవసరమైతే ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ ల సహాయ సహకారాలతో గుడి అభివృద్ధి కోసం ప్రహరీ గోడతో పాటు గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. అనంతరం గౌడ కులస్తులు ఎంఎల్సిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిత్తారి సాగర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, నాయకులు పెరుమండ్ల లచ్చ గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనలో విజయం

### లారీ డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె విరమణ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** కార్మికుల హక్కుల సాధనలో ఏఐటియుసి యూనియన్ ముందుంటుందని, ఎల్లవేళల కార్మికుల పక్షాన నిలిచి న్యాయం చేస్తుందని ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ అన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఏఐటియుసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న లారీ డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకున్న నేపథ్యంలో యాజమాన్యాలకు, కార్మిక సంఘాల నాయకులకు జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ప్రతి నెల 15వ తేదీ లోపు డ్రైవర్లకు రూ. 20,000, క్లీనర్లకు రూ. 10,000 వేతనం చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించడానికి ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం అంగీకరించిందని అన్నారు. కార్మికుల డిమాండ్లు నెరవేరడంతో సమ్మె విరమించడం జరుగుతుందని, సమ్మెకు సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్చల్లో ఏఐటియుసి నాయకులు స్వామి, లచ్చన్న, తిరుపతి, సంతోష్, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం తరపున ప్రవీణ్ రావు, సింగరేణి ఎస్‌ఓటు జీఎం రాజమల్లు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై రైతులకు అవగాహన

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం 2025లోని అంశాలపై ప్రతి రైతుకు అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. శనివారం రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన అవగాహన సదస్సులో ఎంఎల్సి దండే విఠల్, ఆర్డిఒ లోకేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం రైతులకు భూ సమస్యల పరిష్కారానికి ఉపకరిస్తుందని తెలిపారు. అప్పీలు వ్యవస్థ ఈ చట్టంలో కీలకమైనదని, వారసత్వ భూముల విషయంలో అందరికీ నోటీసులు జారీ చేసే విధానం ఉందని ఆయన పేర్కొన్నారు. జూన్ 2 తర్వాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఎంఎల్సి దండే విఠల్ మాట్లాడుతూ భూభారతి అమలుతో గ్రామాల్లో భూ సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయని, సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన అర్హులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ధరణిలో పరిష్కారం కాని సమస్యలకు భూభారతి ద్వారా అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామ్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట


### గజ్వేల్ డివిజన్‌కు 14 రోటోవేటర్లు మంజూరి
### గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ లతో కలిసి శనివారం గజ్వేల్ రైతు వేదిక వద్ద మండల పరిధిలోని 9 మంది మహిళా రైతులకు రోటోవేటర్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో 14 రోటోవేటర్లు మంజూరి కాగా, వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా రైతులను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాగా క్షేత్రస్థాయిలో ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ యంత్రాల ప్రాముఖ్యత ఎంతో ఉంటుండగా, ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించే దిశగా చర్యలు తీసుకుంటూ కూలీల కొరత అధిగమించడం, అధిక దిగుబడులు సాధించడం లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండగా, రబీ సీజన్ దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రతిచోట వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, డాక్టర్ వహీద్, యాదగిరి, నాయకులు జహీర్, సుఖేందర్ రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, నక్క రేగొండ గౌడ్, శేఖర్ రెడ్డి, రమేష్ గౌడ్, శివారెడ్డి, వూడేం శ్రీనివాస్ రెడ్డి, నేత నాగరాజు, శ్రీగిరిపల్లి కుమార్, ఎక్బాల్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి: సురేష్

**ప్రజాపక్షం/సోన్:** సోన్ మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా యూనియన్ సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేయడం జరిగింది మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సన్నాక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలో బిజెపి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక పజావ్యతిరేక విధానాలను,కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడు అమలు చేస్తుంది.కార్మిక వర్గం సమస్యల పోరాటాల ద్వారా వంద సంవత్సరాలు సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దు వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ అమలు 5 సంవత్సరాల ఆలస్యమైనా ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తుంది.2025 26 బడ్జెట్లో తమ కార్పొరేటర్ అనుకూల విధానాలకు అనుకూలంగా కేటాయింపులు చేసింది.సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది.సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్ గుట్టే సమస్తలకు పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితులు ప్రకటించింది.పది నిరుద్యో అధిక ధరల ఆకలి అసమానతలు ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోలేకపోగా ఈ సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యలను పట్టించుకోలేకపోగా ఈ సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యల మరింత దేవరూపం దాల్చే ఆర్థిక విధానాలను విసర్జన రహితంగా అమలు చేస్తుంది.కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వెనక్కిప కొట్టేందుకు భారత రాజ్యాంగ కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాల స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు 2025 మే 20న దేశవాప్త స్వారత్రిక సమ్మె చేయాలని నిర్ణయించింది.గంజాల్ టోల్ ప్లాజా కార్మికులకు డ్యూటీలు నెలకు 26 రోజులు కల్పించాలి,కార్మికులకు గత 15 సంవత్సరాల నుంచి చేస్తున్న పాత జీతాన్ని కొనసాగించాలి,ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో గంజాల్ టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాజకుమార్,నాయకులు నవీన్,శ్రావణ్,మహేష్,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** ఉపాధీహామీ కూలీలకు పని ప్రదేశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్ సూచించారు . శనివారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, బారెగూడ,ఎన్‌జిఒఎస్ కాలనీలో కూలీలు పనిచేస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు రోజుకు రూ. 300 వచ్చే విధంగా పనిచేయాలని, పని ప్రదేశంల నీడ,నీటి వసతితో పాటు మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఎన్‌జిఒస్ కాలనీలోని నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. నూతనంగా కాగజ్‌నగర్ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కార్యదర్శి, సిబ్బంది శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలోని కోయవాగు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకై ఇందిరమ్మ కమిటి సిఫార్సు చేసిన లబ్ధిదారుల ఇండ్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చంద్రశేఖర్, కార్యర్శులు సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

## ‘నీట్’ పరీక్షకు కేంద్రాలు రెడీ

### వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించే చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్‌తో న్యూడిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మే 4వ తేదీ న నిర్వహించన్ను యూజిసి నీట్ పరీక్ష పగడ్బందీ నిర్వహణపై తగు సలహాలు సూచనలు జారీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తుతో పరీక్ష నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ...జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను అన్ని విధాలుగా సిద్ధం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అధికారులు ఉన్నారు.

## మేడే ఉత్సవాలకు సిద్ధం



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** మేడేను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు.శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులకు 18 గంటల పని విధానం కావాలని కార్మికులు సమ్మె చేస్తే యజమాన్యం పోలీసులతో జరిపిన దాడిలో అమరులైన తమ రక్తాన్ని చిందించి పోరాడి కార్మికులు తమ హక్కులను సాధించుకున్నారని, అప్పటినుండి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉన్న కార్మికులు మే 1వ తేదీనాడు మేడే ఉత్సవాలు జరుపుకుంటున్నారని తెలిపారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కార్యదర్శి కుడిక్యాల బాల్ మోహన్, సీనియర్ నాయకులు మల్లం అంజయ్య, కనకయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటుతో సందడి



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజాపక్షం దినపత్రికలో "శనివారం ప్రచురించిన ప్రత్యేక అధికారుల పాలనలో వెలగని వీధి దీపాలు" అనే వార్త కథనం ప్రచురించగా అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ముత్తారం మండలంలోని ఓడేడు బస్టాండ్ నుండి ప్రభుత్వ పాఠశాలకి వెళ్లే ప్రధాన రహదారి వరకు, అలాగే మూడో వార్డు బీసీ కాలనీలో 10 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని వార్త కథనం ప్రచురించగా అధికారులు స్పందించివీధిదీపాలు వెలుగనిచోట్లలో వీధిదీపాలనుఏర్పాటుచేయించారు. ఓడేడ్ గ్రామంలో పలు వీధుల్లో నెలకొన్న విద్యుత్ దీపాలపై వార్త కథనం ప్రచురించి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేసిన ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి,పాత్రికేయునికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## సోషల్ మీడియా పోస్టులపై నిఘా

**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై,వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జగిత్యాల డిఎస్పీ డి.రఘు చందర్ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజ నిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో అట్టి మెసేజ్లను ఫార్వర్డ్ చేయకూడదన్నారు. శనివారం డీఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియా పై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ప్రతి పోస్టు ను నిశితంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో రాణించారు. ద్వితీయ సంవత్సరంలో కె.సంజన 983, సిహెచ్ ప్రణీత 982, కె.హర్షిత 978 మార్కులు సాధించగా కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల కరెస్పాండెంట్ రత్నాకర్, ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. కళాశాల డైరెక్టర్లు పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్ పాల్గొన్నారు.

## చొప్పదండిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్




**ప్రజాపక్షం/చొప్పదండి:** శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు చొప్పదండి సిఐ ప్రకాష్‌గౌడ్ అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలో శనివారం పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా మీదుగా పురవీధుల గుండా పోలీస్ స్టేషన్ వరకు 100 మంది ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు. ప్రజల భద్రతకు పోలీసులు నిత్యం అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చొప్పదండి ఎస్సై మామిడాల సురేందర్, రామడుగు, గంగాధర ఏఎస్ఐలు , హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బది పాల్గొన్నారు.

## మహిళాసంఘాల అభివృద్ధికి బాటలు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తువారి అభివృద్ధికి బాటలు వేయడం ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాలశాసనసభ్యులు డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళ సంఘాలకు ఆర్‌టిసి బస్సులు ఇవ్వడం, సోలార్ ప్లాంట్ ఏర్పాటు వివిధ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా బ్యాంకు లింకేజీ రుణాలు అందివ్వడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో హాస్టలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దస్తులుకుట్టే బాధ్యతలు మహిళ సంఘాలకే ఇచ్చి ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నామన్నారు.మండల ఎపియం వి.గంగాధర్, సిసిలు, పి. గంగారాం, బి.రవీందర్, బి మరియా, పి విద్యాసాగర్, జి.శ్రీనివాస్, రూరల్ అర్బన్ మండలాల సమాఖ్య అధ్యక్షురాల్లు మారు సత్తవ్వ, దేశవేని గంగాజాల , తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో కళలకు ప్రోత్సాహం



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును మండల విద్యాధికారి మాధవరెడ్డి శనివారం సందర్శించారు. సమ్మర్ క్యాంపులో చదువుతో పాటు చిత్రలేఖనం,కంప్యూటర్ విద్య, ఇండోర్ గేమ్స్ నేర్పడంపై ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న కళలను వెలికి తీయడానికి సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. భవిష్యత్ అంత కంప్యూటర్‌తో ముడిపడి ఉంటున్నందున ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు కంప్యూటర్ పాఠాలు నేర్పుతున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు వేసిన చిత్రలేఖనంను పరిశీలించి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం నేతి శంకర్,ఉపాధ్యాయులు నరేందర్,వాలంటీర్ అనురాధ పాల్గొన్నారు.

## ప్రతి మండలానికి రూ.లక్ష నిధులు

**ప్రజాపక్షం/అంతర్గాం :** అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆదేశించారు. శనివారం అంతర్గాం ఎమ్పీడీవో కార్యాలయంలో అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్షించారు.ప్రతి మండలానికి లక్ష రూపాయల చొప్పున నిధులను కలెక్టర్ మంజూరు చేశారన్నారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు, నీరు సరఫరా చేసేందుకు ఖర్చు చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 6 నుంచి 11, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పనిచేసేలా చూడాలన్నారు. ఎమ్పీడీవో భైరి వేణుమాధవ్, పర్యవేణాధికారి సుధాకర్, ఏపీవో రమేష్ పాల్గొన్నారు.

## విచారణ, సర్వే తర్వాతే.. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

### రైతు సంక్షేమానికి కృషి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** రైతుల భూ సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.శనివారం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ రైతు వేదిక, కొత్తపల్లిలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ధరణి చట్టంలో సాదాబైనామా ధరఖాస్తులను పరిష్కరించలేదని, భూభారతి చట్టంలో మాత్రం పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా ధరఖాస్తులను పరిష్కరించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ధరణి చట్టంలో మాదిరి కాకుండా నూతన చట్టంలో క్షేత్రస్థాయిలో సర్వే చేసి విచారణ జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయనున్నట్లు వివరించారు. ధరణిలో ఉన్న 33 మాడ్యూల్స్ కారణంగా రైతులు తమ భూ సమస్య దేని పరిధిలోనికి వస్తుందో తెలియక కోర్టులు, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడేవారన్నారు.నూతన చట్టంలో మాత్రం రెండంచెల అప్పీలు వ్యవస్థ తీసుకొచ్చారని అన్నారు. భూమి సవరణల కోసం ధరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లోగా సమస్య పరిష్కారం అయ్యేలా చట్టం రూపొందించినట్లు వివరించారు. రైతులు తమ భూ సమస్యలకు తహసీల్దార్ వద్ద న్యాయం జరగలేదనుకుంటే ఆర్డీవోవద్దకు.. అక్కడ సంతృప్తి చెందకుంటే కలెక్టర్.. భూమి ట్రిబ్యునల్ వద్దకు వెళ్లి అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నూతన చట్టంలో ఆబాదీ, వ్యవసాయేతర భూములు, నివాస స్థలాలకు హక్కులు కల్పించనున్నట్లు వివరించారు. ఆధార్ మాదిరి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భూకమతానికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. ప్రతి గ్రామం లో ఏటా భూమార్పుల రిజిస్టర్, చెరువులు, కుం టలు తదితర నీటి వనరుల రిజిస్టర్, ప్రభుత్వ భూముల రిజిస్టర్, పహానీ వంటి రికార్డులను మెయింటైన్ చేస్తారని తెలిపారు.

#### భూభారతి చట్టం.. రైతుల చుట్టం

భూభారతి చట్టం రైతులకు చుట్టంలా వ్యవహారిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ధరణి కారణంగా చెప్పులు అరిగేలా తిరిగినా రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ధరణితో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు వందల ఎకరాలు తమ పేరిట చేసుకున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్‌లో తనకు 20 గుంటలు తక్కువ ఉన్నట్లు నమోదు కావడంతో ఇబ్బంది పడినట్లు తెలిపారు. రైతుల సమస్యను అధిగమించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టంతో తహసీల్దార్, ఆర్డీవో వద్దనే సుమారు 80శాతం భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.తహసీల్దార్లు రాజు, రాజేష్, అధికారులు, తదితరులున్నారు.

## తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

### జగిత్యాల ఆర్‌డిఓ మధుసూదన్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** వయోవృద్ధులైన కన్న తల్లి,దండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరిస్తే శిక్షార్హులేనని ,జైలు శిక్ష ,జరిమానా ఖాయమని జగిత్యాల డివిజన్ ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ పి. మధుసూదన్ హెచ్చరించారు. శనివారం ఆర్డీవో ఛాంబర్లో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలు అయిన కేసుల్లో కొడుకులు,కోడళ్ళను ,కూతుర్లను ఆర్డీవో ముందు విచారణకు హాజరయ్యారు. విచారణల్లో పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నల్లరాజిరెడ్డి, గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన ఈర్తి రాయమల్లు, ,జగిత్యాల పట్టణం లో వాణి నగర్ కు పల్లికొండ లక్ష్మి, గొల్లపల్లి మండలం మల్లన్నపేట్ గ్రామానికి చెందిన గుండేటి రాజేశ్వరి ఫిర్యాదులపై ఆర్డీవో విచారణ కొనసాగించారు. తమ కుమారులనుంచి పోషణ,వైద్య ఖర్చులు,ఆస్తులు తిరిగి ఇప్పించాలనే కేసుల్లో ఆవృద్ధుల తరపున సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తన వాదనలు వినిపించారు. కొడుకులు,కోడళ్ళకు ఆర్డీవో కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఫిర్యాదుదారుల, కొడుకుల, కోడళ్ల, కూతుర్ల వాంగ్మూలం విని సాక్ష్యాధారాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతపూ వృద్ధులైన తల్లిదండ్రులను నిరాధరిస్తు వేధింపులకు గురిచేస్తున్న వారికి,నోటీసులు ఇచ్చినా హాజరు కాని వారికి, తీర్పు పాటించని వారికి 6నెలల జైలు, జరిమాన విధించే వీలుందన్నారు.ఆర్డీవో కార్యాలయం ఏ.ఓ.తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటీజేన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,కౌన్సెలింగ్ ప్రతినిధులుగౌరిశెట్టివిశ్వనాథం, నక్క ఇంద్రయ్య, చట్టం సెక్షన్ అసిస్టెంట్ పద్మజ,ఎఫ్.ఆర్.ఓ.కొండయ్య,తదితరులున్నారు.

## రైతులకు ‘భూ భారతి’ చట్టం కీలకమైంది

### జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల ప్రతినిధి/జగిత్యాల రూరల్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్ లో శనివారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ సాయం అందుబాటులో ఉంటుంద న్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజులలోగా మ్యూటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్‌గామ్యూటేషన్ జరుగుతుందన్నారు. జగిత్యాల రెవెన్యూ డివిజన్ అధికారి పి మధుసూదన్, అర్బన్ తహసిల్దార్ రామ్మోహన్, జగిత్యాల్ రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, రైతులు, ప్రజా ప్రతినిధులున్నారు.

## స్కౌట్స్, గైడ్స్‌తోనే విద్యార్థులకు క్రమశిక్షణ



**ప్రజా పక్షం/పెద్దపల్లి రూరల్ :** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ సెంటర్, జీడిమెట్ల, హైదరాబాద్ లో జనవరి 6 నుంచి 10 వ తేది వరకు నిర్వహించిన రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంప్ ఫర్ గైడ్స్‌లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన పోలవేని విష్ణు ప్రియ, అల్లెంకి మహాలక్ష్మి (9 వ తరగతి), కొత్తపల్లి వైశాలి (10 వ తరగతి) మరియు నేరెళ్ళ లాస్య ప్రియ (8వ తరగతి) లు రాజ్యపురస్కర్ టెస్టింగ్ క్యాంప్ లో ప్రతిభని చూపి రాష్ట్రపతి గైడ్ అవార్డ్ కు అర్హత సాధించినట్లు గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు.పెద్దపల్లి డి సి పి కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థులలో దేశ భక్తి, సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొ ందించేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసిన గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యాన్ని ప్రశంసిస్తూ, రాష్ట్రపతి గైడ్ అవార్డ్ కి అర్హత సాధించిన గైడ్స్ విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి వారిని అభినందించారు. గైడ్ టీచర్ స్రవంతి పాల్గొన్నారు.

## ‘భూభారతి’పై అవగాహన ఉండాలి

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/కొండపాక:** జిల్లా స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో భూభారతి చట్టం తేవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అన్నారు.భూ భారతి చట్టం అవగాహన సదస్సులు కుకునూరుపల్లి కొండపాక మండల కేంద్రాల్లో శనివారం జరిగాయి. కలెక్టర్ భూ భారతి చట్టంపైప్రజలకు అవగాహన కల్పించారు. అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూములను కూడా భూ భారతి చట్టం ద్వారా తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాలలో పైలెట్ ప్రోగ్రామ్‌గా తీసుకొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. సాదా బైనామాలో తెల్ల కాగితం మీద భూ విక్రయాలు జరిగిన వాటి గూర్చి భూ భారతిలో కొత్త చట్టం తెచ్చారన్నారు. గ్రామ స్థాయిలో మెయింటైన్ చేసే రికార్డ్స్, పట్టా దారు రైతులు, ఇతరులు రికార్డు కావాలని అప్లై చేసుకుంటే నిర్ణీత కాల వ్యవధిలో తీసుకునే వెసులుబాటు ఈ చట్టంలో ఉందన్నారు. ముందుగా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టం గురించి క్లుప్తంగా వివరించారు.గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్,ఎంపీడీవో, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భూమి ఉన్న ప్రతి రైతుకూ భద్రత కల్పిస్తాం

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** భూమి ఉన్నప్రతి రైతుకు భూ భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం పెద్దపల్లి మండలంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్స్ లో భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొన్నారు. భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. చిన్న సన్న కారు రైతులు 2014 కంటే ముందు కొనుగోలు చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు మాత్రమే సాధా బైనామా పట్టా లభిస్తుందన్నారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ వల్ల ఇబ్బంది పడ్డారన్నారు. పెద్దపెల్లి నియోజకవర్గం లో రైతులు పండించిన సన్న ధాన్యం నేడు మంచిర్యాల ,ఆసిఫాబాద్ ,సిరిసిల్లజిల్లాలకుకూడా తరలిస్తున్నామన్నారు.ఇందిరమ్మ ఇళ్లు బేసిమెంట్ పూర్తి చేసుకున్న నిమ్మన పల్లి గ్రామానికి చెందిన లబ్దిదారుడు తూముల శ్రీనివాస్‌కు ప్రభుత్వం విడుదల చేసిన 1 లక్ష రూపాయల చెక్కును లబ్ధిదారునికి అందజేశారు.వ్యవసాయ మార్కెట్ కమి టీ చైర్మన్ ఈర్ల స్వరూప, ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్,తహసిల్దార్ రాజయ్య, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

#### రోడ్డువిస్తరణ పనులు పూర్తి చేయాలి

సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన డబ్బుల రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో నూతన షాపిం గ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతులను మంజూరు చేశారు. సుల్తానాబాద్ పట్టణంలో భవన నిర్మాణ పనులపై నిఘా పెట్టాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనాల శాఖ భావ్ సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నిహాజ్, అధికారులు పాల్గొన్నారు.

## సైనిక్ విద్యార్థులు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలవాలి

### గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి




**ప్రజాపక్షం/చొప్పదండి:** సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాలలో అత్యంత ప్రతిభ కనబరచాలని గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో గత రాత్రి బస చేసి విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు. సైనిక విద్యార్థులు ఎన్డీయే, జేఈఈ సివిల్ సర్వీసెస్ రెవెన్యూ కస్టమ్స్ తదితర రంగాలలో అగ్రగామిగా నిలిచి సొసైటీకి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ప్రారంభమైన 36 రకాల సాధనలతో కూడిన కోర్సులో భాగమైన డ్రిల్, శారీరక శిక్షణ, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాలలో వారు చాలా చురుకుగా పాల్గొన్నారు. క్యాడెట్లతో మాట్లాడుతూ రాబోయే ఎన్డీఏ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంలో ఉత్తమ ప్రయత్నాలను ప్రోత్సహించారు. జేఈఈ ఫలితాల్లో అత్యుత్తమ పనితీరు, ఎన్డీఏ పరీక్షలో అర్హత సాధించడం, ఎన్డీఏ పూణేలో ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా శిక్షణ పొందుతున్న క్యాడెట్ రామడుగు సిద్దార్థ ఎస్ఎస్బీలో ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అజిమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలలో సైనిక్ స్కూల్ రుక్మాపూర్ నుంచి గరిష్టంగా 22 మంది క్యాడెట్‌లతో అల్పాహారం తిన్నారు. రాబోయే అన్ని పోటీ పరీక్షలలో రాణించాలనే వాగ్దానంతో సానుకూల సిఫార్సులతో ముందుకు రావాలని ప్రోత్సహించారు. జోనల్ అధికారి ఎం.భీమయ్య, జేడీఓ ప్రత్యూష, హెడ్ ఆఫీస్ సిబ్బంది శర్మ, కిశోర్ పాఠశాల డైరెక్టర్ కర్నల్ కెసిఆరావు, ప్రిన్సిపాల్ జి.కాళహస్తి, ఆర్మీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

## అంతర్గాం తహసీల్దారుపై అట్రాసిటీ కేసు

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితుడు ఉరిమెట్ల రాజలింగం, అంతర్గాం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మూర్మూర్‌లో గ్రామసభ నిర్వహించేందుకు వచ్చిన ప్రత్యేక అధికారి, తహసీల్దారు తూము రవీందర్‌తో ఆ గ్రామ మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం భార్య సుజాత తమ ఇంటి ఎదుట పారిశుద్ధ్య సమస్య ఉందని చెప్పారు. అయితే తాను ఒక తహసీల్దార్ అని, తెలంగాణ ఉద్యోగుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అని తనకే నేరుగా సమస్య చెబుతావా అంటూ ఆమె కులాన్ని కించపరుస్తూ అవమానం చేశాడు. ఈ విషయాన్ని సుజాత భర్తకు చెప్పడంతో అక్కడికి ఉరిమెట్ల రాజలింగం చేరుకొని తహసీల్దారుతో మాట్లాడారు.అయితే రాజలింగంతో కూడామాజీ ఎంపీపీ అయితే తాను భయపడాలా అంటూ అతడితో కూడ కులాన్ని కించపరిచేలా మాట్లాడి అవమానపరిచాడు. దళితులమైనతమను అవమానించిన తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని ఉరిమెట్ల రాజలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు తూము రవీందర్ పటేల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

## బహుజనులకు ‘బిఆర్ఎస్’ ఒరగబెట్టిందేమీ లేదు

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** బిఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల అధికారంలో ఉండి బడుగు బలహీన వర్గాలకు ఏం ఒరగబెట్టిందని రజతోత్సవ సభ జరుపుతుందో కెసిఆర్, కెటిఆర్‌లు ప్రజలకు చెప్పాలని మాజీ జడ్పి ఫ్లోర్ లీడర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 6 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లు అప్పుల పాలు చేసి బూటకపు మాటలతో అరచేతిలో వైకుంఠం చూపారన్నారు. వందల మంది దళిత బహుజనులు అసువులు బాసి ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. శ్రీకాంతచారి మొదలుకొని పోలీసు కిష్టయ్య వరకు ఆత్మార్పణ చేశారని, కొండాలక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయశంకర్, ఆలె నరేంద్ర లాంటి ఎందరో బహుజన నాయకులు పోరాటానికి ఊతమిచ్చారన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో కోసం సబ్బండ కులాలు, సకల జనులు ఆత్మ గౌరవం కోసం పోరాడారన్నారు. దళిత బహుజనులు పోరాటంతో సాధించిన తెలంగాణలో కెసిఆర్ కుటుంబం మాత్రం అధికారం అనుభవించిందని, వేల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్నదని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో బహుజనులు బాగుపడ్డదే లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితున్ని ముఖ్యమంత్రిని చేసి తాను కాపలా కుక్కలా ఉంటానని మాట తప్పి దళితులకు మూడెకరాల భూమి ఇచ్చినందుకు రజతోత్సవసభలుజరుపుతున్నారా? అని ఎద్దేవా చేశారు. కెజి టు పిజి ఉచిత విద్య, లక్ష ఉద్యోగాలని చెప్పి నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినందుకు ఈ రజతోత్సవ సభలంటూ దుయ్యబట్టారు. దళిత బంధు, బిసి బంధు, రైతు బంధు, డబుల్ బెడ్‌రూంలు, కొత్తపెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణీ స్కీంలను పక్కకుపెట్టి కారు రేసు ఫార్ములా, భూదందాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్, లిక్కర్ స్కాంలతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించారని, కులగణనలో పాల్గొనకుండా బహుజన సమాజాన్ని అవమాన పరిచిందన్నారు. బిసి రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెడితే కెసిఆర్, కెటిఆర్ హాజరు కాకుం డా ఆత్మగౌరవం మీద దెబ్బ కొట్టారన్నారు.ఇప్పటికైనా సోయి తెచ్చుకుని బహుజన సమాజ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే రజతోత్సవ సభలో పార్టీ అధ్యక్ష పదవి బిసి డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు.సంఘం మండల అధ్యక్షుడు రామోజీ రాజుకుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట బుర్ర శ్రీనివాస్‌గౌడ్,పెసరిశ్రీనివాస్,చీకుట్ల సదానందం, గంగుల లింగం కుమార్ యాదవ్, పచ్చిమట్ల లింగమూర్తిగౌడ్, పోతర్ల శివాజనేయులు, కక్కెర్ల సంపత కుమార్, చౌదరి రాజేశం ఉన్నారు.

ఫోకస్ క్రీడ

# ఐపిఎల్‌కు 'ఫిక్సింగ్' బెడద!

## మళ్లీ ఆరోపణలు..




చాలాకాలం తర్వాత మళ్లీ బెట్టింగ్, ఫిక్సింగ్ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ ఏడాది ఐపిఎల్ ప్రారంభం నుంచే ఏదో ఒక వివాదంలో చిక్కుకొని అల్లాడుతునే ఉంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) టికెట్లు, పాస్‌ల గురించి ఒత్తిడి తెస్తున్నదని, వేధింపులు ఆపకపోతే, హోం గ్రౌండ్‌ను హైదరాబాద్ నుంచి మరో ప్రాంతానికి మార్చేసుకుంటామని సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం హెచ్చరించడం సంచలనం రేపింది. ఆటగాళ్ల ప్రవర్తన, మ్యాచ్ ఫలితాల పట్ల అనుమానాలు వంటి అంశాలు ఈసారి ఐపిఎల్ ప్రతిష్టను మసకబరిచాయి. తాజాగా మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ మరోసారి ఫిక్సింగ్ ఆరోపణలకు కేంద్రబిందువైంది. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సిఎ) అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహాని, రాజస్థాన్ రాయల్స్ జట్టు ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లలో చివరి ఓవర్లో 9 పరుగులు చేయడంలో విఫలమైన తర్వాత, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేశాడు. అయితే, రాజస్థాన్ రాయల్స్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, బిహాని చేసిన వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, జట్టు ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంది. టిక్కెట్ల వివాదంఈ ఆరోపణల వెనుక ఆర్‌సిఎ, రాజస్థాన్ రాయల్స్ మధ్య టిక్కెట్ల పంపిణీపై వివాదం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆర్‌సిఎకు ప్రతి మ్యాచ్‌కు సుమారు 1,800 టిక్కెట్లు లభించేవి. కానీ 2025 సీజన్‌లో ఈ సంఖ్య 1,000 నుంచి 1,200లుగా నిర్ణయించారు. ఈ కారణంగా ఆర్‌సిఎ అసంతృప్తిగా ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. ఇలావుంటే, పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు జునైద్ ఖాన్, తన్వీర్ అహ్మద్, ఐపిఎల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. జునైద్ ఖాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ అనుమానాస్పదంగా ఔట్ అయిన వీడియోను షేర్ చేస్తూ, 'దాల్ మే కుచ్ కాళా హై' అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలను బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) ఖండించింది. ఐపిఎల్‌లో పారదర్శకతను కాపాడేందుకు 24X7 యాంటీకరప్షన్ యూనిట్ పనిచేస్తోందని పేర్కొంది. ప్రస్తుతానికి రాజస్థాన్ రాయల్స్ జట్టుపై వచ్చిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాధారాలు లభించలేదు. ఫిక్సింగ్ జరిగినట్టు ఇతరత్రా ఆరోపణలు రాలేదు. కేసులు నమోదు కాలేదు. దీనితో ప్రస్తుతానికి ఫిక్సింగ్ కేవలం అనుమానం స్థాయిలోనే ఉంది.




క్రికెట్ వంటి క్రీడల్లో బెట్టింగ్ సహజం. బెట్టింగ్ మాఫియా ఏకంగా మ్యాచ్ ఫలితాలను నిర్ణయించడం దుర్మార్గం. క్రీడాస్ఫూర్తికి పూర్తి భిన్నంగా జరుగుతున్న ఈ తతంగం అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్నది. 'జంటిల్మన్ గేమ్' క్రికెట్ ప్రతిష్ఠను నడిబజారుకీడుస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రికెట్ టోర్నమెంట్‌గా ఎదిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)కు బెట్టింగ్ బెడద మరింత ఎక్కువ. బెట్టింగ్ నిర్వహించే పంటర్లు మ్యాచ్ ఫలితాలను తారుమారు చేసేందుకు బుకీలను ఆశ్రయించడం, వారు ఆటగాళ్లకు భారీ మొత్తాలను ఆశచూపి తమకు అనుకూలంగా మార్చుకోవడం నిన్నమొన్న పుట్టుకొచ్చిన జాఢ్యమేమీ కాదు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా బెట్టింగ్, ఫిక్సింగ్ చెట్టపట్టాలేసుకొని తిరుగుతునే ఉన్నాయి. భారత క్రికెటర్లు మహమ్మద్ అజరుద్దీన్, మనోజ్ ప్రభాకర్, అజయ్ జడేజా తదితరులపై వచ్చిన ఆరోపణలను అప్పట్లో సంచలనం రేపాయి. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ హన్సీ క్రానే, పాకిస్తాన్ మాజీ కెప్టెన్ సలీం మాలిక్ వంటి ఆటగాళ్లు బెట్టింగ్, మ్యాచ్ ఫిక్సింగ్‌లో కీలక భూమిక పోషించారన్న విమర్శలున్నాయి. చాలా మందిపై ఆయా దేశాల క్రికెట్ బోర్డులు నిషేధం విధించాయి కూడా. తర్వాతి కాలంలో పలువురు ఆటగాళ్లపై వచ్చిన ఆరోపణలను కోర్టులు కొట్టేయడం, బోర్డులు నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నాటి ప్రకంపనలు పూర్తిగా సద్దుమణగక ముందే 2013 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ కలకలం క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఢిల్లీ పోలీసులు ముగ్గురు క్రికెటర్లు శ్రీశాంత్, అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లను స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై అరెస్టు చేయడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. ఈ ముగ్గురు 2013 ఐపిఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించారు. మరో కేసులో, ముంబై పోలీసులు నటుడు విందు దారా సింగ్, వజ్రాల వ్యాపారి ప్రియాంక్ సెపానీ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రిన్సిపాల్ గురునాథ్ మెయ్యప్పన్‌లను బెట్టింగ్ ఆరోపణలపై అరెస్టు చేశారు. 2015 జూలైలో, ఆర్‌ఎం లోధా కమిటీ చెన్నై సూపర్ కింగ్స్ , రాజస్థాన్ రాయల్స్ యజమానులైన ఇండియా సిమెంట్స్, జైపూర్ ఐపిఎల్‌లను రెండేళ్లపాటు సస్పెండ్ చేసింది. అదనంగా, పాటియాలా హౌస్ కోర్టులు శ్రీశాంత్, చండిలా, చవాన్‌లను నిర్దోషులుగా తేల్చిన తర్వాత అన్ని ఆరోపణల నుండి విముక్తి పొందారు. అయితే, జనవరి 2016లో, చండిలాను బిసిసిఐ అన్ని రకాల క్రికెట్ నుండి జీవితకాల నిషేధం విధించింది. 2019 మార్చిలో, శ్రీశాంత్ పై బిసిసిఐ విధించిన జీవితకాల నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. తరువాత ఫిబ్రవరి 2023లో, బిసిసిఐ చండిలాపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసింది. కేసు ప్రారంభంలో, నీరజ్ అలియాస్ వాతును అతని స్నేహితుడి ఇంట్లో అరెస్టు చేయగా, చండిలా, చవాన్‌లను ముంబైలోని వారి జట్టు హోటల్ నుండి అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్ రాయల్స్ దర్యాప్తు పూర్తయ్యే వరకు ముగ్గురు ఆటగాళ్ల కాంట్రాక్టులను నిలిపివేసింది. స్పాట్ ఫిక్సింగ్‌లో పాల్గొన్నట్లు చవాన్ అంగీకరించాడని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. బుకీల ఆదేశాల మేరకు చవాన్‌తో సహా ఇతర ఆటగాళ్లను స్పాట్ ఫిక్సింగ్‌లో పాల్గొనేలా చండిలా ప్రయత్నించాడని కూడా పోలీసులు పేర్కొన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి ( బిసిసిఐ) తదుపరి దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆటగాళ్లను సస్పెండ్ చేసింది. ఐపిఎల్ పాలక మండలి సమావేశమై, స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో వారు అరెస్టు చేసిన శ్రీశాంత్, చండిలా, చవాన్ మరియు మరో 23 మందిపై మహారాష్ట్ర వ్యవస్థీకృత నేర నియంత్రణ చట్టం (ఎంసిఒసిఎ) కింద కేసులు పెట్టారు. ఈ వ్యవహారంలో అండర్ వరల్డ్ డాన్లు దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్ ప్రమేయం ఉందని ఢిల్లీ పోలీసుల వాదన. అయితే, పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఇలావుంటే, ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన బుకీ సునీల్ భాటియా, ఐపిఎల్‌తో పాటు ఇండియన్ క్రికెట్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లలో ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని చెప్పడంతో, మొత్తం ఫిక్సింగ్ కుంభకోణం మరింత లోతుగా సాగుతుందనే ఊహాగానాలు చెలరేగాయి.

- క్రికెట్ బెట్టింగ్ కు సంబంధించి ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అధికారుల బృందం యాహ్యా మొహమ్మద్ ను 2013 మే 24 తెల్లవారుజామున హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి అరెస్టు చేసింది. అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ 25 మే 2013న అహ్మదాబాద్ నగరంలోని శాటిలైట్ ఏరియా నుండి బుకీ వినోద్ ముల్చందానిని అరెస్టు చేసింది. అతని వద్ద నుండి 12.8 మిలియన్ల విలువైన భారత కరెన్సీ, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్పాట్ ఫిక్సింగ్‌లో బుకీలతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ విందు దారా సింగ్‌ను అరెస్టు చేశారు. తరువాత అతను జూన్ 3, 2013న ముంబై కోర్టు ద్వారా బెయిల్‌పై విడుదలయ్యాడు.
- బెట్టింగ్ కుంభకోణానికి సంబంధించి విందు దారా సింగ్ కాల్ రికార్డులు అతను చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) జట్టు ప్రిన్సిపాల్, బిసిసిఐ అప్పటి అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసన్ అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్‌తో తరచుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు చూపించాయి. మెయ్యప్పన్‌కు తరచుగా కాల్స్ చేయడం బెట్టింగ్ కోసమా అని దర్యాప్తు చేయడానికి, ముంబై పోలీసులు అతనికి సమన్లు జారీ చేశారు. 24 మే 2013న, ముంబై క్రైమ్ బ్రాంచ్ గురునాథ్ మెయ్యప్పన్‌ను ప్రశ్నించిన తర్వాత బెట్టింగ్, కుట్ర, మోసం ఆరోపణలపై అరెస్టు చేశారు. అరెస్టు తర్వాత, సిఎస్‌కె ఫ్రాంచైజీ వెంటనే అతనిని పదవి నుంచి తొలగించింది. మెయ్యప్పన్‌ను ముంబై కోర్టు 3 జూన్ 2016న బెయిల్‌పై విడుదల చేసింది.
- జూన్ 5, 2013న, రాజస్థాన్ రాయల్స్ జట్టు సహ యజమాని రాజ్ కుంద్రాను అక్రమ బెట్టింగ్‌లో పాల్గొన్నందుకు ఢిల్లీ పోలీసులు ప్రశ్నించారు. జూన్ 6, 2013న, తన స్నేహితుడు అయిన ఒక బుకీ ద్వారా తన ఐపిఎల్ జట్టుపై పందెం వేసినట్లు తాను అంగీకరించానని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. జూన్ 7, 2013న, బెట్టింగ్‌లో అతనిపై ఉన్న అభియోగాలు రుజువైతే రాజ్ కుంద్రాను సస్పెండ్ చేస్తామని, జట్టులోని అతని అన్ని వాటాలను తిరిగి తీసుకుంటామని రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం తెలిపింది. దీని కారణంగా, జూన్ 10, 2013న బిసిసిఐ అతన్ని ఐపిఎల్ నుండి సస్పెండ్ చేసింది.
- 25 మార్చి 2014న, భారత సుప్రీంకోర్టు ఎన్. శ్రీనివాసన్‌ను తన అల్లుడు గురునాథ్ మెయ్యప్పన్‌పై మోపిన బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలపై న్యాయమైన దర్యాప్తు జరిగేలా చూసుకోవడానికి బిసిసిఐ అధ్యక్ష పదవి నుండి స్వయంగా వైదొలగాలని ఆదేశించింది. లేకుంటే ఆయన పదవి నుంచి తప్పుకోవాలని కోరుతూ తీర్పు వెలువరించక తప్పదని హెచ్చరించింది. శ్రీనివాసన్ బిసిసిఐ అధ్యక్షుడిగా కొనసాగడం 'వికారం' కలిగిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది.




### ముకుల్ ముద్గల్ కమిటీ

అక్టోబర్ 2013లో, భారత సుప్రీంకోర్టు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలను దర్యాప్తు చేయడానికి జస్టిస్ (రిటైర్డ్) ముకుల్ ముద్గల్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ కమిటీ ఫిబ్రవరి 2014లో సుప్రీంకోర్టుకు తన నివేదికను సమర్పించింది. ఈ కమిటీలోని ఇతర సభ్యులు భారత అదనపు సొలిసిటర్ జనరల్ ఎల్ నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది, మాజీ క్రికెట్ అంపైర్ నిలయ్ దత్తా. మాజీ భారత క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కూడా కమిటీలో భాగంగా మరియు కమిటీ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ఉన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ కమిటీ ఎలాంటి రుజువులు, సాక్ష్యాలు సేకరించకలేక, కేవలం కొన్ని సూచనలు చేసి చేతుపు దులిపేసుకుంది. తదనంతర కాలంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో, లోధా కమిటీ సిఫార్సులను బిసిసిఐ అంగీకరించాల్సి వచ్చింది.



ఎస్.శ్రీనివాసన్ | గురునాథ్ మెయ్యప్పన్ | రాజ్ కుంద్రా

### హ్యాట్రిక్ రనౌట్లు



ఒక బౌలర్ హ్యాట్రిక్ వికెట్లు సాధించడం తెలుసుగానీ, ముగ్గురు బ్యాట్స్‌మెన్ మూడు వరుస బంతుల్లో రనౌట్ కావడం మాత్రం చాలా అరుదు. ఢిల్లీ క్యాపిటల్స్ ఛేజింగ్‌లో 19వ ఓవర్‌లో ఈ అసాధారణ హ్యాట్రిక్ నమోదైంది. తొమ్మి ది బంతుల్లో గెలవడానికి 14 పరుగులు అవసరమైనప్పుడు, క్యాపిటల్స్ జస్ప్రీత్ బుమ్రా వరస బంతుల్లో అశుతోష్ శర్మ, కుల్దీప్ యాదవ్, మోహిత్ శర్మలను కోల్పోయింది. ఆవెంటనే మ్యాచ్ ముగిసింది. మొదటి రెండు నిర్ణయాలు ఇటివి రీప్లేల ద్వారా ధృవీకరించిన హెయిర్‌లైన్ నిర్ణయాలు కాగా, చివరిది మిచెల్ సాంట్నర్ మిడ్‌ఆన్ నుండి డైరెక్ట్ హిట్. ఐపిఎల్‌లో ఈ విధంగా హ్యాట్రిక్ రనౌట్లు జరగడం ఇదే మొదటిసారి. అయితే, టి20 ఫార్మాట్‌లో మాత్రం మొత్తం నాలుగు పర్యాయాలు ఇలాంటి అరుదైన ఘటనలు చోటు చేసుకున్నాయి. 2011లో కరాచీలో ముల్తాన్ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫైసలాబాద్ వోల్వ్స్ ఇన్నింగ్స్‌లో మొదటిది జరిగింది. ఆ మ్యాచ్ చివరి ఓవర్‌లో నాలుగు రనౌట్లు వచ్చాయి. దీని తర్వాత 2014లో కోల్‌కతాలో జరిగిన సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో త్రిపురపై అస్సాం, 2019లో కాబూల్‌లో స్పీన్ ఘర్ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అమో షార్క్స్ , 2024లో బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో ఖుల్నాపై బారిసాల్ (ఖుల్నాకు ఒక పరుగుతో విజయం సాధించడానికి మ్యాచ్‌లోని చివరి మూడు బంతులు) హ్యాట్రిక్ రనౌట్లు నమోదయ్యాయి.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : మేకల



**ప్రజాపక్షం /లక్షెట్టిపేట్ :** కార్మిక హక్కులను కాలరాస్తూ బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శనివారం లక్షెట్టిపేట్ మార్కెట్ యార్డ్‌లో 139వ మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కార్మికుల ఐక్యతతోనే అది సాధ్యమవుతుందని, కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం అండగా నిలిచేది ఎఐటియుసి అని తెలిపారు. 139వ మేడే ఉత్సవాలను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సన్నాహక సదస్సు ఈ నెల 27న మంచిర్యాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు. కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, పరిశ్రమల అమ్మకాన్ని నిలిపి, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రభుత్వాల ఆధీనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. జమ్ముకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేధరి దేవవరం, కేతిరెడ్డి రమణ రెడ్డి, రవి కిరణ్, బాను చెందర్, రాజన్న, సత్తయ్య, ఐలయ్య, బాలయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను కాపాడుకుందాం

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కార్మిక చట్టాలను కాపాడుకుందామని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. సికెఎం హస్పిటల్ ఎదుట 139వ మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే వరంగల్ జిల్లాలో సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు ఘనంగా నిర్వహించాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై 29 కార్మిక చట్టాల పునరుద్ధరణకై మే 20వ తేదీన జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని, దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకుందామన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సంఘటిత రంగం, అసంఘటిత కార్మికులపై పని గంటలు పెంచుతూ ఆనాడు చికాగో నగర అమరవీరుల స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం ఈనాడు మరల మోదీ ప్రభుత్వం బడా కార్పొరేటర్లకు అనుకూలంగా 12 గంటలు విధానాన్ని అమలు చేస్తున్నారని, దీన్ని కార్మికులందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికెఎం హాస్పటల్ బ్రాంచ్ అధ్యక్షులు కలకోట రాజు, కార్యదర్శి నాగవెల్లి శంకర్, సక్కుబాయి, సులోచన, రజిత, వీరన్న, రవీందర్, వాణి, పద్మలత, సురేందర్, దేవేందర్, స్వరూప, రాజు, శ్రీనివాస్, యశోద, కావ్య, దేవి, లక్ష్మి , బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న
# పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కార్మికుల కు పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని, అదేవిధంగా 139వ మేడేను సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్, ఓసిపిలలో మేడే పతాకాలను ఆవిష్కరించి చికాగో అమరవీరులకు నివాళులు అర్పించి ర్యాలీలు, సభలు నిర్వహించి ఘనంగా మేడే వేడుకలను జరుపుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపు నిచ్చారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని సెంట్రల్ వర్క్ షాప్ నందు ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను, 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాల వల్ల కార్మికులు ఇప్పుడు అనుభవిస్తున్న హక్కులు ఉండవని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చాయని, కనుక సింగరేణిలో కూడా సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా కార్మికుల దినోత్సవం మేడేను సింగరేణి వ్యాప్తంగా ఎర్ర జెండాలను ఎగుర వేసి ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కొరకు మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వెంకట్, బ్రాంచి కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా కంపెనీల అనుమతులు రద్దు చేసేవరకూ పోరాటం

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్నారి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల :** మునుగోడు నియోజకవర్గంలో విచ్చల విడిగా నెలకొల్పుతున్న ఫార్మా కంపెనీలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్నారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన సిపిఐ గట్టుప్పల మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఫార్మా కంపెనీలకు విచ్చల విడిగా అనుమతులు ఇచ్చారని అట్టి తనుమతులు రద్దు అయ్యేంతవరకు పోరాడుతామన్నారు. గట్టుప్పల ,క్రిష్టాపురం, వెలిమినేడు, చౌటుప్పల్ లాంటి ప్రాంతాలలో ప్రమాణాలు పాటించని కంపెనీలకు కూడా అనుమతులు ఇచ్చారని దీని కారణంగా వాతావరణం కాలుష్యం ఏర్పడి ప్రజలు ఈ ప్రాంతంలో నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని దోషులను నిర్ధాక్షిణ్యంగా ఉరితీయాలని కోరారు. మత చాందస్తవాదులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మామాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై పోరాటం తప్పదన్నారు. మండల సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, మండల నాయకులు కారింగు శ్రీను, కందాల ముత్యం, దెండె నర్సింహ్మా, ఐతరాజు లక్ష్మయ్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ సెమినార్ హాలులో జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమ్ పావని, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎఐసిటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారీ అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదని విమర్శించారు. కార్మికులు సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తీసుకొచ్చి కార్మికులను కట్టు ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు కలిసి మే20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలియజేశారు. మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వారు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామ్మూర్తి, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కుసుమ శ్యాంసుందర్, ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు మైముదా, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రాజేందర్, బిఆర్‌టియు జిల్లా నాయకులు నాయిని రవి, అధ్యక్షత వహించారు.ఈ సదస్సులో రవి, బొట్ల చక్రపాణి, పుల్లా అశోక్ తదితరుల పాల్గొన్నారు.



## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలి

ఎఐటియుసి మేడే పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతునందున కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపు నిచ్చారు. నల్లగొండ ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో 139వ మేడే పోస్టర్‌ను ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం శనివారం ఆవిష్కరించి మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసిన పోరాట దినోత్సవం మేడేను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, పనిగంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 12 గంటలుగా మార్చుటకు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. నేడు దేశంలో అసంఘటితరంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పని భద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీస వేతనాలకు నోచుకోక వారు దుర్భర జీవితం కొనసాగిస్తున్నారని అన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల ను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో మండల కేంద్రాల్లో పని ప్రదేశాల్లో జెండాలు ఎగురవేయాలని, పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి, పాణెం వెంకటరావు, డివిజన్ కార్యదర్శి విలెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి,జి నరేందర్,ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు, వెంకన్న, అంజయ్య, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలి : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలని, మెప్మా ద్వారా యువతకు పేదలకు పని కల్పించాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. ఉపాధి కూలీలతో కలిసి సమస్యలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను సుజాతనగర్, నాయకులగూడెం, కోమటిపల్లి, లక్ష్మీ దేవి పల్లి, మంగపే ట, నరసింహసాగర్, నిమ్మలగూడెం గ్రామపంచాయతీలను కలుపుతూ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేయడం కోసం ఉద్యోగ, ఉపాధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన గ్రామాలలో నిధులు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే మెప్మా నిధులను గ్రామీణ ప్రాంతాలకు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళూరి పాపారావు, మండల అధ్యక్షులు మదన్‌సింగ్, ఏఐటియూసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, నాయకులు బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గా ప్రసాద్, మూడు గణేష్, వీర్ల లింగేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై సర్వే



**ప్రజాపక్షం/కామేపల్లి:**మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ చురుకుగా కొసాగుతుంది. ఆదర్శ గ్రామం పొన్నెకల్ గ్రామంలో 59 మంది లబ్దిదారులను గుర్తించి పనులు కొన సాగిస్తుండగా, మిగతా 23 గ్రామ పంచాయితీలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కోటాలో 557 మంది లబ్దిదారులను ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పంచాయితీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో ఎంపీవో, తాళ్లగూడెం ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రెడ్డి శని వారం సమగ్ర సర్వే నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో తాళ్ళగూడెం పంచా యితీ కార్యదర్శి విజయ్, మాజీ వార్డు సభ్యులు నల్లమోతు వెంకట నరసయ్య పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలు

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు



**ప్రజాపక్షం/కల్లూరు :** కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు కార్మికులను కోరారు. మేడే వాడవాడలా కార్మికుల జెండాను ఎగరవేయాలని కోరారు. శనివారం మండల కేంద్రంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడులను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాటిటీ, బోనస్, పెన్షన్ చట్టాలను అమలు చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన, గురుకుల, మోడల్, హాస్టల్, ఐకెపి కార్మికులు, ఆసుపత్రి కార్మి కులు, పాఠశాల స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలని, గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎన్‌హెచ్ ఎం స్కీమ్ సెకండ్ ఏఎన్ఎం లను అన్ని రకాల కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగు లను పర్మినెంట్ చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకి 600రూపాయలు దినసరి కూలీ చెల్లించాలని కోరుతూ మేడేను జరపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దా మాల దయాకర్‌రావు, స్వరూప, కోటేశ్వరి, జాన్‌బి, ప్రమోద్ సత్యవతి, లేయమ్మా, పంచాయతీ కార్మికుల అధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## సిపిఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా శివాజీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** సిపిఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా మారెడ్డి శివాజీ ఎన్నికయ్యారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఎస్‌విఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన పట్టణ ముఖ్యకార్యకర్తల అత్యవసర సమావేశంలో ఈఎన్నిక జరిగింది. ఎఐటియుసి తాత్కాలిక పట్టణ కన్వీనర్‌గా కంబంమెట్టు శ్రీనివాస్, ఎఐవై ఎఫ్ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా గుంజ రామారావు, మహిళా సమాఖ్య పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా బైరు వరలక్ష్మీని కూడా పట్టణ కమిటీ ఎన్ను కుంది. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవి కుమార్ హాజరై మాట్లాడుతూ మేడే ను వాడవాడల ఘనంగా జరపాలని కోరారు. పార్టీ, ప్రజాసంఘాల నాయ కులు ప్రజా సమస్యలపై పోరా టాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మీసాల భాస్కర్‌రావు, ఏపూరి వెంకటేశ్వరరావు, మహేష్, త్రిమూర్తులు, వెంకన్న, శోభన్, సీతా రామరాజు, వెంకటమ్మ, రమణమ్మ, జ్యోతి, అజీమ్, చంటి, వెంకట్రావు, సతీష్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల పునరుద్ధరణకు పోరాటాలు : రామకృష్ణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మేడే వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహిద్దా మని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మేడే వేడుకల పోస్టర్‌లను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు, 29 కార్మిక చట్టాల పునరుద్ధరణకు పోరాటాలు చేద్దామని కార్మికులకు పిలు పునిచ్చారు. మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయ వంతం చేద్దామని రామకృష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమల్ల యోబు, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూని యన్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే రహిమతుల్లా, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, వీరయ్య, పుల్లయ్య, వీరబాబు, కోటేశ్వరరావు, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## మేడేని వాడవాడలా జరుపుకుందాం

కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపు

**ప్రజాపక్షం/చర్ల :** మేడేని డివిజన్ వ్యాప్తంగా వాడవాడలా జరుపుకుందా మని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం లో ఎఐటియూసి అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సంద ర్భంగా కల్లూరి మాట్లాడుతూ భద్రాచలం డివిజన్‌లోని అన్ని అనుబంధం సంఘాల కార్మికులు ప్రపంచ కార్మిక ది నోత్సవం మే డేని వాడవాడలా గ్రామగ్రామాన ఎర్రజెండాలు ఎగురవేయాలన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ నూపా తిరుపతి రావు, మాజీ ఎంపిటిసి పాలంచ రామారావు, నానిపెల్లి భద్రం, మాజీ సర్పంచ్ మల్లం నాగేశ్వరరావు, గుంజి మాల్యాద్రి, ఎస్కే ఖాజా, నంబూరి నాగేశ్వర రావు, అనీల్, సాయిలి తిరుపతిరావు, రాజేష్, సత్యనారాయణ, రవి, యాకయ్య, ఆదిన్నారాయణ, అనసూయ, ఆదిలక్ష్మి మంగమ్మ, వెంక ట్రావు, సీతారాములు, చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావు, కట్టం నాగేశ్వరరావు, కోడి రెక్కల రాజారావు, నాగరాజు, రాంబాబు, రామారావు, సాయికన్నయ్య, దేవయ్య, సీతయ్య పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి : జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతకాని :** మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. శుక్ర వారం రాత్రి ప్రొద్దుటూరు గ్రామ శాఖ సమావేశం షేక్ పుల్లా సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించి పాలకుల వ్యతిరేక విధానాలను తిప్పికొటాటని పిలుపునిచ్చారు. అనంతరం నూతన శాఖను ఎన్నుకున్నారు. నూతన శాఖ కార్యదర్శి గా తుళ్లూరు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా వేల్పుల కోటయ్య, కన్నెపోగు వెంకటితో మరో 15 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. తొలుత సీనియర్ నాయకులు కళ్యాణపు జానకిరాములు పార్టీ జెండా ఆవిష్కరించారు. సమావేశంలో మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జు నరావు, నాయకులు వేపూరి నర్సయ్య, తాళ్లపల్లి అజయ్, తుడుం రాంబాబు, కొల్లి చిన్న వెంకటి పాల్గొన్నారు.

# ప్రతీ రైతుకూ బోనస్ అందేలా చర్యలు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** రైతులకు ఎటువంటి ఇబ్బం ది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మండల కేంద్రంలోని రాఘవపురం రోడ్డులో ది ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం కొత్తగూడెం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితీష్ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే బోనస్ కాలంలో అదేవిధంగా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జితీష్ వి పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను రైతులు పొందాలంటే ధాన్యం శుభ్రపరిచి కొనుగోలుకు కేంద్రానికి తీసుకుని రావాలన్నారు. సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు మాట్లా డుతూ కచ్చితంగా ప్రభుత్వం మద్దతు ధర పొందాలంటే రైతులు తమ ధాన్యాన్ని శుభ్రపరిచి, 17% వచ్చినాక ఏఈఓ టోకెన్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధర సన్నాలకి 2320/ రూపాయలు, కామన్ వెరైటీస్‌కి రూ.2300/ చొప్పున ప్రభుత్వ మద్దతు ధర ఒక క్వింటాకు అలాగే సన్నాలకి అదనంగా క్వింటాకు 500/ రూపాయలు బోనస్ ఇస్తుందని తెలియజేశారు. పోయిన ఖరీఫ్ సీజన్లో కొత్తగూడెం సొసైటీ పరిధిలోని సుమారు 1042 మంది రైతులకు నాలుగు కోట్ల రూపా యలు బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె షాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, తహసీల్దార్ శిరీష డిటి మహేష్ ఏవో నర్మదా, సొసైటీ డైరెక్టర్లు బండి అమృత రావు, కర్నాటక రామచంద్రరావు, తిట్ల విజయ కుమారి, పోటు వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, రైతులు లింగం లక్ష్మయ్య, తాళ్లూరి ధర్మారావు, రైతు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, భూ భారతి సమర్థవంతంగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, రాజీవ్ యువవికాసం దరఖాస్తులు, జలసంచ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు ఫాంఫాండ్ నిర్మాణం, తాగు నీటి సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో భూభా రతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను అదేశిం చారు. భూభారతి అమల్లో భాగంగా రెవెన్యూ రికార్డులు సరిదిద్దాలని అధి కారులను ఆదేశించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జీవ వైవిధ్యంలో పశువైద్యుల సేవలు గొప్పవి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పశు పాలకులకు మార్గ దర్శకులుగా మూగ జీవాల పాలిట ప్రాణ దాతలుగా, జీవ వైవిధ్యంలో కీలక పాత్ర పోషించే పశు వైద్యుల సేవలు గొప్పవని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. శని వారం డిపిఆర్‌సి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళికి ప్రత్య క్షంగా ఉపయోగపడే పశువుల ఆరోగ్యానికి పశు వైద్యులు, పశు వైద్య శాస్త్రవే త్తలు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశు వైద్య దినోత్సవంగా జరుపుకుం టున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసా యంలో పశుపోషణ కీలకమైందన్నారు. ఆహార భద్రతను నిర్ధారించడం, వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించడం, జంతువుల ఆరోగ్యం, శ్రేయ స్సును ప్రోత్సహించడంలో పశు వైద్య నిపుణుల బాధ్యతను గుర్తించడం కోసం ఈరోజు వేదికగా ఉంటుందన్నారు. జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ జిల్లాలో పశు సంవర్థక శాఖ చేపడుతున్న కార్యక్రమా లను వివరించారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ పురందర్, పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీరమణి, రాష్ట్ర పశువైద్యులు సంఘం అధ్యక్షులు డాక్టర్ రమేష్‌బాబు, పశు వైద్య అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్‌శెట్టి, ఎడిలు డాక్టర్ కిషోర్, ప్రదీప్, ఉపేందర్, రాజా, వెట ర్నరీ వైద్యులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మేడే'

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తూ కార్పొరేట్ జపం వల్లిస్తున్న కేంద్రంలోని ప్రభు త్వాన్ని తట్టిలేపేవిధంగా మేడే ఉత్సవా లు జరుపు కోవాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్య దర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. శనివారం చుంచుపల్లి కమ్మవారి కల్యాణ మండపంలో జరి గిన కొత్తగూడెం టౌన్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, చం ద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సిపిఐ కౌన్సిల్ సభ్యు ల సమావేశానికి హాజరై మాట్లాడారు. పాలకులె వరైనా కార్మికుల హక్కులను కాలరాస్తూ, ప్రజాసంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నా రని ఆరోపించారు. కార్మికులు, ఉద్యోగుల హక్కు లను పారిశ్రామిక, కార్పొరేట్ల కోసం నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గం చట్టాల అమలుకు ఎర్ర జెండా చేత బట్టి పోరాడాలన్నారు. ఐక్య పోరాటాలే సమస్య లకు పరిష్కార మార్గమన్నారు. ప్రతి గ్రామంలో, బస్తీల్లో, కార్మిక క్షేత్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్ర గిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, మండలాల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, బొర్రా కేశవరావు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జివీరాస్వామి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, మాతంగి లింగయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## సక్రమంగా బాధ్యతల నిర్వహణ

సిపి సునీల్ దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలు సక్ర మంగా నిర్వహించాలని, తద్వారా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అప్ర మత్తంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదే శించారు. శనివారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సెక్టార్ ఇంచార్జ్ పోలీస్ అధి కారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి సునీల్ దత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిసిఆర్‌పి ఏసిపి రవీందర్‌రెడ్డి, సిఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చారని ఆరోపిస్తూ బాలియతండా గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై సర్వేను అడ్డుకొన్నారు. అధికారులను గ్రామంలోకి రానివ్వకుండా వెనక్కితిప్పి పంపించారు. చంద్రుగొండ మండల పరిధిలోని పోకలగూడెం పంచా యితీ, బాలియతండా గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల జాబితాను సర్వే చేయటానికి వచ్చిన గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారి శ్రీనివాస రావు, జిపి సెక్రటరీ నాగేశ్వరరావులపై గ్రామస్తులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పోకలగూడెం గ్రామ పంచాయితీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అవకత వకలు జరిగాయన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన వారికి, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ప్రస్తుతం ఇండ్లు ఇచ్చార న్నారు. పేదలకు, వితంతువులు, వికలాంగులను, ఒంటరి మహిళలను విస్మరించారన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు లంచాలు ఇచ్చిన వారి పేర్లు జాబితాలో పెట్టారన్నారు. జాబితాను మార్చి, పేదల పేర్లు పెట్టే వరకు ఏ ఒక్క అధికారిని ఊర్లోకి రానివ్వమని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులు, మహిళలు చంద్రుగొండ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి, ఎంపిడిఒ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. జాబితాపై విచారణ చేపట్టా లని వారు డిమాండ్ చేశారు.

## సమాజానికి వైద్యులను అందించడం గర్వకారణం

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

'మమత'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మమత వైద్య విద్యా సంస్థలను స్థాపించి ఎంతో మంది వైద్యులను సమాజానికి అందించడం గర్వకారణంగా ఉందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. వైద్య విద్యలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పువ్వాడ అజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలి పారు. శనివారం మమత ఆసుపత్రి ఆవరణలో మమత వైద్య, దంత, నర్సింగ్ కళాశాలల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్ డేలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కాళోజీ నారాయణ రావు వైద్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివి నందకుమార్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయ కులు, మమత సంస్థల ఫౌండర్ పువ్వాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం స్థాపించిన మమత వైద్య సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపుపొం దడం సంతోషంగా ఉందన్నారు. మమత వైద్య సంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు కావాల్సిన వసతులను అందిస్తూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెర వేరుస్తున్నట్లు తెలిపారు.వైద్య రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ దానికి అనుగుణంగా తమ వైద్యసంస్థల్లో సౌకర్యాలు, చికిత్సలు అందిస్తున్న ట్లు తెలిపారు. వైస్ ఛాన్సలర్ నందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించి పట్టా అందుకున్న విద్యార్థులు వృత్తిని దైవంగా భావించి సేవలు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా 360మంది వైద్య విద్యార్థులు, 190 మంది దంత విద్యార్థులు, 100 మంది నర్సింగ్ విద్యార్థులకు గ్రాడ్యు యేట్ పట్టాలు అందజేశారు. పువ్వాడ ఉదయ్‌కుమార్ జయశ్రీ కుమారుడు నరేన్‌రాజ్ వైద్య విద్య పిజిలో గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. గ్రాడ్యుయే షన్‌డే సందర్భంగా మమత ఆసుపత్రి ఆవరణ మొత్తం సందడి నెలకొంది. పట్టా అందుకున్న తమపిల్లలతో తల్లిదండ్రులు, బంధువులు ఫోటోలు, సెల్ఫీ లు దిగుతూ సంతోషాలను పంచుకున్నారు. కార్యక్రమంలో మమత ఎడ్యుకేష నల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, డైరెక్టర్లు పువ్వాడ నయన్ రాజ్, నరేన్ రాజ్, ప్రిన్సిపాల్ అనురాధ, వెంకటేశ్వరరావు, కృష్ణ వైష్ణవి పాల్గొన్నారు.

## భూ హక్కులపై అభద్రత తొలగించేలా చర్యలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే రాందాస్ నాయక్




**ప్రజాపక్షం/కొణిజర్ల:** భూ సమస్యలకు పరిష్కారం చూపి, భూహక్కులకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల శ్రీరామ కళ్యాణ మండపంలో శని వారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వారసత్వ భూములకు కుటుంబసభ్యులందరికి నోటీసులు పంపిన తర్వాతే భూ హక్కుల బదలాయింపు జరగాలని పేర్కొన్నారు. నూతన భూభారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. గతంలో ఉన్న విఆ ర్వోవ్యవస్థ, అనుభవదారు కాలం మళ్లీ వస్తుందని తెలిపారు. రైతులు ఆర్థి కంగా బలపడాలనే రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు మద్దతుతోపాటు రూ 500 బోనస్ అందజేస్తుందని వివరించారు. రెండు లక్షల వరకు రుణాలున్న రైతుల రుణమాఫీ చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జి.నర సింహారావు, కొణిజర్ల మండల తహసీల్దార్ రాము, ఎంపిడిఒ రోజారాణి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కరుణశ్రీ, మండల వ్యవసాయాధి కారి బాలాజీ, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ జెడ్పీటిసి యర్రా బాబు మాట్లాడుతు సాదాబైనా మాలో ధరఖాస్తు చేసుకోనివారికి అవకాశం కల్పించాలని, అసైన్‌మెంట్, బంచరాయి భూములకు పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర భూసర్వేచేసి హద్దులు గుర్తించి పట్టాలు ఇవ్వాలన్నారు. యాసంగి వరిధాన్యాం అమ్మిన రైతులకు కింటాకు 12 కేజీలు తరుగుపేరుతో మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టి కి తీసుకొచ్చారు. ఆయన వెంట రైతులు స్వర్ణ రమేష్, జి భాస్కర్‌రావు, ఎల్.గోపాల్‌రావు పాల్గొన్నారు. రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ మాట్లాడుతూ సర్వే ద్వారానే రైతుల రికార్డులకు భద్రత ఉంటుందన్నారు. సర్వేనెంబర్లు సరైన పద్దతిలో లేకపోవడంతోనే రైతులు కోర్టుచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థిని గౌతమికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితా లలో 470 మార్కులకు 467 మార్కులు సాధించి రాష్ట్రస్థా యిలో రెండవ ర్యాంకు కైవసం చేసుకుంది. గౌత మిని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, అతని సోద రుడు హర్షిక ఆగ్రోస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ తోట నాగకృష్ణలు అభినందించి శనివారం సన్మానించారు. మాజీ జడ్పిటిసి పిలుపుమేరకు గౌతమికి రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమి ఎన్నో కష్టనష్టాలను ఓర్చి తల్లిదండ్రులు మరణించినా, పట్టు విడ కుండా చదివి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం అభినందనీయ మన్నారు. కష్టపడి చదవితే ఏదైనా సాధించవచ్చని గౌతమి నిరూపించిం దన్నారు.యువత గౌతమిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను ఎదగా లని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో గౌతమిని చదువులో ప్రొత్సహించేం దుకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గౌతమిని సన్మానించిన వారిలో సాయి, తరుణ్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఎఐటియుసి ఏరియా వర్క్‌షాప్ ఫిట్ సెక్రటరీగా శ్రీనివాస్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి భూపాలపల్లి ఏరియా వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీగా దాసరి శ్రీనివాస్‌ను నూతనంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్లో జరిగిన ఏరియా వర్క్ షాప్‌లో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అబ్దుల్ ఖాదర్, ఎలక్ట్రిషన్ సేఫ్టీ కమిటీ మెంబర్లుగా జి కొమురయ్య వెల్డర్ రమేష్, ఎలక్ట్రిషన్ పిల్లి రవి, ఫిట్టర్ వర్క్ కమిటీగా కరుణాకర్, ఆటో మెకానిక్ జి.శ్రీనివాస్, టర్నర్ గరిగ రమేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, ఎం.విజేందర్, ఏరియా టెక్నీషియన్ ఇన్‌చార్జి ఏం రవికుమార్ పాల్గొన్నారు.

## భూ వివాదాల పరిష్కారానికి భూభారతి

కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం ఉపయోగపడు తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా శనివారం మహా ముత్తారం మండలం, బొర్ల గూడెం రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి నూతన రెవెన్యూ చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు భూ భారతి చట్టం ద్వారా రికార్డుల నిర్వహణ ఒక్కగా నిర్భహించడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డులాగా భూమి కలిగిన ప్రతి రైతుకు భూధార్ కార్డు జారీ చేయనున్నారని తెలిపారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ చేసేందుకు అవకాశం లేదని సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, కానీ భూ భారతి చట్టంలో రెండెంచల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు. ప్రతి అంశం భూ భారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సందేహాలు, సమస్యలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల ప్రత్యేక అధికారి వేముక టేశ్వర్లు, తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం 2025 ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం ఐటిడిఎ, ఏటూరునాగారం కార్యాలయంలో భూభారతి నూతన ఆర్ఒఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూ భారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉందని, తద్వారా ఎంతో మంది రైతుల సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు. చట్టంలో కీలకమైనది అప్పీలు వ్యవస్థ అని, ఎవరైనా రైతుకు అన్యాయం జరిగినట్లయితే అప్పీలు వ్యవస్థ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. తహసీల్దారు, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్, సిసిఎల్ఏ స్థాయిలలో అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాలలో చాలా వరకు భూమి హద్దుల గొడవలు ఉంటాయని, కానీ భూ భారతిలో రీ సర్వే, కొనుగోలు, పాలు పంపకాలు, దస్తావేజులు, విరాసత్ పట్టా మార్పిడికి తప్పనిసరిగా కమతం జరపరచడం వలన భవిష్యత్తులో భూ గొడవలు ఉండవని తెలిపారు. భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని, గతంలో గ్రామాలలో గ్రామ పరిపాలన, విఆర్ఓ, విఆర్ఏ వ్యవస్థ ఉండేవని, వారిని ఇతర శాఖలలో సర్దుబాటు చేయడం వలన గ్రామాలలో భూ సమస్యలు పెరిగాయని, త్వరలో గ్రామపాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ల నియామకంతో భూ సమస్యలను తగ్గించవచ్చునని తెలిపారు. విరాసత్ మార్పిడికి వారసులకు అందరికీ నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఉందని, భవిష్యత్తులో ఎలాంటి గొడవలు ఉండవని తెలిపారు. ప్రతి రైతు భూ భారతి చట్టంలోని అంశాల పట్ల అవగాహన చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా కేంద్రంలో మెగాజాబ్ మేళా

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతిని ధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్‌లో నేడు నిర్వహించే మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, నియోజకవర్గ నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకొని జాబ్ మేళాను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైసమ్మ గుడి ఎదురుగా ఉండే పుష్ప గ్రాండ్ ఫంక్షన్‌హాల్లో జాబ్ మేళా ఏర్పాట్లును పరిశీలించి అనతంరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ..ఈ జాబ్ మేళ కార్యక్రమానికి రాష్ట్ర ఐటి, ఇండస్ట్రీయల్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగేనే వేల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీచేసిన ఇంకా నిరుద్యోగులు ఉద్యోగాలు లేక చెడు అవా ట్లకు బానిసవుతున్నారని, వారి కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలోని టాస్క్ సంస్థ నుండి 75 కంపెనిలతో భూపాలపల్లి నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 8000వేల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ మహోన్నత కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని, నిరుద్యోగులు గ్రామాలనుండి చేరుకోవడానికి జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మండల స్థాయిలో ఎంపిడిఒలు, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీలు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మీరు రావడం కోసం వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాబ్ మేళాకు వచ్చేవారు 5సెట్లతో కూడిన అర్హత సర్టిఫికేట్లతో రావాలని, ఉ:8గంటలకు జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో జాబ్ మేళా ప్రారంభమవుతుందని ఇంకా రిజిస్ట్రేషన్ చేయని వారు వెంటనే నమోదు చేసుకోవాలని లేదా నేరుగా వచ్చి అదే రోజు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చాని తెలిపారు. మీకు మధ్యాహ్నం 13వేల మందకి బోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉదయం జరిగే జాబ్ మేళాలో 75 కంపెనీ లు వివిధ హోదల్లో మీ అర్హత చదువును బట్టి 15 వేల నుండి 50 వేల వరకు వేతనం పొందే ఉద్యోగంలో మీకు అవకాశం కల్పించనున్నారు. ఎండ కాలం కావడం వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా వైద్య ఆరోగ్య శాఖ నుండి మెడికల్ క్యాంప్, అంబ్లెన్స్,ఓఆర్ఎస్ ఎలాంటి ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కావున నియోజకవర్గంలోని యువతి యువకులు అధిక సంఖ్యలో హజరై ఉద్యోగం పొంది జీవితంలో స్థిర పడాలని సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. ఈ సమావేశంలోలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్,బట్టు కర్ణాకర్,టిపిసిసి మెంబర్ చల్లూరి మధు, టాస్క్ సంస్థ ప్రదీప్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్,ముంజాల రవిందర్ గౌడ్ స్థానిక నాయకులు పాల్గోన్నారు.

## ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలి

సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**జయశంకర్ భూపాలపల్లి పట్టణ కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ప హల్గామ్ లో ఉగ్రవాదులు దాడిలో చనిపోయిన భారతీయులకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సొత్తుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్ పహల్గంలో టూరిస్ట్ లను టార్గెట్ చేసి భారతీయులపై విచక్షణ రహితంగా కాల్చి చంపిన ఉగ్రవాద సంస్థలను మట్టుబెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.శాంతి యుతంగా ఉన్న భారతదేశంపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. స్థానిక కొమురయ్య భవన్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్, ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆర్మీ రిక్రూట్మెంట్ నిర్వహించక మూడు సంవత్సరాలు గడుస్తుందని ఇప్పటికైనా ఆర్మీ బలగాలను పెంచాలని కోరారు. టూరిస్ట్ ప్రాంతాల్లో సెక్యూరిటీన్ని పెంచాలని కోరారు. మరోసారి ఉగ్రవాదులు దాడి చేయకుండా ప్రభుత్వం రక్షణ బలగాలతో చర్యలు చేపట్టాలని కోరారు. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ లాంటి రిక్రూట్మెంట్ కాకుండా పాత పద్ధతిలోనే ఆర్మీ లోకి యువకులను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు క్యాథరాజు సతీష్,నేరెళ్ల జోసెఫ్, జోగేష్, దొంతర అజయ్, మేడి శేఖర్, గోనల తిరుపతి, పీక రవికాంత్, యాకుబ్ పాషా, శ్రీనివాస్, ఐలి శరత్, మంచినీళ్ల వైకుంఠం, రాజేందర్, పసునూటి మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేదే కమ్యూనిస్టులే

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**ప్రజాపక్షం/కాజీపేట :** దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే నని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, రాంపూర్‌లో గుడిసె వాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి అన్నారు. శనివారం కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ మహాసభలు మంద సుమన్ అధ్యక్షతన జరగగా ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి పార్టీ వంద రోజులలోనే నిత్యావసర వస్తువులను ధరలను తగ్గిస్తామని గొప్పలు చెప్పుకొని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చినారు అయినా ధరలను నియంత్రించ లేకపోవడం కాకుండా నిత్యావసర వస్తువుల ధరలను వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరు స్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మాసభలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, బొట్టు క్షపతి, మునిగాల ఐలయ్య, లక్ష్మి , పద్మ, మునిగాల స్వామి, మునగాల విజయ్ కుమార్, బిఓసి బిల్డింగ్ వర్కర్స్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టపాక రవి తదితరులు పాల్గొన్నారు. తదనంతరం రాంపూర్ శాఖ కార్యదర్శిగా ము నిగల స్వామి సహాయ కార్యదర్శిగా నాగరాజు ఐదుగురుది కార్యవర్గ సభ్యులుగా ఎ న్నుకోవడం జరిగింది. రామకృష్ణ కాలనీ కార్యదర్శిగా మంద సుమన్. సహా య కార్యదర్శిగా ముని గల ఐలయ్య, ఐదుగురు సభ్యులను కార్యవర్గంగా ఈ మాసభలో రెండు గ్రామ శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ డిసిఓ డాక్టర్ ఎ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఐఐటి, నీట్, ఇంజనీరింగ్ సీట్లను సాధించడంలో రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా నడుస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఏడు ప్రీమియర్ సిఓఈ కళాశాలలో 31 సిఓఈ కళాశాలలో 21 నాన్ సిఓఈ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఈసి, ఎంఈసిహెచ్, ఒకేషనల్ కోర్సుల్లో గల సీట్లను భర్తీ చేయుటకు ఆన్‌లైన్ పద్దతిలో దరఖాస్తు చేసుకోవాలని టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ డిసిఓ డాక్టర్ ఏ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సెక్షన్‌లో 40 సీట్లు అందుబాటులో ఉంటాయని, ఎస్‌సికి 30 సీట్లు, ఎస్‌టికి రెండు సీట్లు, బిసికి ఐదు సీట్లు, మైనార్టీకి ఒక సీటు, ఓసికి రెండు సీట్లు, కేటాయించబడునని తెలిపారు. విద్యార్థులకు పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రీమియర్ సిఓఈ, సిఓఈ, ఎన్ఐఎస్ సిఓఈ కళాశాలలకు సీట్లు కేటాయించబడతాయన్నారు. పిహెచ్‌సి(అంగవైకల్యం), ఆర్ఫాన్(అనాథ) విద్యార్థులకు కూడా మూడు శాతం సీట్లు కేటాయించబడ్డాయని తెలిపారు. రూపాయలు రూ.200 రుసుమును చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పేద, దళిత, గిరిజన, వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు పంపడానికి చివరి తేదీ మే 15 అని గమనించగలరని తెలపిఆరు. ములుగు జిల్లాలో బాలురకు జాకారం, ఏటూరునాగారం, కళాశాలలు బాలికలకు ములుగు కళాశాల అందుబాటులో ఉన్నాయని ములుగు డిసిఓ టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వెంకటేశ్వర్లు తెలిపారు.

## తక్షణమే జనగణనతో పాటు కులగణన చేయాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రాములు




**ప్రజాపక్షం/ హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే జన గణన తో పాటు కుల గణన కూడా చేయాలని కుల జనాభా ఆధారంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బిసి అభివృద్ధికి తోడ్పడాలని తాటిపాముల వెంకట్ రాములు పిలుపునిచ్చారు. శనివారం హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిసి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట రాములు మాట్లాడుతూ చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు బిసిలకు కల్పించాలని డిమాండ్ చేసినారు. అనంతరం ఒబిసి ఆల్ ఇండియా జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ బిసిలకు విద్యా ఉద్యోగాలలో స్థానిక సంస్థలలో కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్టు తక్షణమే 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పాలకుల డిమాండ్ చేశారు. ఎస్‌సి ఎస్‌టి బిసిలు ఐక్య పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బానిస దోపిడీ స్వభావ భావజాలాన్ని నిరోధించుటకు భౌతిక భావజాలాన్ని విస్తృత ప్రాచుర్యంలోకి తేవాలన్నారు. రాజ్యాధికారమే సకల సమస్యలకు పరిష్కారం అని, అందుకు ఇండియా కూటమి లాంటివి మరింత బలపడాలని పేర్కొన్నారు. బట్టి శ్యామ్ యాదవ్ బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జనాభాలో 90 శాతం గా ఉన్న బిసి సమాజం పది శాతం గా ఉన్న ఎక్కువ కులంచే పాలించబడడం విచారకరమన్నారు. దేశంలో వేయబడిన అన్ని బిసి కమిషన్లు బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించినప్పటికీ పాలకులు పాటించడం లేదని ధ్వజమెత్తారు. భారత్ బచావో నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బిసిలు అంటే బెస్ట్ క్లాస్ నైపుణ్యత కలిగిన బిసిలను పాలకులు కావాలని ఆర్థికంగా సాంఘికంగా వెనకకు నెట్టివేసి వెనుకబడిన తరగతులను ఎద్దేవ చేస్తున్నారని మండిపడ్డారు. సైంటిఫిక్ స్టూ డెంట్ ఫెడరేషన్ చార్వాక మాట్లాడుతూ కులం, మతం లేని సమాజం కొరకు విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించుకోవడం ద్వారా బిసి సమాజం చైతన్యవంతమైతే విప్లవం అనివార్యమని పేర్కొన్నారు. బిసి హక్కుల సాధన సమితి హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగనన చేసి బిసి బిల్లు పెట్టాలి పార్లమెంటులో పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి కోర్టు అడ్డంకులను నిరోధించాలని తెలిపారు. ఈ సమావేశంలో బైరి తిరుపతి, మడ్డి రాజారాం, బి రమేష్, టి ప్రశాంత్, పి రామ్ గోపాల్ చారి, జిర రాజేందర్, సాత్విక్, వెంకటేష్ పులి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం తగదు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అలసత్వం చేయొద్దని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషషేక్ అధికారులను హెచ్చరించారు. రైతుల ధాన్యం కాంటా వేసిన వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. శనివారం జనగామ మండలంలోని వడ్డకొండ, శామీర్‌పేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ధాన్యం విక్రయించిన రైతు నర్సింగరావుకు పోన్‌చేసి డబ్బులు జమ అయ్యాయా.. లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఈ నెల 10న ఐకెపి సెంటర్‌కు ధాన్యం తీసుకెళ్లగా 12న తాలు తీసి 13వ తేదీన కాంటా వేయడం జరిగిందన్నారు. 30 క్వింటాళ్ల 40 కిలోల ధాన్యం విక్రయించగా 17వ తేదీన 71 వేల రూపాయలు తన ఖాతాలు జమ అయ్యాయని తెలిపారు. దీనిపై కలెక్టర్ సంతృప్తి చెందారు. ప్రతి రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్‌డిఓ గోపిరామ్, తహసీల్దార్ హుస్సెన్ పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పరిశీలన**

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషషేక్ శనివారం జనగామ పట్టణంలోని 14వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతోకలిసి పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగాలబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. భూ భారతిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి. శనివారం జనగామ పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదని కోర్టులను ఆశ్రహించాల్సి వచ్చేదన్నారు. భూ భారతి చట్టంలో ఉన్న అప్పీల్ వ్యవస్థ ద్వారా దాదాపు జిల్లా పరిధిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ధరణిలో ప్రతి దరఖాస్తు కలెక్టర్ వద్దకే వచ్చేదని భూ భారతి ద్వారా తహసీల్దార్, ఆర్‌డిఒవద్దనే సమస్యలకు పరిస్కారం దొరుకుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, ఆర్‌డిఓ గోపిరామ్, తహసీల్దార్ హుస్సెన్, రైతులు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన పెంచుకోవాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** భూ భారతిపై అవగాహన పెంచుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జిఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌నందు శనివారం ప్రజాపాలన ప్రగతి బాట భూభారతి చట్టం, భూ పోర్టల్ పై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య , మండల, జిల్లా అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సదస్సుకు హాజరైన రైతులకు భూ భారతి చట్టంవిది విధానాలను వివరించారు.రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్ధమయ్యేలా అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.....గత కొన్నేళ్లుగా రైతులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని,ధరణి అనేది రైతుల పాలిట శాపంలా దాపురించిందన్నారు.ధరణి వచ్చిన తర్వాత ఏదైనా పొరపాటును సవరించడానికి కూడా ఏ స్థాయిలోనూ స్పష్టత లేకపోవడంతో రైతులు కష్టాల పాలయ్యారన్నారు. రైతులకు సంపూర్ణమైన హక్కును కల్పించే విధంగా కొత్త చట్టం ద్వారా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తుందని,రైతులు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు చట్ట బద్ధమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. గతంలో భూమీ సమగ్ర సర్వేను తీసుకువచ్చి పూర్తి చేయలేకపోయారని దీంతో రైతుల సమస్యలు అలాగే ఉండిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంటేనే కెసిఆర్.. కెసిఆర్ అంటేనే తెలంగాణ

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి:** తెలంగాణ అంటేనే కెసిఆర్. కెసిఆర్ అంటేనే తెలంగాణ అని మాజీ మంత్రి, శాసనసభ్యుడు తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఎల్కతుర్తికి శనివారం రజితోత్సవ సభా పరిశీలనకు హరీష్‌రావుతో పాటు హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరెస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు విచ్చేశారు. అనంతరం ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సభా ప్రాంగణం వద్ద విలేకర్ల సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ అంటేనే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే తెలంగాణ అన్నారు రైతుల కోసం కొత్త ప్రాజెక్టులు కట్టింది, ఉచిత విద్యుత్ వ్యవసాయానికి ఇచ్చింది, కల్యాణ లక్ష్మి పథకం ఇచ్చింది కెసిఆర్ ప్రభుత్వమే అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం పెండ్లై పిల్లలు పుట్టిన కల్యాణ లక్ష్మి పథకం రావట్లేదని ఆందోళన చెందుతున్నారని, మళ్లీ తెలంగాణకు మంచి రోజులు రావాలంటే రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని పథకాలు అమలు అవుతాయని, కొత్త పథకాలు దేవుడు ఎరుగు ఉన్న పథకాలనే అమలు చేయలేక పోతున్న అసమర్థుల ప్రభుత్వం అని అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత కేసిఆర్ కి దక్కింది అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు మన కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీ ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత సీనియర్ నాయకులు, వివిధ హోదాల నాయకులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/దామెర :** భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును అధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రైతులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధరణి అనేది రైతుల పాలిట శాపంలా దాపురించిందన్నారు. ధరణి వచ్చిన తర్వాత ఏదైనా పొరపాటును సవరించడానికి కూడా ఏ స్థాయిలోనూ స్పష్టత లేకపోవడంతో పా టు అధికారాలు లేవన్నారు. రైతులకు తమ భూమిపై సంపూర్ణ హక్కులు ఉ న్నా రికార్డు వద్దకు వచ్చేసరికి ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తున్న దృష్ట్యా ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ధరణిని అధికారంలోకి వచ్చాక తీసేస్తామని హామీ ఇచ్చారని ఉన్నారు. రైతులకు సంపూర్ణమైన హక్కును కల్పించే విధంగా కొత్త చట్టం ద్వారా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. కొన్ని భూ ములు ధరణిలో కనబడకుండా పోయాయని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. అవగాహన సదస్సులో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతిపై జిల్లా వ్యాప్తంగా రైతులు ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధరణిలో కొన్ని భూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం లేకపోయిందని అన్నారు. భూ సమస్యలను చట్టం ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ఈ సదస్సులో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో కల్పన, ఇతర అధికారులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, పాల్గొన్నారు.

## లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రెండో దఫా గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. శనివారం వరంగల్ నగరం, బల్దియా పరిధి 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే తీరును క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. రెండో దఫా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హులేనా కదా అన్న విషయాన్ని భౌతికంగా పరిశీలించి, డేటా ఆధారంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు సమర్ధంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతో జరగాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200ఇండ్లకు నియమించిన ప్రత్యేక అధికారి అత్యంత జాగ్రతతో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు అర్హతల పరిశీలన ప్రక్రియ పూర్తికావాలన్నారు. భూమి విస్తీర్ణం 60 గజాలకు మించకూడదని, గతంలో బేస్మెంట్, పిల్లర్స్ కట్టిన వారు ఇందిరమ్మ పథకానికి అర్హులుకారనే విషయాన్ని గుర్తించాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకంనకు ఎంపికైనవారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిసిఇఓ రామిరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతి, కార్పొరేటర్ వస్కుల బాబు, ప్రత్యేక అధికారి రమేష్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ


## అతడి కోసం ప్రయత్నించి విఫలమయ్యాం! : ఎస్ఆర్‌హెచ్

ఐపిఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శన చేస్తూ అభిమానులను నిరాశప రుస్తోంది. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచుల్లో ఆరింటిలో ఓడి పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో నిలిచింది. అయితే తాజాగా చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచులో విజయం సాధించి ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవం చేసుకుంది. అయితే మ్యాచ్ అనంతరం ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జట్టు.. మెగా వేలంలో ఓ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ను దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీ పడిందని, కానీ కొనుగోలు చేయలేక పోయిందని చెప్పాడు.

**అతడెవరంటే?**

గుజరాత్ టైటాన్స్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ రవిశ్రీనివాసన్ సాయి కిశోర్ ప్రదర్శన తనను బాగా ఆకట్టుకుందని తెలిపాడు హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి. 'కిశోర్ కు మంచి భవిష్యత్ ఉంది. అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. ముంబై జట్టులో మిచెల్ శాంట్నర్, పంజాబ్ కింగ్స్ తరఫున హర్‌ప్రీత్ బ్రార్ మంచిగా ఆడుతున్నారు. ఇక సాయి కిశోర్ అద్భుతం. మెగా వేలంలో అతడిని కొనుగోలు చేసేందుకు బాగా ప్రయత్నించాం. చాలా దగ్గరి వరకు వెళ్లాం. అతడు మా జట్టులో ఉండాలని కోరుకున్నాం.ఇతడు ఆడే విధానం.. ఇతర స్పిన్నర్లకు ఓ టెంప్లెట్ సెట్ చేస్తుంది. పోటీ పడి మరీ ఎలా విజయం సాధించొచ్చో అతడు చూపించగలడు. మంచి బ్యాటింగ్ పిచ్‌లపై కూడా అతడు మంచి ప్రదర్శన చేశాడు,' అని వెట్టోరీ పేర్కొన్నాడు

## ఐపిఎల్‌కు, రంజీ ట్రోఫీ ఆటగాళ్ల గుర్తింపులో అసమానత -సునీల్ గవాస్కర్



ఐపిఎల్‌కు, రంజీ ట్రోఫీ వంటి దేశీయ టోర్నమెంట్లకు మధ్య భారీ వ్యత్యాసంపై భారత మాజీ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆటగాళ్లకు లభించే గుర్తింపు, జీతాలలో ఈ అసమానత స్పష్టంగా కనిపిస్తుందని ఆయన ఎత్తి చూపారు. స్పోర్ట్‌స్టార్ మేగజైన్ లో రాసిన ఒక వ్యాసంలో సునీల్ గవాస్కర్ భారత క్రికెట్‌పై ఐపిఎల్ సిరీస్ ప్రభావంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, యశస్వి జైస్వాల్ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను అభివృద్ధి చేయడంలో ఐపిఎల్ కీలక పాత్ర పోషించిందని ఆయన ప్రశంసించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాలా మంది తెలియని ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చిన ఘనత ఐపీఎల్ కు ఉందని ఆయన అన్నారు. ఐపిఎల్, దేశీయ క్రికెట్ మధ్య తేడాపై ఆందోళన అయితే ఐపిఎల్, దేశీయ పోటీలలో ఆటగాళ్ల ప్రదర్శనలను ఎలా చూస్తారో, వారికి ప్రతిఫలం ఇచ్చే విధానంలో పెద్ద వ్యత్యాసాన్ని సునీల్ గవాస్కర్ ఎత్తిచూపారు. ఐపిఎల్ లో ఒక మంచి ప్రదర్శన తెలియని ఆటగాడిని కూడా గొప్ప గుర్తింపు, ఉన్నత అవకాశాలను అందిస్తుంది. ఇది రంజీ ట్రోఫీకి పూర్తి విరుద్ధమని. ఇక్కడ మంచి ఆటగాళ్లు కూడా వార్తల్లో నిలిచేందుకు ఇబ్బంది పడుతున్నారని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చారు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ రూ. 1.1 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని సునీల్ గవాస్కర్ ఉదహరించారు. భారత సాంప్రదాయ దేశీయ పోటీలలో నిలకడగా రాణించే ఆటగాళ్లకు అలాంటి అవకాశాలు లభించడం చాలా అరుదని చెప్పుకొచ్చారు. ఆర్థిక అసమతుల్యతను కూడా గవాస్కర్ ఎత్తి చూపారు. రంజీ, విజయ్ హజారే లేదా సయ్యద్ ముష్తాక్ అలీ సిరీస్ లో అయినా ఆడే ఆటగాళ్లకు.. ఐపిఎల్ ఆడే ఆటగాళ్ల సంపాదనలో చాలా తేడా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఒక ఆటగాడికి జీవితాంతం రంజీ ట్రోఫీ ఆడి సంపాదించే దానికంటే ఎక్కువ డబ్బు ఐపిఎల్‌లో ఒకే సీజన్‌లో సంపాదించవచ్చని చెప్పడానికి చాలా ఉదాహరణలు ఉన్నాయని గవాస్కర్ అన్నారు. స్థానిక పోటీలలో కష్టపడి ఆడే ఆటగాళ్ల పరిస్థితి దారుణంగా ఉందని కూడా ఆయన అన్నారు.

దీనికి పరిష్కారంగా రాష్ట్ర క్రికెట్ సంఘాలు స్థానిక ఆటగాళ్లకు తమ మద్దతును పెంచాలని గవాస్కర్ సూచించారు. ముంబై వంటి ఇతర రాష్ట్ర క్రికెట్ సంఘాలు కూడా రంజీ ఆటగాళ్లకు బిసిసిఐ చెల్లించే జీతాలకు సమానమైన జీతాలను చెల్లిస్తే ఈ అసమతుల్యతను కొంతవరకు తగ్గించవచ్చని గవాస్కర్ సూచించారు. ఐపిఎల్ సిరీస్ ప్రయోజనాలను గవాస్కర్ ధృవీకరించినప్పటికీ ఆయన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. భారతదేశంలోని ప్రధాన దేశీయ పోటీలకు వాటి గౌరవం, ప్రాముఖ్యతను తిరిగి ఇవ్వాలని.. అన్ని ఫార్మాట్లలో స్థిరంగా మంచి ప్రదర్శన ఇచ్చే ఆటగాళ్లకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని సునీల్ గవాస్కర్ అన్నారు.

## ఐపిఎల్ 'కాస్ట్లీ' ప్లేయర్..!



'హై షాప్.. టేస్ట్‌లెస్ డిష్' అనే సామెత దాదాపు అన్ని ఐపిఎల్ సీజన్లకు సరిపోతుంది. ఐపిఎల్‌లో పెద్ద పేరున్న ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తాయి. కానీ వారు తరచుగా అంచనాలను అందుకోవడంలో విఫలమవుతారు. ఐపిఎల్‌లోని ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై డబ్బుల వర్షం కురిపించినప్పుడు ఈ ఆటగాళ్లు తమకు అదృష్టాన్ని మార్చేవారిగా నిరూపిస్తారనే ఆశతో అలా చేస్తారు. ఈ కారణంగా లీగ్‌లో ఖరీదైన ఆటగాళ్ల సంఖ్య సీజన్ తర్వాత సీజన్ పెరుగుతూ వస్తోంది. ఐపిఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ రిషబ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది. పంత్ లీగ్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. కానీ పంత్ ఇప్పటివరకు విఫలమయ్యాడు. ఇది కొత్త విషయమేమీ కాదు. సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడు విఫలమవడం లీగ్ చరిత్రలోనే ఉంది.

ఈ సీజన్‌లో నిరాశపరిచిన ఖరీదైన ఆటగాడు

ఐపిఎల్ 2025లో రిషబ్ పంత్ ప్రదర్శన ఇప్పటివరకు ప్రత్యేకంగా ఏమీ లేదు. 18వ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 8 ఇన్నింగ్స్‌ల్లో రిషబ్ పంత్ 106 పరుగులు మాత్రమే చేశాడు. ఈ కాలంలో రిషబ్ పంత్ ఒకే ఒక అర్ధ సెంచరీ సాధించగలిగాడు. ఐపిఎల్ చరిత్ర కూడా అలాగే ఉంది. ఈ సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడు తన ప్రదర్శనతో నిరాశ చెందాడుచెందాడు. .

# రీల్




## 3డీలో 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' రీరిలీజ్

మెగాస్టార్ చిరంజీవి, అందాల భామ శ్రీదేవి జంటగా నటించిన బ్లాక్ బస్టర్ సోషియో ఫాంటసీ మూవీ 'జగదేక వీరుడు అతిలోక సుందరి' విడుదలై 35 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో ఈ యేడాది మే 9న ఈ చిత్రాన్ని 2డీతో పాటు 3డీలోనూ భారీ స్థాయిలో విడుదల చేయబోతోంది వైజయంతి మూవీస్ సంస్థ. ఈ విషయాన్ని శనివారం అధికారికంగా తెలిపారు. మే 9వ తేదీ పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ దాని విడుదల వాయిదా పడిందని, అందువల్లే 'జగదేక వీరుడు అతిలోక సుందరి' మూవీని గ్రాండ్ గా అశ్వనీదత్ రిలీజ్ చేస్తున్నారని తెలుస్తోంది. చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం విడుదల విషయంలో ఇంకా క్లారిటీ రాని నేపథ్యంలో మరోసారి 'జగదేక వీరుడు అతిలోక సుందరి'ని చూడగలగడం, అదీ త్రీడీ చూడబోవడం అభిమానులకు పండగే!




## అడ్వెంచర్ కథతో చైతూ సినిమా

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను దర్శకుడు కార్తీక్ దండు డైరెక్షన్‌లో తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమాను గతంలోనే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన రీసెర్చ్, దాని కోసం వారు పడ్డ కష్టం, ఇక సినిమా కోసం వారు రెడీ అవుతున్న తీరు ను ప్రెజెంట్ చేస్తూ ఓ ప్రీప్రొడక్షన్ వీడియోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. మిస్టిక్ థ్రిల్లర్‌గా రానున్న ఈ సినిమా కోసం అందరూ సిద్ధమయ్యారని ఈ వీడియో ద్వారా తెలిపారు. ఇక ఈ సినిమా కోసం భారీ బడ్జెట్‌ను కేటాయించారు. ఈ సినిమాలో చైతూ సరికొత్త లుక్‌తో అడ్వెంచర్ చేయబోతున్నాడని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



## అల్లు అర్జున్, అట్లీ మూవీలో ముగ్గురు హీరోయిన్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను తమిళ దర్శకుడు అట్లీతో చేయబోతున్నట్లు ఇటీవల అఫీషియల్‌గా అనౌన్స్ చేశాడు. ఇక ఈ సినిమాను భారీ బడ్జెట్ చిత్రంగా హెవీ వీఎఫ్ఎక్స్ వర్క్‌తో రూపొందించబోతున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్‌లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ సెలెక్ట్ అయ్యింది. ఇప్పటికే ఆమె ఈ సినిమా కోసం లుక్ టెస్ట్ కూడా చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ కూడా నటించ బోతున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు మరో హీరోయిన్ కూడా ఈ సినిమాలో ఉండనుందట. ముగ్గురు హీరోయిన్లతో అంతేగాక, అల్లు అర్జున్ తొలిసారి తన కెరీర్‌లో డబుల్ రోల్ చేయబోతున్నాడని తెలుస్తోంది. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## ఎల్‌జి, హోం శాఖదే

(మొదటి పేజీ తరువాయి)

వెలువడ్డాయి. అయితే, మంచు కురిసే సమయంలో మినహా ఏడాది పాటు తెరిచే ఉండే బైసరన్ పర్యాటక ప్రదేశం గురించి ఎన్నడూ పోలీసుల ధృవీకరణ కోసం కోరలేదని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపినట్లు ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ' లో వార్త కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ యంత్రాంగానికి జమ్మూ కశ్మీర్ పోలీసులు ఇంకా లాంఛనంగా తెలియజేయాల్సి ఉన్నదని ఆ అధికారి తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా బైసరన్ పచ్చిక బయలు పర్యాటకుల కోసం తెరిచే ఉంటుందని ఆయన వెల్లడించారు. అక్కడి పిక్‌నిక్ స్పాట్ గేటు మీద దానిని ''పహల్గామ్ డెవెలప్‌మెంట్ అథారిటీ, అనంత్‌నాగ్ డిస్ట్రిక్ట్'' నిర్వహిస్తున్నట్లు పోస్టర్‌తో పాటు, ప్రతి వ్యక్తికి రూ.35 ప్రవేశ రుసుం అని రాసి ఉంది. జమ్మూ కశ్మీర్‌ను రాష్ట్రం నుంచి 2019లో శాసనసభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతంగా హోదా తగ్గించి, 2024లో మొదటిసారి ఎన్నికలు నిర్వహించారు. శాంతి భద్రతల నిర్వహణ, పోలీసు, భద్రత బాధ్యత లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం, కేంద్ర హోం మంత్రిత్వశాఖకు ఉంటుంది. పర్యాటకం కేంద్ర పాలితంలో ఎన్నికైన పాలనాయంత్రాంగం కిందికి వస్తుంది. బైసరన్‌ను ఏప్రిల్ 20 నుంచి 22వ తేదీ మధ్య వెయ్యి లోపు పర్యాటకులు మాత్రమే దర్శించినట్లు గురువారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఎంపిలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలియజేశారు. హోటల్, రిసార్ట్ యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉండాల్సిందని, పర్యాటకులను పంపే ముందు సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను పాటించాల్సిందని ఆయన అన్నట్లు అఖిలపక్ష సమావేశానికి హాజరైన ఎంపిలు చెప్పినట్లు 'ది హిందూ' పత్రిక కథనంలో పేర్కొంది.

# ఉన్మాదం దేశానికి ప్రమాదకరం

- ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు
- -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- -వరద నర్సింహారావు సహా సిపిఐలో వందలాది మంది చేరిక
- -ఖమ్మంలో భారీ ప్రదర్శన





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉన్మాదం దేశానికి ప్రమాదకరమని దేశ భవిష్యత్తుకు అది గొడ్డలి పెట్టుగా మారనుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉన్మాదానికి, టెర్రరిజానికి మతం ప్రాధాన్యత కాదని అలజడి సృష్టించడం ప్రజలను హింసించడమే దాని లక్ష్యమని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం నగరానికి చెందిన వరద నర్సింహారావు సహా వందలాది మంది సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మం ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభా స్థలి వరకు డప్పు, కోలాట దళాలు వందలాది మంది కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ఉన్మాదులకు మతం లేదని గతంలో అనేక మంది ప్రముఖులను హతమార్చిన విషయంలోనూ ఇది రుజువైందన్నారు. టెర్రరిజం విషయంలో ఒక మతాన్ని బూచిగా చూపడం సరి కాదన్నారు. టెర్రరిస్టు దాడిని అంచన వేయడంలోనూ, అడ్డుకోవడంలోనూ వైఫల్యం చెందిన తర్వాత దేశ ప్రజల ఆలోచనలను మళ్లించే రీతిలో మోడీ, అమిత్‌షా లాంటి నేతలు ప్రకటనలు చేస్తున్నారని ఇది సరి కాదని ఆయన స్పష్టం చేశారు. విభిన్న మతాల, కులాల, భాషల సమ్మిళితమైన భారతదేశంలో ఏకపక్ష విధానాలు దేశ విచ్ఛిన్నానికి దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. ఉన్మాద మూర్ఖుల చేష్టలను ఒక మతానికి, ప్రాంతానికి ముడి పెట్టడం సరికాదన్నారు. పహల్గాం ఘటనలో ముస్లిం టెర్రరిస్టులు కాల్చి చంపితే అదే ఘటనలో గాయపడిన వారికి అనేక మందికి ముస్లింలు సేవలు అందించి ప్రాణాలు కాపాడరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న మోడీ తన అనుకూలురైన సంస్థల అధిపతులకు మేలు చేస్తున్నారన్నారు. కమ్యూనిస్టుల అవసరం ఈ దేశంలో పెరుగుతుందన్నారు. లౌకిక, ప్రజాస్వామిక వాదులు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారని ఈ దేశ ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన నాడు ప్రజా వ్యతిరేకులకు గుణపాఠం తప్పదన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ద్రోహం చేసిన ఎవరిని వదిలేది లేదన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రజల పక్షాన పనిచేయడమే అతి గొప్ప అధికారమని ఆయన తెలిపారు. వరద నర్సింహారావు సహా వందలాది మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, వరద నర్సింహారావు తదితరులు ప్రసంగించగా ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు,పోటు కళావతి, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, బోడా వీరన్న, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాలరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు

### భారీ ప్రదర్శన

సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముస్తఫానగర్ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభాస్థలి వరకు భారీ బహిరంగ సభ జరిగింది. డప్పు, కళా నృత్యాలు, కోలాటం దళాలు నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అగ్రభాగాన సిపిఐ జిల్లా నాయకత్వం నడవగా పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రదర్శనలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు సిపిఐలో చేరుతున్న సందర్భంగా ఆటో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పతాకాన్ని మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు.

## కేసులు వెల్లడించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి ఆచరణ నిబంధనలకు సమానమని అతని ఎన్నికను శూన్యం, చెల్లుబాటు కాదని ప్రకటించడానికి ఇది సరైన కారణం' అని హైకోర్టు తీర్పు పేర్కొన్నది.సుప్రీంకోర్టు ధర్మాసనం మాట్లాడుతూ 'హైకోర్టుకు సంబంధించబడిన నిషేదం ఉత్తర్వులు, తీర్పులను పిటిషనర్ సవాల్‌చేసిన దానిపై మేం వాస్తవాలను కనుగొనడంలో విఫలం అయ్యాం. దీనిపై కోర్టు ఆందోళన చెందుతున్నది. రాష్ట్ర ఎన్నికల సంఘం దీనికి సంబంధించి నిబంధనలు రూపొందించిన కారణంగా మేం అలా చెబుతున్నాం. అవి సరిగ్గా అమలు అవుతున్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించిన హైకోర్టు తీర్పు వెల్లడించింది. పంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆనిబంధనలకు తలొగ్గి వారిపై పెండింగ్‌లో ఉన్న కేసుల సమాచారం గురించి వెల్లడించాల్సిందే' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.ధర్మాసనం మాట్లాడుతూ 'ఏ సందర్భంలోనైనా మీ పిటిషనర్ బసంత్‌లాల్ చట్టం, నియమనిబంధనలు, కార్యకలాపాల గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదని సూచించింది. ఆయనపై వ్యతిరేకంగా క్రిమినల్ కేసు ఉన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి అఫిడవిట్ దాఖలు చేసిన కేసులు అది. అతని ఎన్నికను రద్దు చేయకుండా అతనిపై ఉన్న కేసు వాస్తవాన్ని దాచిపెట్టాడు' అని బెంచ్ పేర్కొంది. హైకోర్టు డివిజన్ బెంచ్ 2024, నవంబర్ 7న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బసంత్‌లాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన వాస్తవాలను వెల్లడించని కారణంగా ఇంతకుముందు తాను 6 సంవత్సరాలపాటు ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హుడిగా ఉన్నానని పిటిషనర్ బసంత్‌లాల్ కోర్టు ముందు తన సమస్యను లేవనెత్తారు.

## ఎసిబి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తుంది. రాత్రి వరకు కూడా దాడులు కొనసాగుతునే ఉన్నాయి.అయితే, హరిరాం.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కీలకంగా , టోలీచౌకిలోని హరిరామ్ ఇంట్లో తనిఖీల్లో భారీగా ఆస్తిపత్రాలను అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. గజ్వేల్లో 30 ఎకరాల వ్యవసాయ భూమి, అలాగే, మూడు బ్యాంక్ లాకర్లను ఎసిబి అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఈ సోదాల్లో భాగంగా అనధికారిక లావా దేవీలను కూడా గుర్తించే పనిలో ఎసిబి అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసును ఎసిబి నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరో వైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన తుది నివేదిక తీవ్ర దుమారం రేపుతోంది. వీటిని రీ డిజైన్ చేసి మళ్లీ నిర్మించాలని సిఫారసు చేసింది. నిర్మాణం, డిజైన్లో అన్నీ లోపాలేనని స్పష్టం చేసింది. ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టులో నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే మూడు బ్యారేజీలకు గండిని తేల్చేయడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరింది. ఇక, ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. రూ.లక్ష కోట్లతో నాసిరకం ప్రాజెక్ట్ నిర్మించారని.. కేవలం దోచుకోవడానికి మాత్రమే కాళే శ్వరం ప్రాజెక్టు నిర్మించారంటూ ఆయన వ్యాఖ్యానిం చారు. బ్యారేజ్ ఎందుకూ పనికిరాదని ఎన్‌డిఎస్‌ఎ రిపోర్ట్ తేల్చిం దని.. వచ్చే కేబినెట్లో ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టి స్తున్నామని.. చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు. ఎన్‌డిఎస్‌ఎ నివే దిక చూసి బిఆర్‌ఎస్ నేతలు సిగ్గుపడాలి. మీరే డిజైన్ చేశా రు..మీరే కట్టారు. అబద్ధాలతో బిఆర్‌ఎస్ బతకాలనుకుం టుం ది. నిర్మాణం చేసిన వాళ్లు.. చేయించిన వాళ్లు రైతులకు ద్రోహం చేశారు. బీఆర్‌ఎస్ రైతులకు క్షమాపణ చెప్పాలి. ఎన్డీఎ స్‌ఏ రిపోర్ట్‌పై అధ్యయనం చేస్తాం. కాళేశ్వరం రైతుల కోసం కా దు.. జేబులు నింపుకునేందుకు కట్టారు' అని మండిపడ్డారు. కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ కు ఈ రిపోర్టు అత్యంత కీలకం కానుంది. ఇప్పటికే పలుమార్లు జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరిపింది. ఫైన ల్‌గా కెసిఆర్, హరీష్ రావులను కూడా ప్రశ్నించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఎన్‌డి ఎస్‌ఎ రిపోర్టు రావడం బిఆర్‌ఎస్‌కు షాక్ లాంటిదే. ఇప్పుడు సాధారణ ప్రజలు.. పాలక పార్టీ నుంచి వచ్చే విమర్శలకు సమాధానాలు చెప్పుకోవాల్సి ఉంటుంది.మాజీ ఇరిగేషన్ అధికారి హరిరాం ఇంట్లో ఎసిబి సోదాలు రాజకీయ నేతల్లో చర్చానీయాంశంగా మారింది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com